ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us:
www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

13-11-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 282 పేజీలు: 10+4 వెల: 6.50



బుధవారం న్యూఢిల్లీలో బాంబు పేలుడు సంఘటనలో గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న ప్రధాని మోడీ

# అది ఉగ్ర ఘాతుకమే

## అధికారికంగా ప్రకటించిన కేంద్ర కేబినెట్

## నిందితులెవరినీ వదిలే ప్రసక్తే లేదు..

## బాధితులు, క్షతగాత్రులకు అండగా ఉంటాం

### ప్రధాని అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి భద్రతా సమీక్ష

### భూటాన్ నుంచి రాగానే ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, నవంబరు 12:** దేశరాజధానిలో కల్లోలం సృష్టించి కారుబాంబు పేలుడు ఘటన ఉగ్రవాదుల చర్యలేనని కేబినెట్ నిర్ధారించింది. ఈసంఘటన ఖచ్చితంగా కిరాతక ఉగ్ర ఘాతుకమేనని ప్రకటించింది. ఉగ్రవాదంపై పోరును కొనసాగించాలని కేబినెట్‌లో ఏకగ్రీవ నిర్ణయం జరిగింది. ఘటనకు కారకులైనవారిని చట్టంముందు నిలబెట్టి తీరాలని చేసినతీర్మానాన్ని కేంద్ర కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేబినెట్ భేటీ వివరాలను సమాచార మంత్రి అశ్వినివైష్ణవ్ మీడియాకు వివరించారు. తొలుత సమావేశంలో ఈ పేలుడు ఘటనలో మృతిచెందినవారికి సంతాప సూచకంగా రెండునిమిషాలు మౌనం పాటించారు. క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని, అమాయక పౌరులను బలితీసుకున్న ఉగ్రఘాతుకంలో ఎవ్వరినీ ఉపేక్షించేదిలేదని ప్రధానిమోడీ స్వయంగా కేబినెట్‌లోప్రస్తావించారు. దర్యాప్తుసంస్థలు శర వేగంగా దర్యాప్తును కొనసాగించాలని, >>2

## ఎన్ఐఎ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో 'సిట్' 2లో

# మరో భారీ పెట్టుబడి!

## నేటి ఉదయం వింటారన్న మంత్రి లోకేష్

**అమరావతి, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముందుకెళుతున్న కూటమి ప్రభుత్వం, మరో కీలక ప్రకటనకు సిద్ధమైంది. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఐదేళ్ల క్రితం రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన ఓ ప్రముఖ కంపెనీ తిరిగి రాబోతోందని ఆయన ప్రకటించారు. '2019లో కొత్త ప్రాజెక్టులను నిలిపివేసిన ఒక కంపెనీ, రేపు తుపానులా ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వస్తోంది. పూర్తి వివరాల కోసం ఉదయం 9 గంటలకు వేచి ఉండండి' అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. 'బిగ్ అన్ వీల్' అంటూ చేసిన ఈ పోస్టుకు ఇన్‌వెస్ట్ఇన్‌ఎపి, చూజ్‌స్పీడ్ చూజ్‌ఎపిఅనే హ్యాష్‌ట్యాగ్‌లను జతచేశారు. రాష్ట్రంలో పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తూ, పెట్టుబడులకు స్వర్గధామంగా ఎపిని తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ హ్యాష్‌ట్యాగ్‌లు ప్రతిబింబిస్తున్నాయి. కాగా, 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత పలు కంపెనీలు తమ కార్యకలాపాలను నిలిపివేయడం లేదా ఇతర రాష్ట్రాలకు >>2

# పేదల సొంతింటి కల సాకారం

## రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఇళ్లను వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం చంద్రబాబు

### వచ్చే ఉగాదికి మరో 5.9 లక్షల గృహప్రవేశాలు

### నిర్మాణంకోసం ముస్లింలకు అదనంగా రూ. 50 వేలు

### దేవగుడిపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి



బుధవారం దేవగుడిపల్లిలో గృహ అనుమతిపత్రాలు, ఇంటి తాళాలు చూపుతున్న లబ్ధిదారులు



బుధవారం దేవగుడిపల్లిలో లబ్ధిదారులకు గృహ అనుమతిపత్రాలు అందజేస్తున్న సిఎం చంద్రబాబు

**రాయచోటి, నవంబరు12 ప్రభాతవార్త:** 2029 నాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వచ్చే ఉగాది రోజున మరో 5.90 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తామని ప్రకటించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో బుధవారం నిర్వహించిన సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల ఇళ్లను దేవగుడిపల్లె సభా ప్రాంగణం నుంచే వర్చువల్‌గా ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి స్వయంగా ఇంటి తాళాలు అందజేశారు. సొంత స్థలాలున్న పలువురికి ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి పత్రాలు అందజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంగళవారం నాడు కనిగిరిలో ఎంఎస్ఎంఇ పార్కు ప్రారంభించాం. ఆ మరుసటి రోజే పేదలకు ఇళ్లు ఇవ్వడం ఆనందంగా ఉంది. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. ఇల్లంటే కేవలం నాలుగు గోడలు కాదు... ఒక కుటుంబానికి గౌరవం, సంతోషం, భద్రత, భరోసా. 1984లో ఎన్టీఆర్ దేశంలోనే మొదటిసారిగా పక్కా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించడంతో అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో 3 >>2

# 'నమో' అంటే నాయుడు, మోడీ

## ● ఎపిలో డబుల్‌ఇంజన్ సర్కార్ పరుగులు ● అద్భుతమైన అమరావతిని నిర్మిస్తున్నాం ● భారీ పెట్టుబడుల ఆకర్షణలో కొత్త చరిత్ర ● న్యూఢిల్లీలో యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో మంత్రి లోకేష్



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో మంత్రి నారా లోకేష్

**అమరావతి, నవంబరు 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో ఇకపై నమోఅంటే నరేంద్ర మోడీ కాదు.. నాయుడు అండ్ మోడీ. ఇద్దరు సమర్ధ నేతల నేతృత్వాన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన యుఎస్ - ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో మంత్రి లోకేష్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అడోబ్ చైర్మన్ శంతను నారాయణ్ సంధానకర్తగా వ్యవహరించారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి భారీ పెట్టుబడులతో మేం చరిత్ర సృష్టిస్తున్నాం. నేను 180 బిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధిని. మా లక్ష్యం 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ. ఎపిలో మేం అధికారంలోకి వచ్చిన కేవలం 17నెలల్లో ఇప్పటివరకు 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాం.

మా రాష్ట్రంలో గూగుల 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెట్టబోతోంది. ఆర్సెలర్స్ మిట్టల్ సంస్థ భారత్ లో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ను విశాఖపట్నం సమీపంలో నిర్మించబోతోంది. ఎపిలో భారీ పెట్టుబడులు రావడానికి 3 కారణాలు ఉన్నాయి. ఒకటి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. రెండోది మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లీడర్ షిప్ ట్రాక్ రికార్డు. 3వది డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి నాలుగు దశాబ్దాల సుదీర్ఘమైన ట్రాక్ రికార్డు ఉంది. ఒకసారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందంకుదుర్చుకున్న తర్వాత ప్రాజెక్టును >>2

# ఇమామ్‌లు, మోజన్ల వేతనాలకు 90 కోట్లు

## సిఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే జీవో

**అమరావతి, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం,సాధికారిత కోసం ఎన్డీఎ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన 24 గంటల్లోపే ఇమాములు, మోజన్లకు వేతనాల చెల్లింపుకు రూ.90 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం జరిగింది. బుధవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి వాడ్రేవు వినయ్ చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్డీఎ ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన 2024 ఏప్రిల్, మే, జూన్‌నెలకు సంబంధించిన వేతనాలు చెల్లించేందుకు కూడా నిధులు విడుదల చేయడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. 2024 జులై నుంచి డిసెంబర్ వరకు ఇమాములు, మోజన్‌లకు రూ.45 కోట్లు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో విడుదల చేసి వారి వారి అకౌంటులకు జమ చేసిన విషయం మంత్రి గుర్తు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరువరకు 9 నెలల వేతనాలతోపాటు, గత ప్రభుత్వం చెల్లించకుండా >>2

# ఆర్జీయుకెటి శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థి ఆత్మహత్య



సృజన్ (ఫైల్)

**శ్రీకాకుళం, నవంబరు 12 ప్రభాతవార్త:** ఆర్జీయు కెటి, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ (20) బుధవారం హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరు జిల్లా పాత గుంటూరు పట్టణంలో ఎటి అగ్రహారం నాలుగో లైన్‌కు చెందిన సృజన్ 2021-22 విద్యా సంవత్సరంలో ఈ క్యాంపస్‌లో చేరాడు. ప్రస్తుతం ఈ విద్యార్థి ఇంజనీరింగ్ ఇఇఇ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులకు మిడ్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. తోటి విద్యార్థులంతా మిడ్ పరీక్షలు రాసేందుకు వెళ్లగా సృజన్ మాత్రం బాలుర హాస్టల్ తాను ఉంటున్న నాలుగో అంతస్తు నుంచి మొదటి అంతస్తుకు దిగి తన స్నేహితుని గదిలో ఫ్యాన్‌కు తాడు బిగించి ఉరిపోసుకున్నాడు. ఉదయం 11 గంటల సమయంలో హాస్టల్ గదికి వచ్చి తోటి విద్యార్థులు చూసేసరికి తలుపులు మూసి ఉండగా, కిటికిలోంచి చూడగా సృజన్ ఫ్యాన్‌కు వ్రేలాడి ఉన్నట్టు విద్యార్థులు గుర్తించారు. ఈ విషయాన్ని విద్యార్థులు క్యాంపస్ అధికారులకు సమాచారం ఇవ్వగా, తలుపులు పగలుగొట్టి చూశారు. సృజన్‌ను క్యాంపస్‌కు చెందిన అంబులెన్స్‌లో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఎస్ఐ వి.సందీప్ కుమార్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. అనుమానస్పద మృతిగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు >>2

# అప్రూవర్‌గా ధర్మారెడ్డి

## కల్తీ నెయ్యి కేసులో పెద్ద ట్విస్ట్

## తాజా ఇఒ సింఘాల్‌ను కేసులోకి లాగే యత్నం!

## గత బోర్డు సభ్యులు ఇక తెరపైకి!



**తిరుపతి,నవంబరు 12ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో ధర్మకర్తలమండలి(బోర్డు)నే కీలకమన్న (సుప్రీమ్ అని) వ్యాఖ్యలు చేసిన, కల్తీనెయ్యికేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఇఒ ఎవి ధర్మారెడ్డి బుధవారం అప్రూవర్‌గా మారడం సంచలనం కలిగించింది. కల్తీనెయ్యిసరఫరా, కాంట్రాక్టు టెండర్లు అప్పగించడం, నెయ్యి వినియోగం వంటి విషయాలు కూడా గత టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఇష్టప్రకారమే జరిగిందని సిబిఐ సిట్‌కు వివరాలు వెల్లడించడంతో పెద్దట్విస్ట్ నెలకొంది. అంతేగాక 2019 జూన్‌నెల నుండి 2020 అక్టోబర్ నెల వరకు టిటిడి ఇఒగా (ప్రస్తుతం విధుల్లోఉన్న ఇఒ) అనిల్‌కుమార్ సింఘాల్ వ్యవహరించారని సిట్‌కు ధర్మారెడ్డిచెప్పడం మరోప్రత్యేకమైన అంశం. 2019 జూన్‌నెలనుండి 2020 అక్టోబర్‌నెల వరకు టిటిడికి అవసరమైన నెయ్యి సరఫరాచేయడానికి టెండర్లు పిలిచారా?పిలిస్తే ఎక్కడెక్కడ నుండి టెండర్లు దాఖలుచేశారు, ఏఏ డెయిరీ యాజమాన్యాలు పాల్గొన్నాయి, ఎలా టెండర్లు నిర్వహించి నెయ్యి సరఫరాకు అంగీకరించారనేది ఇప్పుడు సిట్ అధికారుల ముందు తేల్చాల్సిన పెద్ద ప్రశ్న. 2020వ సంవత్సరం నుండి 2024 మేనెల వరకు సరఫరా అయిన కల్తీనెయ్యి వెనుక ఇఒగా తన పాత్ర కేవలం నిమిత్తమాత్రమేనని ధర్మారెడ్డి రెండవ రోజు బుధవారంకూడా విచారణలో అదే విషయాన్ని వెల్లడించడం ఎంతవరకు నమ్మశక్యమనేది సిట్ తేల్చేపనిలో నిమగ్నంకానుంది. రాష్ట్రంలో 2019 మే 23న వైఎస్సార్సీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నెలరోజులకు 2019 జూన్ 22న టిటిడి నూతన ధర్మకర్తలమండలి (బోర్డు) ఏర్పాటు చేశారు. అప్పటి సిఎం >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

# అచ్యుతాపురం వద్ద ఘోర ప్రమాదం

## ఆటోను ఢీకొన్న బొలెరో.. ఇద్దరు మహిళలు మృతి

**జలుమూరు (శ్రీకాకుళం జిల్లా), నవంబరు 12 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలంలోని అచ్యుతాపురం హైస్కూల్ వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం టెక్కలిమండలం రావివలస ఎండల మల్లిఖార్జునస్వామిని దర్శించుకుని ఆటోలో శ్రీముఖలింగం దర్శనం చేసుకోవడానికి వస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగినది. ప్రయాణం చేస్తున్న ఆటోను >>2



విశాఖలో సిఐఐ సదస్సుకు ముస్తాబవుతున్న ప్రాంగణం

# భాగస్వామ్య సదస్సుకు విశాఖ రెడీ

## రేపటినుండి పెద్ద ఎత్తున భేటీలు

## దేశ, విదేశాలనుంచి హాజరవుతున్న ప్రతినిధులు

## ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

**సచివాలయం,నవంబరు12,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా నిర్వహిస్తున్న 30వ సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2025 కోసం విశాఖ సన్నద్ధం అయింది. సదస్సునువిజయవంతంగా నిర్వహించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్టనర్ ఇన్ ప్రొగ్రెస్ ఇండియస్ రోడ్ మ్యాప్ టు వికసిత్ భారత్ 2047 థీమ్‌తో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. 100కి పైగా విదేశీ ప్రతినిధులు పాల్గొనే అవకాశంతోపాటు పెట్టుబడులకు సంబంధించి 30కి పైగా అవగాహన ఒప్పందాలు జరగనున్నాయి. బుధవారం నుంచి సదస్సు ముగిసే శనివారం వరకు వివిధ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అవుతారు.

**నవంబర్ 13 గురువారం**

గురువారం విశాఖలో నోవటెల్‌లో పార్టనర్స్ ఇన్ ప్రొగ్రెస్ -ఇండియా-యూరప్ కోపరేషన్ ఫర్ సస్టెయినబుల్ గ్రోత్ అంశంపై జరిగే ఇండియా - యూరప్ బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాల్గొంటారు. గ్రీన్ షిఫ్ట్,సస్టైనబుల్ ఇన్నోవేషన్,యూరోపియన్ పెట్టుబడుపై >>2



బుధవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన మంత్రి నారాయణ

# అమృత్ పథకం నిధులు విడుదల చేయండి

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరిన మంత్రి నారాయణ

**విజయవాడ,నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో నగర,పురపాలక సంస్థల అభివృద్ధికి రావాల్సిన నిధులన్నింటిని కేంద్రీకరించాలని ఎపి పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేసారు. ఎపిలో మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధితో పాటు స్వచ్ఛత, మంచి నీటి వ్యవస్థ,అంతర్గత రహదారుల వ్యవస్థ పటిష్టకు సహకరించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ..ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. మున్సిపల్ శాఖకు సంబంధించి కేంద్ర పథకాల ద్వారా రావాల్సిన నిధుల కేటాయింపు,విడుదలపై ఆయన కేంద్రమంత్రితో చర్చించారు. అమృత్ పథకం నిధులు,15వ ఆర్థిక సంఘం పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరారు. అమరావతి నగర నిర్మాణానికి మరిన్ని నిధులు అవసరం వివరించారు. ఎపిలో నగరాల అభివృద్ధికి సహకరించాలని కోరారు, మంత్రి నారాయణ విజ్ఞప్తిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు.

# 'నమో' అంటే నాయుడు, మోడీ

>> మాదిగా భావించి పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. పూర్తి పారదర్శకమైన విధానాలు అనుసరిస్తుండటంతో ఒకరివెంట మరొకరు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఎఐ, క్వాంటమ్ వంటి అధునాతన సాంకేతికలను అందిపుచ్చుకుంటూ క్లస్టర్ బేస్డ్ అభివృద్ధికి మేం ప్రాధాన్యతనిస్తున్నాం. హైదరాబాద్ ఐఎస్‌బి నమూనాలో ఆంధ్రప్రదేశ్‌లో ఎఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. మా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్త నగరాలు నిర్మించిన ట్రాక్ రికార్డు ఉంది. ఇప్పుడు అమరావతి మాదిరిగానే గతంలో సైబరాబాద్ నిర్మించారు. సింగపూర్ ఆర్చిటెక్టుల ద్వారా కృష్ణానది పరీవాహకంలో గుంటూరు - విజయవాడల నడుమ సుందరమైన అమరావతి నగర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సమయం నడుస్తోంది. గూగుల్, మెటా, ఆర్సెలర్ మిట్టల్ వంటి భారీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా మీ కళ్లముందే చరిత్ర సృష్టించబోతున్నాం. మీరు మా రాష్ట్రాన్ని సందర్శించి మేం అమలు చేస్తున్న విధానాలను పరిశీలించండి. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నెం.1గా ఉండాలన్నదే మా ఆకాంక్ష. పరిశ్రమల ఆకర్షణకు హాస్పిటాలిటీ కూడా చాలా ముఖ్యం. ఇందుకోసం రాబోయే అయిదేళ్లలో 50వేల హోటల్ రూమ్‌లను సిద్ధం చేయాలని నిర్ణయించాం. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఐటి శాఖ ద్వారా భవిష్యత్ సాంకేతికలను యువతకు అందించేం దుకు ఆశాఖను చేపట్టాను. దేశంలో హెచ్ఆర్‌డి, ఐటి శాఖల కలసి నిర్వహించిన మంత్రిని తాను మాత్రమే నని మంత్రి లోకేష్ చెప్పారు.

# అది ఉగ్ర ఘాతుకమే

>> సమగ్ర దర్యాప్తుతో నిందితులను ఎవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేకుండా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీలకు సూచించింది. అలాగే సంఘటనకు సంబంధించి దర్యాప్తు సంస్థలు స్పందించిన తీరును కేబినెట్ ప్రశంసించింది. సకాలంలో వారికి వైద్యసేవలు అందించిన వైద్యులు, ఇతర సిబ్బంది కృషి ప్రశంసనీయమని పేర్కొంది. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం కొనసాగించాల్సిందేనని అభిప్రాయపడింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు మద్దతుగా వచ్చిన వివిధ దేశాధినేతల సందేశాలను స్వాగతిస్తూ వారికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానించారు. నగరంలోని ఎర్రకోటవద్ద జరిగిన కారుబాంబు పేలుడుకు సంబంధించి ప్రధానిమోడీ అత్యున్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అంతకుముందు జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్‌కమిటీ సమావేశం కూడా ప్రధాని మోడీ తన నివాసంలో జరిగింది. సాయంత్రం 5.30 గంటలకు జరిగిన ఈ సమావేశంలో మొత్తం పరిస్థితికి సంబంధించిన నివేదికలను కోరారు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న దర్యాప్తు వివరాలను కూడా ఈసందర్భంగా అధికారులు ప్రధానికి వివరించారు. 12 మంది చనిపోయారని, 25 మందికిపైగా గాయపడ్డారని, కారును పదిరోజులముందే కొనుగోలుచేయడం, రెండేళ్లుగానే కుట్రలుచేస్తూ రిపబ్లిక్‌డే రోజున ఏకకాలంలో పలు చోట్ల పేలుళ్లకు కుట్రలుచేసినట్లుగా దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలను ప్రధాని మోడీకి వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, దర్యాప్తు ఏజెన్సీల సీనియర్ అధికారులు ఇంటెలిజెన్స్ అధికారులు, ఎన్ఎస్ఎ అజిత్‌దోభాల్ తదితరులు హాజరయి ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. నిందితులు ఎట్టిపరిస్థితుల్లోను ఉపేక్షించబోమని ఉగ్రవాదానికి తావులేదని, చట్టంముందుకు తీసుకురావాల్సిందేనని అధికారులకు మోడీ స్పష్టంచేసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఎగుమతుల ప్రోత్సాహక మిషన్‌కు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్‌సమావేశంలో చర్చించి ఆరేళ్లపాటు కొనసాగే ఈప్రాజెక్టుకు రూ.25,060 కోట్లు కేటాయించారు. ఎగుమతుల ఎకో సిస్టమ్‌ను మరింత బలోపేతంచేసేందుకే ఈ మిషన్‌ను తెచ్చినట్లు మోడీ వివరించారు.ఎగుమతిదారులకోసం క్రెడిట్ గ్యారంటీ పథకం విస్తరణకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

**ఎల్ఎన్‌జె ఆసుపత్రిలో బాధితులకు పరామర్శ**

అంతకుముందు భూటాన్ పర్యటనను ముగించుకుని భారత్‌కు వచ్చిన ప్రధాని మోడీ ఎయిర్‌పోర్టునుంచే నేరుగా లోక్‌నాయక్ జయప్రకాష్‌నారాయణ్ ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. సంఘటన జరిగిన తీరు, నెలకొన్నపరిస్థితులను వారినుంచే అడిగి తెలుసుకున్న ప్రధానిమోడీ బాంబుపేలుడు కుట్రదారులను న్యాయస్థానం ముందు నిలబెడతామని, మీకు అండగా మేం ఉన్నామంటూ బాధితులకు భరోసా ఇచ్చారు. బాధితులు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు. అక్కడే ఉన్న అధికారులు, వైద్య నిపుణులనుంచి వివరాలు తీసుకున్నారు. చికిత్స అందుతున్న తీరుపై ఆరాతీసారు. ఆసుపత్రి సందర్శించిన తర్వాత ప్రధానిమోడీ తన ఎక్స్ ఖాతాలో స్పందించారు. ఢిల్లీ పేలుడులో గాయపడిన వారిని ఎల్ఎన్‌జె ఆసుపత్రిలో కలిసానని, వారంతా సత్వరమే కోలుకోవాలనిప్రార్థిస్తున్నానని తెలిపారు. హేయమైన కుట్రకు పాల్పడినవారిని తప్పక న్యాయస్థానంముందు నిలబెడతామని ఆయన అన్నారు.

# భారీ పెట్టుబడి!

>> తరలివెళ్లడం జరిగిందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆగిపోయిన ప్రాజెక్టులను పునఃప్రారంభించడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో, లోకేష్ ప్రకటించిన ఆ సంస్థ ఏది? ఎంత పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టబోతోంది? అనే అంశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సస్పెన్స్‌కు తెరపడాలంటే గురువారం ఉదయం 9 గంటల వరకు వేచి చూడాల్సిందే.

# పేదల సొంతింటి కల సాకారం

>> లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశాం. పీఎంఏవై బీఎల్సీ కింద 2,28,034 ఇళ్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద 65,292 ఇళ్లు, పీఎంఏవై జన్మన్ కింద 6,866 ఇళ్లు మొత్తం కలిపి 3,00,192 ఇళ్లు నిర్మించాం" అని సిఎం చంద్రబాబు తెలిపారు.

**గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను కూల్చేసింది**

"2014–2019 మధ్య రూ.16 వేల కోట్ల వ్యయంతో 8లక్షల ఇళ్లు పూర్తి చేశాం. గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను చిదిమేసింది. 4.73 లక్షల ఇళ్లు రద్దు చేయడమే కాకుండా... 2.73 లక్షల మంది లబ్ది దారు లకు చెల్లించాల్సిన రూ.900 కోట్లు బకాయిలు పెట్టింది. ఆ బకాయిలను చెల్లించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. గత పాలకులు గృహ నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేశారు. నివాస యోగ్యం కాని చోట్ల పేదలకు స్థలాలు ఇచ్చారు... ఇళ్లు నిర్మించకుండా వదిలేశారు. ఇళ్ల స్థలాల స్కీం పేరుతో స్కాం చేశారు. చదును చేసే పేరుతో అవినీతికి పాల్పడ్డారు. చివరకు ఇసుకలోనూ కోట్లు దోచుకున్నారు. ఐదేళ్లలో కేంద్రం డబ్బులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకున్నారు. ఇది పేదల ప్రభుత్వం. పేదలకు న్యాయం చేయడం కోసం అనునిత్యం పని చేస్తున్నాం. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం ఇచ్చే డబ్బే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇస్తోంది. పట్టణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేస్తోంది. దీనికి అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50,000, ఎస్టీలకు రూ.75,000, పీవీటీజీలకు రూ.1,00,000 చొప్పున ఇస్తున్నాం. ఇకపై ముస్లింలకు కూడా రూ.50 వేలు అదనంగా అందజేస్తాం. దాదాపు 6 లక్షల మంది ఇళ్లు కట్టుకునే స్తోమత లేక నిలిచిపోయారు. వీటిని పూర్తి చేసేందుకు మేం సహకరిస్తాం. ఈ నిర్ణయంతో 3.73 లక్షల మంది బీసీలకు, 1.57 ఎస్సీలకు, 46 వేల మంది ఎస్టీలకు, 22 వేల మంది గిరిజనులకు మేలు జరుగుతుంది. ఈ అదనపు సాయం వల్ల ప్రభుత్వానికి రూ.3,220 కోట్లు ఖర్చవుతుంది. ఇంటి నిర్మాణాలు చేపట్టడంతోపాటు... తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, గ్యాస్ కనెక్షన్, సోలార్ విద్యుత్, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం**

"సుస్థిర ప్రభుత్వంతోనే సుపరిపాలన, అభివృద్ధి సాధ్యం. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలి. డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేస్తాం. రూ.50 వేల కోట్ల బ్యాంకు రుణాలు తీసుకున్న పొదుపు మహిళలు సకాలంలో చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంటిపైనే కరెంటు తయారు చేసుకునేలా సోలార్ ఏర్పాట్లు చేస్తాం. ఒకప్పుడు పొలంలో పంటలు పండేవి. ఇప్పుడు కరెంటు ఉత్పత్తి చేసే పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను కూడా నిర్వీర్యం చేసింది. జల్ జీవన్ మిషన్ ద్వారా కేంద్రం ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు ఇవ్వాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం పులివెందులకు కూడా నీరివ్వలేదు. త్వరలో పులివెందులకూ తాగునీరు అందిస్తాం. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ అమలు చేశాం. మహిళలకు దీపం పథకం కింద ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. అర్హులకు పింఛన్లు, తల్లికి వందనం, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. రైతులకు మూడు విడతలుగా ఆర్థిక సాయం అందించేలా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 మందిని ఉపాధ్యాయులుగా భర్తీ చేశాం. కూటమి ప్రభుత్వం వచ్చిన 17 నెలల కాలంలో రూ. 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాం. విశాఖ సిఐఐ సదస్సులో మరో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుంటాం. 20లక్షల మందికి ఉద్యోగాల కల్పన హామీకి కట్టుబడి ఉన్నాం. ఐదేళ్లలో కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేకపోయారు. కూటమి ప్రభుత్వం రాగానే రూ.500 కోట్లు విడుదలచేసి రోడ్లన్నీ మరమ్మతులు చేస్తున్నాం. ప్రజలుకూడా తమ ఆలోచన విధానాన్ని మార్చుకోవాలి. కులం, మతం, ప్రాంతం అని చూడకుండా... మంచి చేసే వారిని ఆశీర్వదించాలి." అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**నదుల అనుసంధానంతో కరువుకు చెక్**

"నదుల అనుసంధానం నా జీవిత ఆశయం. గంగా-కావేరి అనుసంధానం జరిగితే దేశంలో కరువు అనే మాట వినపడదు. సాగునీటి ప్రాజెక్టులను నేను ఎన్నడూ నిరక్ష్యం చేయలేదు. కరువు రహిత రాష్ట్రంగా ఎపిని తయారు చేస్తాం. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో తాగు, సాగు నీటి కొరత లేకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నాం. వెనిగల్లు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. మరో రూ.22 కోట్లు ఇస్తే మరిన్ని చెరువులకు నీరు అందే అవకాశం ఉండటంతో వెంటనే మంజూరు చేస్తున్నాం. వచ్చే ఏడాదికి శ్రీనివాసపురం రిజర్వాయర్ పూర్తి చేస్తాం. ఇక్కడ నుంచి చిత్తూరుకు హంద్రీనీవా నీరు మళ్లిస్తాం. అలాగే మొదటి ఫేజ్ లో నల్లమల సాగర్ ద్వారా వెలుగొండకు నీళ్లు తెస్తాం. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నాం. 2029 నాటికి స్వర్ణాంధ్ర సాకారం దిశగా అడుగులు వేస్తున్నాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారధి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వేతనాలకు 90 కోట్లు

>> పెండింగ్‌లో పెట్టిన మూడు నెలల వేతనాలను కూడా కూటమి ప్రభుత్వం ఒకేసారి చెల్లించేందుకు రూ.90 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. మైనారిటీల పక్షపాతి చంద్రబాబు అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నేటి వరకు మైనారిటీల సంక్షేమానికి చంద్రబాబు ఒక విజయంతో చేస్తున్న కృషి రాష్ట్రంలోని మైనార్టీలు ఎప్పటికీ మరువలేరని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మైనారిటీ ల సంక్షేమాన్ని పూర్తిగా అణగదొక్కే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కార్యాచరణ బద్ధంగా ముందుకు సాగుతుందని అన్నారు. ఇమాములకు, మోజాన్లకు గౌరవ వేతనం చెల్లింపుకు టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు శ్రీకారం చుట్టారని, అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో ఒక పక్క చెల్లింపుల్లో జాప్యం, మరోపక్క నెలల తరబడి చెల్లింపులు నిలిపివేశారని విమర్శించారు. మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో ఇచ్చిన హామీని కేవలం 24 గంటల లోపే నెరవేర్చి, రూ.90 కోట్లు విడుదల చేస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి ముస్లిం సమాజం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# విద్యార్థి ఆత్మహత్య

>> చేస్తున్నారు. గుంటూరుకు చెందిన సృజన్ తండ్రి కృష్ణప్రసాద్ ఆటో డ్రైవర్ కాగా, తల్లి జ్యోతి గృహిణి. ఈ దంపతులకు ఇద్దరు సంతానం, కాగా, వీరిలో సృజన్‌తో పాటు సోదరి ఉన్నారు. విద్యార్థి సృజన్ మృతిపై పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. తృతీయ సంవత్సరం చదువుతున్న ఈ ఫిల్మ్ మేకింగ్ పట్ల ఆసక్తి చూపేవాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు.అయితే ఆత్మ హత్యకు గల కారణాలపై పూర్తిస్థాయి పోలీసులు దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెల్లడవు తాయి.

ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో విద్యార్థి సృజన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు క్యాంపస్‌ను సందర్శించారు. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వివరాలను ఆరా తీశారు. విద్యార్థుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని పర్యవేక్షణ పెంచాలని అధికారులకు సూచించారు.

# అప్రూవర్‌గా ధర్మారెడ్డి

>> వైఎస్ జగన్మోహన్ రెడ్డికి స్వయాన బాబాయి వైవి సుబ్బారెడ్డిని ఛైర్మన్‌గా నియమించారు. ఆయన నేతృత్వంలో 38మంది వరకు జంబో పాలకమండలి ఏర్పాటైంది. ఆ సభ్యుల్లో కొందరు కీలకంగా కొనుగోళ్ల కమిటీలో సభ్యులుగా కూడా వ్యవహరించారు. మరీవారందరినీ ఇక సిట్ విచారణకు పిలుస్తుందా? లేక రేపోమాపో మాజీఛైర్మన్ వైవి సుబ్బా రెడ్డిని,మరోమాజీఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని విచారణ పేరుతో పిలిచి అరెస్ట్ చేస్తారా అనేది సర్వత్రా ఉత్కంఠ కలిగించే విషయంగా మారింది. 2020వ సంవత్సరం నుండి 2024మేనెల వరకు తిరుమలకు నెయ్యిసరఫరాలో కీలకంగా వున్న డెయిరీ యాజమాన్యం, నిర్వాహకులతోబాటు కాంట్రాక్టర్లను ఇప్పటికే సిట్ పలు కోణాల్లో విచారణ చేసి ఆధారాలు రాబట్టి అరెస్ట్ చేసేసింది. వారంతా రిమాండ్‌లో కటాకటాల్లో ఉన్నారు. ఇద్దరుముగ్గురు బెయిల్‌పై బయట వున్నారనేది సమాచారం. ఇప్పుడు గత ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఎ చిన్నఅప్పన్న, కల్తీలో రసాయనాలు సరఫరా చేసిన అజయకుమార్‌ను కస్టడీకితీసుకునేందుకు సిట్ అధికారులు ఎసిబి కోర్టును ఆశ్రయించారు. 14న ఈ విషయంపై న్యాయమూర్తి తీర్పువెలువడించనున్నారు.

**అప్రూవర్‌గా మారినా...వైవి సాక్ష్యాధారాలే కీలకం:**

టిటిడిలో గత నాలుగేళ్లలో కర్త,కర్మ,క్రియగా సర్వంతానై అప్పటి టిటిడి అదనపు ఇఒ, ఆతరువాత ఇఒగా పాలనబాధ్యతలు నిర్వహించిన ఎవి ధర్మారెడ్డి కల్తీనెయ్యి కేసులో సులభంగా అప్రూవర్‌గా మారినా ఆయన వ్యవహారంపై సిట్ అధికారులు మరోసారి లోతుగా విచారణ చేసే అవకాశం లేకపోలేదనేది కీలకంగా మారింది.2019లో వైఎస్సార్సీ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలం తరూవాత కేంద్ర రక్షణశాఖ విభాగంలో ఉన్న ఎవి ధర్మారెడ్డిని టిటిడికి డిప్యూటేషన్‌పై అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డి తీసుకువచ్చారు. 2020 అక్టోబర్‌లో ఇఒ సింఘాల్ బదిలీతో ఆ స్థానంలో ఇఒగా డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, అదనపు ఇఒ హోదాలో ఎవి ధర్మారెడ్డికి బాధ్యతలు అప్పగించారు.అప్పటినుండి అదనపు ఇఒ హోదాలో ధర్మారెడ్డి సర్వంతానై వ్యవహరించారనే విమర్శలు పెద్దదుమారం రేపాయి. టిటిడిలో మరీ తిరుమలలో కర్త,కర్మ,క్రియ అన్నీ ధర్మారెడ్డి కనుసైగల్లోనే నడిచిందనే విషయాన్ని అప్పటి టిటిడి బోర్డు వాదనలు. అప్పటి బోర్డు ఛైర్మన్‌గా ఉన్న వైవి సుబ్బారెడ్డి చెప్పే కొన్ని విషయాలను ధర్మారెడ్డి అంగీకరించలేదని, దర్శన కోటా పెంపు, వసతి సౌకర్యం, ప్రతిశుక్రవారం అభిషేక సేవలో హాజరయ్యే విషయంపై మాటామాటా వాదనలు జరిగాయనేది గుప్పుమంది. అయితే ఈ విషయాలపై సిఎంగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి వరకు వెళ్ళినా అప్పటి బోర్డునే మందలించిన సందర్భాలు లేకపోలేదనేది ఆ రోజుల్లో తిరుమలలో వినిపించిన ప్రధాన విమర్శలు. ఇదే బాటలో రెండవసారి ఛైర్మన్‌గా కూడా సుబ్బారెడ్డి బాధ్యతలు చేపట్టడానికి విముఖత చూపడం కూడా అప్పట్లో పెద్ద చర్చసాగింది. తమతో అన్ని విధాలా విబేధించే ధర్మారెడ్డితో కలసి పనిచేయలేనని కూడా జగన్‌కు వివరించినట్లు గతంలోనే వైసిపి వర్గాల కథనం. అయినా 2020 అక్టోబర్‌నుండి 2024 మేనెలాఖరు వరకు టిటిడిలో అదనపు ఇఒగా, ఇఒగా కూడా ధర్మారెడ్డి బాధ్యతలు నిర్వహించడం ప్రత్యేక చర్చనీయాంశమే. 2024 జూన్ 16న టిటిడి ఇఒగా శ్యామలరావు బాధ్యతలు చేపట్టిన తరువాత లడ్డూల నాణ్యత, రుచిపై లోతుగా అన్ని కోణాల్లో అధ్యయనం చేశారు. అటు కొనుగోళ్ళ కమిటీనుండి ఇటు మార్కెటింగ్ చివరకు పోటు విభాగంలో వైష్ణవ బ్రాహ్మణులతో మాట్లాడి ఎక్కడ లోపం ఉందనే విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు. వైష్ణవ బ్రాహ్మణులు కూడా ప్రధానంగా నెయ్యి నాణ్యత లేకపోవడమేనని మౌఖికంగా అభిప్రాయాలు తెలిపారు. ఈ నేపథ్యంలో తిరుమలకు వచ్చిన నెయ్యికల్తీ జరిగిందనేది ఎన్‌డిడిబి కూడా తేల్చిన ప్రధాన అంశం. గత ఏడాది జూలై,ఆగస్ట్ నుండి ఇప్పటికీ కల్తీనెయ్యి బాగోతం దర్యాప్తు, విచారణలు సాగుతుండటం ప్రధానంగా మారింది. తాజాగా బుధవారం మాజీ ఇఒ ధర్మారెడ్డి అప్రూవర్‌గా మారి టిటిడిలో లోపాలు, గత బోర్డు పెద్దల తప్పిదాలు సిట్‌కు వెల్లడించడంతో మరీ ఇక జరగబోయే తతంగం మరింత వేడిపుట్టించేలా ఉంది.

## వారం - వర్జ్యం

13-11-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
నవమి రా.11.38
మఖ రా.7.42, విశాఖ కార్తె
వర్జ్యం : తె.4.16-5.59
దు.ఉ.9.59-10.45, 2) మ.2.32-3.18
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఇంటా బయటా మీదే పై చేయిగా వుంటుంది. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**వృషభం:** కీలక విషయాలలో ఆప్తుల సలహాలు తీసుకుంటారు. భాగస్వామ్య వ్యాపారాలలో అధిక లాభాలు పొందుతారు.

**మిథునం:** నూతన పెట్టుబడులకు అనుకూలంగా వుంటుంది. ప్రముఖులతో పరిచయాలు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**కర్కాటకం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. సహాయం కోసం ప్రత్యర్థులు మీ దగ్గరకు రావడం విశేషం.

**సింహం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. విదేశీయాన అవకాశాలు కలిసివస్తాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం. సహాయం కోసం ప్రత్యర్థులు మీ దగ్గరకు రావడం విశేషం.

**తుల :** నూతన వ్యక్తులు పరిచయమై చేయూతనందిస్తారు. వివాహయత్నాలు. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**వృశ్చికం:** కుటుంబ సమస్యలు నుండి బయట పడతారు. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల జాగ్రత్త అవసరం. సోదరుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వస్తు సేకరణ. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు పొందుతారు.

**మకరం:** స్వగృహం ఏర్పరచుకోవడానికి ఎంతగానో శ్రమించి కొంత పురోభివృద్ధి సాధిస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కుంభం:** సౌందర్య చిట్కాల పట్ల ఆకర్షితులవుతారు. స్వల్ప ధనలాభం. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**మీనం :** ఋణాలు సకాలంలో చెల్లించరు. దీనికి ప్రత్యేకమైన కారణం ఏమీ ఉండదు. సంతానం నుండి కీలక సమాచారం అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోల, హైదరాబాద్



బుధవారం దేవగుడిపల్లిలో జరిగిన బహిరంగ సభకు అసంఖ్యాకంగా హాజరైన ప్రజలు

# రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటన ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

**అమరావతి, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి :** ఈనెల 20న తిరుపతి,22న పుట్టపర్తిలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన,ఈనెల 14న భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ విశాఖపట్నం పర్యటన, ఈనెల 19న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టపర్తి పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి వివిధ శాఖల అధికారులతో వీడియో సమావేశం ద్వారా చేయాల్సిన ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ దేశ అత్యున్నత ప్రముఖులైన వారి వారి పర్యటనలకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఏర్పాట్ల విషయంలో ఏలాంటి లోపాలకు ఆస్కారం లేని రీతిలో విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా పర్యటనల పర్యవేక్షణ రాష్ట్ర నోడలు అధికారైన టిఆర్ అండ్బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యంటి కృష్ణబాబు, జిఏడి ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, శాంతి భద్రతల అదనపు డిజి మధుసూదన రెడ్డి, వర్చువల్ గా తిరుపతి,సత్యసాయి జిల్లాల కలక్టర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ఐఎ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో 'సిట్'

**న్యూఢిల్లీ, నవంబరు 12:** ఢిల్లీ పేలుడు కేసును దర్యాప్తు చేసేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారి, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ విజయ్ సఖారే నేతృత్వంలో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో ఒక ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఇద్దరు డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్‌లు, ముగ్గురు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌లు, మిగతా ముగ్గురు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ కేసు విచారణ కోసం ఎన్ఐఎ జమ్ముకశ్మీర్ పోలీసుల నుంచి, ఢిల్లీ పోలీసుల నుంచి, హర్యానా పోలీసుల నుంచి జైష్ ఏ మహ్మద్‌కు సంబంధించిన అన్ని కేసుల డైరీలను సేకరించనుందని అధికారులు తెలిపారు. తద్వారా జైష్ ఎ ఉగ్రవాద కార్యకలాపాల నిర్వహణకు, ఆర్థికపరంగా ఎవరు సహకరిస్తున్నారనే విషయాన్ని గుర్తించే పనిలో ఉంది. ఉగ్రవాదుల కదలికలను తెలుసుకునేందుకు ఎన్ఐఎ ఇప్పటికే 1000కి పైగా సీసీ ఫుటేజ్‌లను స్కాన్ చేసింది. అదేవిధంగా సోషల్ మీడియా యాక్టివిటీస్‌ను కూడా పర్యవేక్షిస్తోంది. ఢిల్లీలోని వివిధ ప్రదేశాల నుంచి మొబైల్ డాటాను కూడా సేకరిస్తోంది. కాగా విజయ్ శేఖర్ కేరళ క్యాడర్‌కు చెందిన 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. గతంలో ఆయన ఎన్ఐఎలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా సేవలు అందించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సఖారే ఎన్ఐఎ డిజిగా నియమితులయ్యారు. కేసు దర్యాప్తులో భాగంగా సఖారే ఇవాళ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌తో సమావేశమయ్యారు.

# సిఎం చంద్రబాబుతో భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ భేటీ

## రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించిన ముఖ్యమంత్రి

## షిప్ బిల్డింగ్, ఎలక్ట్రానిక్స్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులకు భారత్ ఫోర్జ్ ఆసక్తి




**విశాఖ, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో నౌకా నిర్మాణంతో పాటు పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పెట్టుబడుల సదస్సు కోసం విశాఖ చేరుకున్న సిఎంతో ప్రముఖ పారిశ్రామిక దిగ్గజ కంపెనీ భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్ కల్యాణి భేటీ అయ్యారు. రాష్ట్రంలో షిప్ బిల్డింగ్‌తో పాటు అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిపై ఆసక్తిగా ఉన్నామని అమిత్ కల్యాణి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వెల్లడించారు. ఎపిలో నౌకా నిర్మాణంతో పాటు ఎలక్ట్రానిక్స్ రంగంలో అడ్వాన్స్డ్ ఉత్పత్తుల తయారీకి సంబంధించి పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమని అమిత్ కల్యాణి సిఎంకు వివరించారు. తిరుపతి సమీపంలో అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్ సెన్సార్ల ఉత్పత్తిని చేపట్టాలని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే పర్యాటక రంగంలోనూ కొన్ని ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నట్టు అమిత్ కల్యాణి సిఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వాణిజ్య నౌకలతో పాటు డిఫెన్సు నౌకల నిర్మాణానికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని.. ప్రస్తుతం ఈ రంగంలో భారత్‌లో తయారీ అతి తక్కువగా ఉందని దీనిని దేశంలోని కంపెనీలు వినియోగించుకోవాల్సి ఉందని అన్నారు. భారత్‌ఫోర్జ్ సంస్థ చేపట్టే ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఎపి ప్రభుత్వం పూర్తిసహకారం అందిస్తుందని సిఎం స్పష్టం చేశారు.

# భాగస్వామ్య సదస్సుకు విశాఖ రెడీ

>> చర్చలు జరుపుతారు.మధ్యాహ్నం తైవాన్,ఇటలీ,స్వీడన్,నెదర్లాండ్స్ ప్రతినిధులతో బేటీలు ఉన్నాయి. ఎస్పీపి పంప్స్ లిమిటెడ్,రెన్యూ పవర్.,బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్,మురుగప్ప గ్రూప్,జూల్ గ్రూప్,హీరో ఫ్యూచర్ ఇంజనీర్స్ ప్రతినిధిలతో సిఎం సమావేశమై చర్చిస్తారు.సాయంత్రం వైజాగ్ ఎకనామిక్ రీజియన్ కార్యక్రమంలో పాల్గొంటారు.

**నవంబర్ 14 శుక్రవారం**

30వ సిఐఐ భాగస్వామ్య సదస్సును భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ప్రారంభించనున్నారు.ఏపి పెవిలియన్ ప్రారంభోత్సవంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ కూడా పాల్గొంటారు. యూసుఫ్‌ఆలీ, బాబా కళ్యాణి,కరణ్ అధాని వంటి విశిష్ట అతిధులు దీనికి హాజరుకానున్నారు.సదస్సు ప్రారంభ కార్యక్రమం తర్వాత టెక్నాలజీ,ట్రస్ట్,ట్రైడ్ సెషన్ జరగనుంది.మధ్యాహ్నం జరిగే ఏఐ ఫర్ వికసిత్ భారత్ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సింగపూర్ నుంచి విజయవాడకు నేరుగా విమాన సర్వీసులు నడిపేలా రాష్ట్ర ప్రభుత్వం సింగపూర్ ప్రతినిధులతో ఒప్పందం చేసుకోనుంది.సాయంత్రం రాష్ట్ర ఆర్థికశాఖ నిర్వహించే రీఇమేజింగ్ పబ్లిక్ ఫైనాన్స్ సమ్మిట్ లో సీఎం పాల్గొంటారు.సంజీవ్ గోయంగా గ్రూప్ వైస్ చైర్మన్‌తో సమావేశమై అనంతరం విశాఖలో లులూ నిర్మించే నూతన మాల్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు.రాత్రికి వివిధ కంపెనీలు ప్రభుత్వ ప్రతినిధులు,ఆహ్వానితుల గౌరవార్థం ఇచ్చే గాలా డిన్నర్‌లో పాల్గొంటారు.

**నవంబర్ 15 శనివారం**

సదస్సు రెండో రోజు శనివారం,ఉదయం బ్లూమ్‌బెర్గ్ మీడియాతో ఇంటరాక్షన్‌లో సీఎం పాల్గొంటారు.తర్వాత రేమాండ్,శ్రీసిటి,ఇండోసోల్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు.అలాగే బ్రహెయిన్,న్యూజిలాండ్,కెనడా, జపాన్ ప్రతినిధులతో భేటీ అవుతారు.మధ్యాహ్నం వరల్డ్ ఎకనామిక్ ఫోరానికి చెందిన సెంటర్ ఫర్ ఫ్రంటయిర్ టెక్నాలజీను ప్రారంభిస్తారు.అనంతరం గూగుల్‌సంస్థ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం ఏంవోయుల మార్పిడి కార్యక్రమం నిర్వహించనున్నారు.చివరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశం నిర్వహిస్తారు.భాగస్వామ్య సదస్సుతో సాధించిన ఫలితాలను వివరిస్తారు.

# అచ్యుతాపురం వద్ద ఘోర ప్రమాదం

>> బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు చనిపోయినట్లు ఎస్సై అశోక్ బాబు తెలిపారు. లావేరు మండలం గుర్రాలపాలెంనకు చెందినవారని తెలిపారు. చనిపోయిన మహిళలు అచ్చయ్యమ్మ (50), పద్మావతి(40)లను నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపినట్లు ఎస్సై అశోక్ బాబు పేర్కొన్నారు. ఆటోలో ఉన్న మిగిలిన వారికి చిన్నచిన్న గాయాలయ్యాయని వీరికి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. ముందుగా ప్రథమ చికిత్స అచ్యుతాపురం వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి, వైద్య సిబ్బంది నిర్వహించారు. ప్రమాదం సంభవించిన వెంటనే స్థానిక ఎమ్మార్వో జె.రామారావు, పోలీస్ సిబ్బంది సహాయక చర్యలు అందించారు. ఈ కేసును స్థానిక ఎస్సై అశోక్ బాబు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వేదికపై ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

# సమాజం ఋణం తీర్చుకోవడం మన బాధ్యత

## : గవర్నర్ అబ్దుల్ నజీర్

**కర్నూలు నవంబర్ 12 ప్రభాతవార్త ప్రతినిధి**
అందరికీ ఉన్నతంగా తీర్చిదిద్దిన విద్యాసంస్థకు, సమాజానికి ఋణం తీర్చుకోవడం మీ అందరి ప్రాథమిక కర్తవ్యం, బాధ్యత, అది మీకుకూడా ఎంతో సంతృప్తిని ఇస్తుందంటూ రాయలసీమ విశ్వవిద్యాలయ నాల్గవ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ మరియు విశ్వ విద్యాలయ ఛాన్సలర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ తెలుగుభాషలో ఆకాంక్షించారు. వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి డిగ్రీలు స్వీకరిస్తున్న విద్యార్థులను ఎంతో తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయానికి చేరుకున్న వెంటనే ఎన్ సి సి విద్యార్థులనుండి గవర్నర్ గౌరవవందనం స్వీకరించారు. అనంతరం స్నాతకోత్సవ వేడుకలను ప్రారంభించారు. ముందుగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి. వెంకట బసవరావు వర్సిటీ ప్రగతి నివేదికను వివరించారు. వర్సిటీలో అందుబాటులో ఉన్న కోర్సులను, జరుగుతున్న పరిశోధనలను తెలియజేశారు. రాయలసీమ విశ్వవిద్యాలయం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా విశ్వ విద్యాలయానికి గవర్నర్ స్వయంగా రావడం వర్సిటీకి, విద్యార్థులకూ ఎంతో సంతోష దాయకమని హర్షం వ్యక్తంచేశారు. అనంతరం ఎ.ఎం. గ్రీన్ ఛీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మరియు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి. రామకుమార్కు గవర్నర్ గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రదానంచేశారు. అనంతరం స్నాతకోపన్యాసం చేసిన డాక్టర్ యస్ యస్ వి రామ్ కుమార్, శాస్త్ర సాంకేతిక రంగాలతోపాటు విద్యుత్ రంగంలో తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా తనను గౌరవించిన రాయలసీమ విశ్వవిద్యాలయానికి ధన్యవాదాలు తెలియజేశారు. స్టార్టప్స్ రంగంలో దేశం ప్రగతిపథంలో దూసుకుపోతోందన్నారు. దేశ ప్రగతి రథానికి విద్యార్థులంతా చోదకశక్తిగా మారాల్సిన అవసరముందని ఆయన నసూచించారు. అనంతరం వర్సిటీలో వివిధ కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు గవర్నర్ బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన గవర్నర్ నాణ్యమైన బోధన, పరిశోధనలద్వారా రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థుల భవితకు బాటలు వేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా బంగారు పతకాలతోపాటు వివిధ పీజీ పి హెచ్ డి కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు డిగ్రీ ప్రదానం చేయడం సంతోషకరమన్నారు. ఆయా డిగ్రీలద్వారా సంపాదించుకున్న జ్ఞానంతో సార్థకమైన జీవితాన్ని గడపవలసినదిగా ఆయన హితబోధ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక విష యాల్లో కూడా విద్యార్థులు తమతమ నైపు ణ్యాలకు మెరుగులు దిద్దుకున్నపుడు భవితకు ఢోకా ఉండదన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి దేశాన్ని ప్రగతిపథంలో నిలపాలన్న దేశప్రధాని నరేంద్ర మోడీ ఆశిస్తున్న ఆశయాలకు నూతన విద్యా విధానం తోడ్పాటు నందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యాలతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వికసిత్ ఆంధ్ర లక్ష్యాలను చేరుకోవడానికి విద్యార్థిలోకం కృషి చేయాలన్నారు. ఉన్నతవిద్యవరకు సమాజం నుండి ఎన్నో పొందిన ప్రతి ఒక్క విద్యార్థి తనదైన బాధ్యతగా సమాజానికి ఉపకరించే పనులు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాయలసీమ యూనివర్సిటీ పక్షాన వి.సి. ఆచార్య వి. వెంకట బసవరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ ఆచార్య మధుమూర్తి, వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్.టి.కె. నాయక్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయ కుమార్ నాయుడు గవర్నర్ను సన్మానించారు. తర్వాత వివిధ కోర్సుల్లో పి.జి. మరియు పి హెచ్ డి పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. జాతీయ గీతాలాపనతో స్నాతకోత్సవం ముగిసింది. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, కర్నూలు కలెక్టర్ డాక్టర్. ఎ. సిరి, ఎస్.పి. విక్రాంత్ పాటిల్, కోడుమూరు శాసన సభ్యులు బొగ్గుల దస్తగిరి, ఎ పి ఎస్ హెచ్ సి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి, వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్.టి.కె. నాయక్ ఉన్నారు.



## పద్మావతి వర్సిటీలో అంతర్జాతీయ సాంస్కృతిక సంభాషణ

### విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ

**తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** విద్యాకేంద్రాల నిలయం తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో నేటి నుండి మూడురోజులు అంతర్జాతీయ సాంస్కృతిక సంభాషణ జరుగుతోంది. ఇందుకు వర్సిటీలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టినట్లు పద్మావతి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ తెలిపారు. బుధవారం మీడియాప్రతి నిధులకు అంతర్జాతీయ నృత్యోత్సవాలు నిర్వ హణ వివరాలు తెలిపారు. శ్రీలంక, థాయ్ లాండ్, ఆంధ్రప్రదేశ్లకు చెందిన నృత్య కళాకారులతో పలు రకాల ప్రదర్శనలు, సద స్సులు ఉంటాయన్నారు. పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నృత్యవాహిని అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి, నృత్య మహోత్సవం జరుగుతుంది. థాయ్లాండ్, శ్రీలంక, మహారాష్ట్ర నుండి 87మంది కళా కారులు అంతర్జాతీయ నృత్యోత్సవంలో పాల్గొం టారని తెలిపారు. నేడు ప్రారంభ సన్నాహంతో కార్యక్రమాలు మొదలవుతాయి. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సరిమాఈ వెంకటేశ్వర్, మైసూర్ విశ్వవిద్యాలయం ఆచార్య శీలశ్రీధర్ తెలిపారు.

# తిరుమల సమాచారం

## ఇ ఆఫీస్ ద్వారా ఎస్వీబిసి కార్యక్రమాల నిర్వహణ

### - ఒకే సమగ్రసాఫ్ట్వేర్లో సమన్వయం - టిటిడి ఇఒ సింఘాల్



**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిధార్మిక కార్యక్రమాలు, తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు ఇతర ఆలయాల్లో జరిగే అన్ని కార్యక్రమాలను ప్రసారం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఎస్వీబిసిని ఈ ఆఫీస్ద్వారా నిర్వ హించాలని టిటిడి ఇఒ. అనిల్కుమార్సింఘాల్ ఆదే శించారు. ఎస్వీబిసిలోని మానవవనరులు, ఆర్థిక వ్యవ హారాలు, ఉత్పత్తి, సరఫరా, న్యాయ తదితర విభాగాల అంశాలను ఒకే సమగ్ర సాఫ్ట్వేర్లో సమన్వయం చేసేందుకు సంస్థ వరకుల సమగ్ర ప్రణాళికా వ్యవస్థను తీసుకురావాలన్నారు. బుధవారం సాయంత్రం టిటిడి పరిపాలనభవనంలో ఎస్వీబిసి సిఇఒ ఫణికుమార్నాయుడు, ఎఫ్ఎసిఎఒ బాలాజీతో కలసి ఇఒ సింఘాల్ సమీక్షించారు. ఎస్వీబిసి ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులకు మరింత నాణ్యతతో ప్రసారాలు అందించేందుకు, ఉద్యోగులు ప్రణాళికా బద్ధంగా విధులు నిర్వహించేందుకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. ఎస్వీబిసిలో ఆర్థిక అంశాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రభుత్వం నుండి ,అటానమస్ సంస్థ నుండి ప్రత్యేకంగా అకౌంట్స్ ఆఫీసర్ను నియమించాలన్నారు.

## కపిలతీర్థంలో అయ్యప్పస్వాముల శరణుఘోష

### - స్నానాలకు అనుమతించాలని నిరసన



**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీక మాసంలో దీక్షచేపట్టిన అయ్యప్ప స్వాములు కపిలతీర్థం పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించడం పరిపాటి. వేకువజామున చన్నీటి స్నానంతో అయ్యప్పదీక్ష భక్తులు తమ భక్తిని చాటు కుంటారు. కొండల్లోంచి జలాపాతాలు దుముకుతుండటంతో ముందు జాగ్రత్తగా టిటిడి అధికారులు కపిలతీర్థంలో స్నానాలకు అనుమతించడంలేదు. బుధవారం ఉదయం అయ్యప్పమాలలు ధరించిన భక్తులు, యాత్రికులు అక్కడకు చేరుకుని పుణ్యస్నానాలాచరించాలని చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో అయ్యప్పస్వాములు శరణంఅయ్యప్ప ఘోషతో నిరసన తెలిపారు. అయితే భద్రత కారణాల దృష్ట్యా భక్తులను అనుమతించడంలేదని ఆలయభద్రత సిబ్బంది తెలిపారు.

## త్వరలో ప్రేక్షకుల ముందుకు ' టైసన్నాయుడు' చిత్రం

### -శ్రీవారి ఆశీస్సులతో కిష్కింధపురి విజయవంతం



**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ఎంతో అద్భుతంగా అన్ని రకాలుగా చిత్రీకరించిన "టైసన్నాయుడు"చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీనటుడు బెల్లంకొండ శ్రీనివాస్ తెలిపారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో కిష్కింధపురి చిత్రం విజయవంతమైందన్నారు. ఆ చిత్రం తరువాత స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో నటుడు శ్రీనివాస్ ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనానంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# 20 అంశాల కార్యక్రమం అమలుపై సమీక్ష

## కమిటీ ఛైర్మన్ లంకా దినకర్



**సచివాలయం,నవంబర్ 12,ప్రభాతవార్త :** డబుల్ ఇంజన్ సర్కార్ లక్ష్యం రాష్ట్రంలో ప్రపంచస్థాయి పెట్టుబడులు ఆకర్షణ-గ్రామస్థాయి పెట్టుబడుల సాధికారతకు ప్రోత్సాహం దిశగా ఏపిలో జరుగుతుందని 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్ తెలిపారు.బుదవారం ఆయన పేషీలో విలేకర్లుతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయం స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంతో ప్రధాని మోడీ సంకల్పం వికసిత్ భారత్ సాధనకు పెట్టుబడుల ఆకర్షణ కీలకం.ముఖ్యమంత్రి దార్శనికత మరియు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహకారంతో విశాఖలో పెట్టుబడుల సదస్సుకు ముందే 11లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షణ జరిగిందన్నారు.15బిలియిన్ డాలర్ల గూగుల్ పెట్టుబడులు నుంచి రూ.15వేలు పెట్టుబడుల వరకు ప్రతి ఒక్కరిని ఒకే స్ఫూర్తితో ప్రోత్సహిస్తున్నారు. చరిత్రలో లక్షల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు చేసుకోబోతున్న అతిపెద్ద పారిశ్రామిక వేత్తల సదస్సు విశాఖలో జరగడానికి మూడు రోజులు ముందు కనిగిరి వంటి వెనుకబడిన ప్రాంతం నుండి 17జిల్లాల్లో ని 49చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల పార్కులను వర్చువల్ గా ప్రారంభోత్సవం చేయడం అంటే పారిశ్రామిక సదస్సు నిర్వహిస్తున్న సమయంలో సాధారణంగా పెద్ద పరిశ్రమలపైన చర్చ జరగాల్సిన తరుణంలో చిన్న పరిశ్రమల పైన అంతే ప్రాధాన్యతతో కార్యక్రమం చేయడం ఆయనకు సాధ్యం అని నిరూపించారు.ఎంఎస్ఎంఈల సభలో కనిగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ డ్వాక్ర మహిళల సాధికారత ద్వారా ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామిక వేత్తను తయారుచేయడానికి డబుల్ఇంజన్ సర్కార్ పనిచేస్తుందన్నారు. దేశంలో 30శాతం జిడిపి,40శాతం ఎగు మతులు ఎంఎస్ఎంఈ ద్వారా సమకూరు తున్నాయి,ఈ శాతం ఆంధ్రప్రదేశ్ లో పెంచాలనే లక్ష్యంతో డబుల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తుంది.రాష్ట్రంలోని మూడు పారిశ్రామిక కారిడార్లు మరియు కొప్పర్తి,ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు ప్రధాని మోడీ సహకారం మరువలేనిది.

2019-24మధ్య పెట్టుబడుల ఆకర్షణలో ప్రతికూల వాతావరణం ఉండడానికి కారణం నాటి ప్రభుత్వ పాలన వైఫల్యం.ఆయ పెట్టుబడుల ద్వారా 20లక్షల ఉద్యోగాలు రాబట్టడం లక్ష్యంగా ఐటి మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ సంపూర్ణ సహాయ సహకారాలు గ్రామాల్లో మహిళల లక్పతి దీదీలు ద్వారా డబుల్ ఇంజన్ సర్కార్ సహకారంతో పెట్టుబడుల ఆకర్షణకు ఊతం ఇస్తుంది.

# సిబిఐ కోర్టు విచారణకు హాజరవుతా: మాజీ సీఎం జగన్



**విజయవాడ, నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** యూరప్ పర్యటనకు వెళ్లి వచ్చాక కోర్టు ముందు హాజరు కావాలన్న ఉత్తర్వుల నేపథ్యంలో ఈనెల 21లోగా హాజరవుతానని అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితునిగా అభియోగాలు ఎదుర్కొంటున్న ఏపీ మాజీ సీఎం వైఎస జగన్ సీబీఐ కోర్టుకు నివేదించారు. వాస్తవానికి హైదరాబాద్లోని సీబీఐ కోర్టుకు ఈనెల 14న హాజరుకావాల్సి ఉండగా మెమో దాఖలు చేస్తూ మినహాయింపు కోరినా దాన్ని ఉపసంహరించుకున్నారు.ఈ మేరకు జగన్ న్యాయవాది సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. అక్టోబరులో జగన్ యూరప్ పర్యటనకు వెళ్లే ముందు సీబీఐ కోర్టు అనుమతి కోరారు. కోర్టు అనుమతి మంజూరు చేస్తూ పర్యటన ముగించుకుని వచ్చాక నవంబరు 14న వ్యక్తిగతంగా హాజరుకావాలని షరతు విధించింది. పర్యటన ముగించుకొని వచ్చిన జగన్ కోర్టు ఎదుట హాజరు కాలేదు. కోర్టు విధించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో తన వ్యక్తిగత హాజరును మినహాయించాలని కోరుతూ ఈనెల 6న మెమో దాఖలు చేశారు. దీనిపై సీబీఐ ప్రధాన కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి. రఘురాం మంగళవారం విచారణ చేపట్టారు. ఈ మెమోను వ్యతిరేకిస్తూ సీబీఐ కౌంటరు దాఖలు చేసింది. బెయిలు షరతుల ప్రకారం ప్రతి విచారణకు జగన్ హాజరు కావాల్సి ఉందని పేర్కొంది. జగన్ తరఫు న్యాయవాది జి. అశోక్రెడ్డి స్పందిస్తూ హాజరు మినహాయిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. జగన్ తరఫున ఆయన న్యాయవాది హాజరుకావడానికి అనుమతించిందని పేర్కొన్నారు. కోర్టు ముందు హాజరుకావడానికి అభ్యంతరం లేదని, ప్రత్యేక భద్రతా ఏర్పాట్లకు అధికార యంత్రాంగానికి ఇబ్బంది అన్న ఉద్దేశంతో మినహాయింపు కోరినట్లు పేర్కొన్నారు. యూరప్ పర్యటనకు వెళ్లి వచ్చాక కోర్టులో హాజరుకావాలన్న ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని కోరుతూ అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడైన జగన్ హైదరాబాద్ సీబీఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. అక్టోబరు 1 నుంచి 30లోగా 15 రోజులపాటు జగన్ యూరప్ పర్యటన నిమిత్తం సీబీఐ కోర్టు అనుమతి ఇస్తూ వెళ్లే ముందు పర్యటన వివరాలు, ఫోన్ నంబరు, ఈ మెయిల్ వివరాలు సమర్పించాలని, వచ్చాక నవంబరు 14లోపు కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని షరతులు విధించింది. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన జగన్ కోర్టు ఎదుట ఇంకా హాజరుకాలేదు. అయితే తాజాగా 21లోగా జగన్ హాజరవుతారని మెమో దాఖలు చేసినట్లు తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి గతంలో దాఖలు చేసిన మెమోను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పరకామణి కేసు రాజీలో టిటిడి పెద్దలు!

### - మాజీలపై దృష్టి పెట్టిన సిఐడి - విచారణకు పిలిచే అవకాశం

**తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు కానుకలు లెక్కించే పరకామణి నుండి విదేశీ కరెన్సీ చోరీ కేసు, తదనంతరం లోక్అదాలత్లో రాజీజరగడం వంటి కీలక పరిణామాల వెనుక గత టిటిడి పెద్దలు ఉన్నారనే విషయం సిఐడి దృష్టికి వచ్చిందని తెలుస్తోంది. ఈ బాగోతంలో రానున్న రెండుమూడురోజుల్లో మాజీ టిటిడి పెద్దలతోబాటు మాజీ పోలీస్ అధికారిని విచారణకు పిలిచే అవకాశం ఉందని కీలక సమాచారం. పరకామణిలో చోరీ కేసు విషయంపై హైకోర్టు ఆదేశాలతో గత ఏడెనిమిదిరోజులుగా తిరుపతిలోనే మకాం వేసిన సిఐడి డిజి రవిశంకర్అయ్యన్నార్, ఎస్పీలు, డిఎస్పీలు ఐదు బృందాలు క్షేత్రస్థాయిలో సమాచారం రాబట్టారు. నిందితుడైన సివి రవికుమార్ వ్యవహారంపైకూడా దాదాపు కీలక సమాచారం సేకరించింది. ఆయనకు సంబంధించిన ఆస్తులు ,వాటి అంచనాలు వంటి విషయాలను రాబట్టింది. ఇప్పుడు కీలకంగా మారిన రాజీధోరణి వ్యవహారంలో కొందరు మాజీ పెద్దలపై దృష్టి సారించారు. ఇదేగాక తాజాగా బుధవారం సాయంత్రం టిడిపి నాయకులు సిఐడిడిజి రవిశంకర్అయ్యన్నార్ను తిరుపతిలో కలసి పరకామణి దొంగతనం కేసులో ముగ్గురుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కేసులో గత టిటిడి ఛైర్మన్లు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్రెడ్డి, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఓ పోలీస్ ఉన్నతాధికారి కలసి కుమ్మక్కై వాటాలు పంచుకున్నారని ఆరోపించారు. వీళ్ళే కేసు నీరుగార్చే ప్రయత్నం చేసి రాజీచేశారని విన్నవించారు. దీంతో ఇప్పుడు పరకామణి కేసులో కొత్త మలుపుతిరగనుంది. తిరుమల పరకామణిలో 2023 ఏప్రిల్లో జరిగిన చోరీ ఘటన,తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలతో సిఐడి బృందం దర్యాప్తు వేగవంతంగా కొనసాగిస్తోంది. పూర్తి విషయాలు డిసెంబర్ 2కి హైకోర్టుకు సమర్పించాల్సి ఉంది. తిరుమలలో పరకామణి భవనం, కమాండ్ కంట్రోల్రూమ్, సిసిటివి దృశ్యాలు పరిశీలించారు. రవికుమార్ పాత్ర, 2023 ఏప్రిల్లో చోరీ జరిగిన ప్రాంతం, ఎలా పట్టుబడ్డాడు అనే వివరాల ఆధారాలు సేకరించి కొందరు అధికారులను విచారణ చేశారు. రవికుమార్కు సంబంధించి రికార్డుల మేరకు తిరుపతి,హైదరాబాద్, తమిళనాడు,కర్నాటకలో 50కోట్లరూపాయలకుపైగా విలువైన ఆస్తులున్నట్లు కూడా గుర్తించారు.

# కల్తీనెయ్యి వ్యవహారం - మాజీ ఛైర్మన్ వైవి నోరువిప్పితే ఏం జరుగుతుందో?

**తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమల లడ్డూప్రసాదాల తయారీకి 2020నుండి 2024వరకు కల్తీనెయ్యి సరఫరా చేయడం, అదే నెయ్యిని పోటులో వినియోగించారనే కేసులో సిబిఐ సిట్ అధికారుల దర్యాప్తులో గత బోర్డు పెద్దలు, గత అధికారులు ఎరక్కపోయి ఇరుక్కోబోతున్నారా?అనే అనుమానాలు ఇప్పుడు రసవత్తరంగా మారాయి. కల్తీనెయ్యి బాగోతంలో తనప్రమేయం ఏమీ లేదని, ఇఒగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని తాజాగా బుధవారం మాజీ టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి సిట్ డిఐజి మురళీరాంభా, తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావు విచారణలో అప్రూవర్గా మారడం ఎక్కడకు దారితీస్తుందోననేది మాత్రం విస్మయం కలిగిస్తోంది. ఇప్పుడు కల్తీనెయ్యి కేసులో ప్రధాన ఆరోపణలు ఎదర్కొంటున్న గత ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి సిట్ ఎదుట హాజరై నోరు విప్పితే ఎలాంటి పరిణామాలు జరగబోతాయో అనేది కూడా ఉత్కంఠగా మారింది. అప్రూవర్గా మారిన ధర్మారెడ్డి ఈ బాగోతంలో మొత్తం సుబ్బారెడ్డిదే నేరం అన్నట్లు వెల్లడించారనేది తెలుస్తోంది. కల్తీనెయ్యి వ్యవహారంలో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇదీ సిట్ అధికారులను కూడా విస్మయం కలిగించేలా మారింది. కల్తీనెయ్యి విషయంలో 2020-24వరకు ఏం జరిగిందనేది మాజీ ఇఒ సమగ్రంగా ఆధారాలతో సిట్కు వాంగ్మూలం ఇచ్చారని తెలిసింది. అప్పటి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఒత్తిడి ,ప్రోద్బలం వల్లే ఇవన్నీ జరిగినట్లు సిట్ముందు



వెల్లడించారనేది సమాచారం. అవసరమైన సమాచారం కూడా అందించినట్లు తెలుస్తోంది. కల్తీనెయ్యి వ్యవహారంలో రెండవరోజు బుధవారం ఉదయం నుండి రాత్రి వరకు సాగిన విచారణలో మాజీ ఇఒ ధర్మారెడ్డి ,బోలేబాబా డెయిరీ విపిన్జైన్,పామిల్జైన్లను విచారణ చేశారు. కల్తీనెయ్యి సరఫరాలో ఇప్పుడు సుబ్బారెడ్డి రేపోమాపో తిరుపతిలోని సిట్ కార్యాలయానికి హాజరై విచారణలో నోరువిప్పితే జరిగే పరిణామాలు ఎలా ఉంటాయనేది కూడా ఊహించలేని ఉత్కంఠగా నెలకొంది. రెండవరోజు కొన్ని ప్రశ్నలకు సమాధానం దాటవేశారనేది తెలుస్తోంది. గత ఐదేళ్ళలో 215కోట్లరూపాయలకుపైగా విలువైన 68.17 లక్షల కిలోల కల్తీనెయ్యి సరఫరా చేసినట్లు తేలిందని డిఐజి మురళీరాంభా తెలిపినా దానిపై సుబ్బారెడ్డి పాత్రపై ఇప్పుడు విచారణ చేయనున్నారు. ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనేది తెలుస్తోంది. 2019నుండి 2024 వరకు మధ్యకాలంలో తిరుమల లడ్డూల తయారీకి అవసరమైన నెయ్యిసరఫరా టెండర్లు దక్కించుకుని కల్తీనెయ్యి పంపినా ఎందుకు నోరుమెదపలేదనే కోణంలో వైవి విచారణ సాగనుందనేది తెలుస్తోంది. కల్తీనెయ్యి పాపంలో ఎవరున్నారనే అంశంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టిన సిబిఐ సిట్ అధికారులు ఇప్పటికే పాత్రధారులైన పలువురు డెయిరీ ప్రతినిధులను అరెస్టుచేసింది. ఇప్పుడు మరింతగా లోతుగా దర్యాప్తుకు మాజీ ఛైర్మన్ వైవి పిఎ చిన్నఅప్పన్నను, కాంట్రాక్టర్ అజయకుమార్ను మూడురోజుల కస్టడీకి సిట్ ఏసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 14వతేదీ (రేపు)తీర్పు వస్తే వైవి సుబ్బారెడ్డి విచారణకు హాజరయ్యే సమయానికి వీరందరినీ కలిపి విచారణ చేసే అవకాశం ఉంది. సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ప్రభు, డిఐజి మురలీరాంభాలు ఆధారాలతో కొన్ని ప్రశ్నలను సిద్ధం చేసుకున్నారనేది తెలుస్తోంది. ఇప్పటికే డెయిరీ ప్రతినిధులను విచారణ చేసిన సిట్ అధికారులు నెయ్యి సరఫరా టెండర్లు దాఖలు, ఆ తరువాత పరిణామాలను రాబట్టారు.

## కళాదర్శకుడు తోటతరణికి ఫ్రాన్స్ విశిష్ట పురస్కారం

**చెన్నై,నవంబరు 12:** భారతీయ చలనచిత్ర పరిశ్రమ గర్వించదగ్గ ఆర్ట్ డైరెక్టర్, పద్మశ్రీ తోట తరణికి మరో అరుదైన గౌరవం లభించింది. ఫ్రాన్స్ ప్రభుత్వం అందించే అత్యున్నత పౌర పురస్కారం "చెవాలియం" అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. నవంబర్ 13న చెన్నైలోని అలయన్స్ ఫ్రాంకైస్లో జరిగే కార్యక్రమంలో ఫ్రెంచ్ రాయబారి చేతుల మీదుగా తోట తరణి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ అరుదైన గౌరవం పొందిన ఆరో భారతీయుడిగా తోట తరణి నిలవనున్నారు. గతంలో దిగ్గజ దర్శకుడు సత్యజిత్ రే, నటులు శివాజీ గణేశన్, అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, కమల్ హాసన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రెండు జాతీయ అవార్డులు, మూడు నంది అవార్డులు, నాలుగు తమిళనాడు రాష్ట్ర అవార్డులతో పాటు 2001లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీతో సత్కరించింది. 1978లో దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన తెలుగు చిత్రం సొమ్మొకడిది సోకొకడిదితో తోట తరణి తన కెరీర్ను ప్రారంభించారు. మణిరత్నం, శంకర్ వంటి అగ్ర దర్శకులతో కలిసి పనిచేసిన ఆయన నాయకుడు, సాగర సంగమం, గీతాంజలి , దళపతి, శివాజీ, దశావతారం, పొన్నియిన్ సెల్వన్ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్గా పనిచేసి భారతీయ సినిమాపై తనదైన ముద్ర వేశారు. చెవాలియర్ అవార్డు విషయాన్ని ప్రకటించగానే తోట తరణిపై అభినందనలు వెల్లువెత్తాయి. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, ప్రముఖ నటుడు, దర్శకుడు ప్రభుదేవా బుధవారం సోషల్ మీడియా వేదికగా తోట తరణిని ప్రశంసించారు. ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ ఖాతాలో తమిళంలో స్పందిస్తూ, "తన అద్భుతమైన నైపుణ్యంతో ఊహలకు ప్రాణం పోసే ఆర్ట్ డైరెక్టర్ తోట తరణికి ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం చెవాలియర్ అవార్డు ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు.

## స్వర్ణముఖి నది ప్రక్షాళనకు సిద్ధం :తుడ ఛైర్మన్ దివాకర్రెడ్డి

**తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచపుణ్యక్షేత్రం, యాత్రాస్థలం తిరుపతి నగరం అన్ని విధాలా అభివృద్ధి దిశగా అడుగులుపడుతున్నాయని తుడ ఛైర్మన్ సి.దివాకర్రెడ్డి తెలిపారు. ఆపరేషన్ స్వర్ణలో భాగంగా స్వర్ణముఖీ నదీపరివాహక సరిహద్దులు నిర్ణయించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యాచరణపై ముందుకు వెళుతున్నామన్నారు. బుధవారం ఉదయం తుడ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పలు అంశాలపై తుడ ఛైర్మన్ దివాకర్రెడ్డి వివరించారు. సిఎం చంద్రబాబునాయుడు సూచనలతో ఆపరేషన్ స్వర్ణ తమకు అప్పగించడం, పనులు కార్యాచరణ రూపొందంచడం జరిగిందన్నారు. స్వర్ణముఖినది ఆక్రమణలు తొలగింపు, ప్రక్షాళనలో బాగంగా త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆపరేషన్ స్వర్ణ ముందుకు వెళుతుందన్నారు. తిరుపతి నగరాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. శెట్టిపల్లి 68 ఎకరాలు తుడ అభివృద్ధి చేస్తుందని, సుమారు 48 ఎకరాల భూమిలో 1,800 ఇళ్ళు నిర్మాణం చేస్తామని చెప్పారు.

ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 320మంది రైతులకు లాటరీ పద్ధతిలో స్థలాల కేటాయింపు చేస్తామని, ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వినాయకసాగర్లో అవిలాల చెరువును అభివృద్ధిచేస్తామని ,తిరుపతిలో 70-80తాగునీటి వనరులను సుస్థిరంగా తయారుచేస్తున్నామన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మీ అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695, ఇ-మెయిల్ : armvij@canarabank.com

**స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్ల అధీకృత అధికారిచే లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న సెక్యూర్డ్ క్రెడిటార్కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది.29.11.2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

**ఇ-వేలం తేది & సమయం : తేది.29.11.2025, మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు** (అమ్మకం ముగిసే వరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) **ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 29.11.2025, మ॥ 12.00 గం॥ల లోపు**

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 29.11.2025, మ॥ 12.00 గం.లలోగా పొందుపరచి జమ చేయాలి.

| ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడకు బదిలీ చేయడమైనవి) | ఆస్తి వివరములు | రిజర్వు ధర (రూ.లలో) | ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|---|
| ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ శ్రీమతి నెరుసు భవాని, భర్త : వెంకటేశ్వరరావు & శ్రీ నెరుసు వెంకటేశ్వరరావు, తండ్రి : నాగేశ్వరరావు బకాయి మొత్తం : రూ.65.63 లక్షలు + వడ్డీ + ఇతర ఖర్చులు | ఏలూరు, ఏలూరు సబ్ డివిజన్, చాటపర్రు గ్రామ పంచాయితీ, డి.నెం.6-18 దగ్గర, ఆర్.ఎస్.నెం. 116/1 లోని 307.40 చ॥గ॥లు విస్తీర్ణం గల స్థలం అందు నిర్మించిన ఆర్సిసి క్రింది మరియు మొదటి అంతస్తులతో కూడిన నివాస భవనం (అసంపూరిత) యావత్తు ఆస్తి సేల్ డీడ్ నెం.8753/2011, తేది.17.11.2011 ప్రకారం నెరుసు వెంకటేశ్వరరావు గారి పేరున కలదు. హద్దులు: డీడ్ ప్రకారం. | రూ. 27.41 లక్షలు | రూ. 2.75 లక్షలు |

**ఆస్తి తనిఖీ తేది & సమయం : తేది.26.11.2025, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు**
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 8331011695.

బ్యాంకుకు తెలిసిన / తెలియని బకాయిలు / ట్యాక్స్లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతో పాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్న వాటికి రూ.10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 50 లక్షల వరకు ఉన్న వాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 50 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్న వాటికి రూ.50,000/- గుణింపులో హెచ్చించవలెను. 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ.1,00,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్లైన్' వేలం ముగిసే లోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్గా ప్రకటించబడతారు. ఇ-వేలం విధానం, నియమ నిబంధనలు కొరకు సర్వీసు ప్రొవైడర్ను సంప్రదించండి : మెస్సర్స్ పిఎస్బి అలియన్స్ (baanknet). వెబ్పోర్టల్ : "https://baanknet.com/eauction-psb" , హెల్ప్ డెస్క్ : 7046612345/6354910172/8291220220/ 9892219848/8160205051. ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది : 10-11-2025, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్


వార్త

మన జీవితానికి ఒక లక్ష్యం, ఒక ఉద్దేశం, ఉంటేగాని అది జీవితం అనిపించుకోదు.

న-రాచెల్


## 'కట్టు' తప్పుతున్న అగ్రరాజ్యం!

ఒకప్పుడు అణు నిరాయుధీకరణకు కట్టుబడిన అగ్రదేశం సైతం అణ్వాయుధ ప్రయోగాల కోసం ఉవ్విళ్లూరుతోంది. నిరాయుధీకరణ గొప్ప అంశమంటూనే దానిని ఉల్లంఘించేందుకు శ్వేత సౌధాధినేత ట్రంప్ సిద్ధమవుతున్నారు. పైగా పాకిస్థాన్ దారిలోనే తామూ నడుస్తామని ప్రపంచానికి సంకేతాలు కూడా పంపారు. అన్నవస్త్రాలకు కరువు ఎదుర్కొంటున్న పాక్ ఈ మధ్య వాటి విషయాలు అలా ఉంచి అణ్వస్త్ర ప్రయోగాల పట్ల శ్రద్ధ చూపిస్తోంది.తమ వద్దనున్న అణ్వస్త్రాలతో ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చే యవచ్చు నని ఎప్పటిలానే తమ శక్తిసామర్థ్యాల విష యమై ఆయన గప్పాలు కొట్టుకుంటున్నారు. ఆయనెం దుకో నిద్రలో కనాల్సిన కలలను పట్టపగలే కంటున్న ట్లుంది. అణ్వస్త్ర ప్రయోగాలకు ముందుకు దూసుకుపో తున్నట్లు బహిరంగంగానే ప్రకటించారు. మూడు దశా బ్దాల క్రితం తాము అణ్వస్త్ర నిరోధకతకు ప్రపంచంలోని పలు దేశాల మధ్య కుదిరిన ఒప్పందానికి లోబడి వేచి యున్నామని కాగా పాక్ వంటి తన మిత్రదేశమే అణ్వ స్త్రాల కోసం అర్రులు చాస్తుండగా తామేమీ మిన్నకుండ లేమని చెప్పారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకి స్థాన్‌లు అణుపరీక్షల్లో మునిగితేలుతుండగా తానెందుకు ఊరకుండిపోవాలని ఆయన ఆవేదన. తమకు చైనాకు తీవ్ర తరమైన పోటీ ఉందని, అందులోనూ ముప్పులేదని భావించలేమని అందుకే చైనాకు పోటీగా అణ్వాయుధాలు సమకూర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని స్వయంగా ఆయనే ప్రకటించారు. ఇతర దేశాల్లాగానే తాము కూడా అణుప్రయోగాలకు సిద్ధ మవుతున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు పెంటగాన్‌కు కూడా సమాచారం ఇచ్చి సంసిద్ధులై ఉండాలని చెబుతు న్నారు. అమెరికా పవర్‌గ్రిడ్ నీటి సరఫరా వ్యవస్థలోకి చొరబడి చైనా మేధోసంపత్తిని చోరీ చేస్తోందని, ఈ విష యం తమ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు సమాచారమందించినట్లు ట్రంప్ మీడియాకు వివరించారు. తాము నిరం తరం చైనా చర్యలను దుశ్చర్యలను గమ నిస్తూనే తమ ఎత్తుగడలను తాము వేస్తామని చెబుతు న్నారు. ఎవరివల్ల ఎవరికి ముప్పో చెప్పలేని పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో 'అణ్వస్త్ర'పోటీ ఎంతో దూకుడుగా సాగేదని విన్నాం. కాగా ఇప్పటికీ రష్యా, చైనాలు ఎంతో చురు కుగా ఆలోచిస్తున్నా యని అందరికీ తెలిసిందే. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య ఒకపక్క ఎడతెగని యుద్ధం, మరో పక్క సయోధ్యకు మింగుడుపడని వ్యవహారం. అగ్ర రాజ్యాధిపతిని వెక్కిరి స్తున్నాయి. ఆ మధ్య దక్షిణ కొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ముందే అణుపరీక్షలకు 'తాము సైతం' అని ప్రకటించారు. అమెరికా కూడా ఇతర అణ్వస్త్ర దేశాలకు ధీటుగా అణుపరీక్షలు నిర్వహించటం సమంజ సంగా ఉంటుందని, అదే సబబని ట్రంప్ ప్రకటించారు. ఆ వెంటనే అమెరికా రక్షణశాఖ తన నిర్ణయాన్ని అమలు చేయాలని ఆదేశించారు. అణు నిరాయుధీకరణపై తన కెంత మక్కువ ఉన్నా అణ్వస్త్ర దేశాలతో పోటీలో ఉండక పోతే వెనుకపడ్తామని ఆయన ఆలోచనలా ఉంది.అణ్వస్త్ర దేశాలు 1996లో ప్రపంచ శాంతిని కోరుకుంటూ 'సమగ్ర అణుపరీక్షల నిషేధ' ఒప్పందాన్ని చేసుకున్నాయి. 2023 లో ఆ ఒప్పందం నుంచి రష్యా అధ్యక్షుడు బయటికి వచ్చేశాడు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రకటించాక అదొక హెచ్చరిక సంకేతంగా భావిం చినట్లున్నారు. నిరంతర యుద్ధానికి తలపడ్డారు. ఇప్పటికీ అదే యుద్ధతంత్రం నడుస్తోంది. అమెరికా వద్ద 5225, రష్యా వద్ద 5580 అణ్వస్త్రాలున్నాయి. 2020లో ఒక సర్వే ప్రకారం చైనా వద్ద 300 అణ్వస్త్రాలే ఉండేవి. రానురాను వాటి సంఖ్య పెరిగింది.తాజా పరిస్థితుల్లో చైనా తనంతతానుగా అణ్వా యుధ ప్రయోగాలు చేసినా అమెరికాను ఎదుర్కొనేందుకు ఇంకా చాలా సమకూర్చు కోవాలి. ప్రస్తుతమున్న పరిస్థి తుల్లో అణ్వస్త్ర తయారీ కోసం ఏ దేశం అర్రులు చాచినా తమదేశాన్ని రక్షించుకునే ప్రయత్నంలో ఎలాంటి అణ్వస్త్ర పోరు జరుప జాలదు. ఫ్రాన్స్ వద్ద 290, యుకె వద్ద 225,భారత్ వద్ద 180,పాకిస్థాన్ వద్ద 170, ఇజ్రాయెల్ 90, ఉత్తర కొరియా వద్ద 50 వరకు అణ్వస్త్రాలు ఉన్నా యి.చైనా తన అణ్వాయుధ సామర్థ్యాన్ని వేగంగా పెంచు కుంటుందనే అభిప్రాయానికి రావడంవలన ట్రంప్ ఆందో ళన చెందుతున్నట్లుంది. చైనాతో ఘర్షణ పడటం కన్నా కలిసి పనిచేయడమే ఇరుదేశాల మధ్య సుహృద్భావ వాతా వరణం ఉంటే మంచిదని పదేపదే చెబుతున్నారు. తాము కూడా అణ్వాయుధాల తయారీని పున: ప్రారం భించి ఐదేళ్లలో రష్యా, చైనాలను దాటిపోవాలని యోచి స్తున్నారు. చైనా ఎంత వేగంగా అణ్వస్త్ర తయారీ చేసినా అమె రికాను చేరుకోవడం బహుకష్టమే. కానీ ట్రంప్ ఎందుకో ఈ విషయమై అతిగా ఆలోచిస్తున్నారు. అణ్వా యుధ తయారీకి వెనుకడుగు వేయలేని పరిస్థితి ఉంది. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో అమెరికా అణ్వస్త్ర ప్రయో గాలకు వెళ్లనుంది. చాలా దేశాలు రహస్యంగా భూగర్భం లో పరీక్షలు నిర్వహిస్తున్నందున బయటి ప్రపంచానికి తెలి యరాలేదు. మూడో ప్రపంచ యుద్ధానికి ఎలాగూ సమయం కాదు.అయినా కేవలం కొన్నికొన్ని దేశాలమధ్య సాగుతున్న చిచ్చు నేపథ్యంలోనే యుద్ధ వాతావరణం ఏర్పడ్తున్నా అవేమీ భారీ యుద్ధాలు కాదు. అలాంటి భారీ యుద్ధాలు ఇక చూడం. చిన్న చిన్న యుద్ధాలు మాత్రమే. మామూలు యుద్ధానికే సమయస్ఫూర్తితో నిర్ణయం తీసుకోవాలి. లేకుంటే అణు విధ్వంసాలకు ఏ దేశమైనా మూల్యం చెల్లించుకోక తప్పదు.



మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.

పాస్కల్



సంతృప్తిపడే వ్యక్తి ఏనాటికీ పేదవాడు కాదు. అలాగే అసంతృప్తి చెందే వ్యక్తి ఎన్నటికీ సంపన్నుడు కాలేడు.

థామస్ జెఫర్సన్

## ప్రజావాక్కు



### పెరుగుతున్న శబ్దకాలుష్యం

ఇటీవలి కాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు డిజె సౌండ్ ప్రభావం పెరుగుతోంది. వివాహాలు, జాతరలు, పండుగలు,రాజకీయసమావేశాలు వంటి ప్రతి వేడుకలోనూ డిజెసౌండ్ ఒకఅలవాటుగా మారిపోయింది. అయితే ఈ సౌండ్ ఎఫెక్ట్‌లు కేవలం వినోదానికి పరిమి తం కాకుండా, అనేకమంది ప్రాణాలను హరిస్తున్నాయి. అధిక డెసిబెల్స్‌లో వినిపించే ఈ శబ్దం గుండెపోటు, చెవుల నష్టం,నరాల బలహీనత, ఒత్తిడి వంటి అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది. ఇటీవల డిజె సౌండ్ ప్రభా వంతో గుండెపోటుతో మరణించిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదాలను నివారించాలంటే ప్రజల్లో అవగాహన పెంచడం అత్యవసరం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి

సరసమైన ధరలకు మంచి ఆరోగ్య సంరక్షణ, సౌకర్యవం తమైన జీవితం పొందడం సమాజంలోని ప్రతి పౌరుని హక్కు. ఈహక్కు పొందాలంటే నగరాలు, గ్రామీణ ప్రాం తాలు, మారుమూల ప్రాంతాలలో తగినంత సంఖ్యలో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలుండాలి. తగినంత సంఖ్య లో వైద్యులు,నర్సులు,ఇతర ఆరోగ్యకార్యకర్తలు, అవసర మైన వైద్య పరికరాలు,సౌకర్యాలు,మందులు ఉండాలి. ఆరోగ్య సంరక్షణ ప్రదాతలైన వైద్యులు, నర్సులు, పారా మెడికల్ కార్మికులకు సురక్షితమైన జీవనోపాధి, సురక్షి తమైన పని పరిస్థితులు, గౌరవప్రదమైన జీవన వేతనం, పెన్షన్ మొదలైనవి కలిగి ఉండాలి. ప్రభుత్వం ప్రజారోగ్య శాఖకుఅధికనిధులతో వైద్యసిబ్బందిజీతభత్యాలతో పాటు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించవచ్చు.

- ఆళవందార్ వేణు మాధవ్, హైదరాబాద్

### బాలికల గురుకులాలకు పురుషులు వద్దు

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బాలికల గురుకులాల్లో పురు షులను నియమించకూడదు.బాలికల గురుకులాల్లో వికలాంగుల నియామకం కూడా వద్దు. ఎస్ సి. యస్ టి. బిసి.గురుకుల రాష్ట్రసెక్రటరీలకు ఆదేశాలు జారీ చేయాలి. వికలాంగుల లెక్చరర్, టీచర్స్‌కు మధ్యంతర బదలీలు చేయడం నిలిపివేయాలి. విద్యా సంవత్సరం మధ్యలో బదలీలు వద్దు.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### కాలుష్య కోరల్లో ఢిల్లీ

దేశరాజధాని ఢిల్లీ మరోసారి వాయుకాలుష్య కోరల్లో చిక్కుకుంది. ప్రతి ఏడాది శీతాకాలం ప్రారంభంలో పొగమంచు, వాహనాల ఉద్గారాలు, పారిశ్రామిక వ్యర్థాలు, పంట అవశేషాల దహనం కలిపి నగరాన్ని ముసిరేస్తాయి. ఈసారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. పంజాబీ బాగ్ వద్ద ఏక్యూఐ (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) 425 మార్క్ దాటటం ద్వారా హాజర్డస్ స్థాయికి చేరింది. అంటే, ఈ గాలి పరిస్థితుల్లో సర్వసాధారణ ప్రజలు మాత్రమేకాదు,ఆరోగ్యవంతులైనా ఊపిరి పీల్చడం కష్టమవుతుంది. వృద్ధులు,పిల్లలు,గర్భిణీలుశ్వాస సంబంధ వ్యాధులున్న వారికి ఇది ప్రాణాంతకమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణంలో ముసురుకుపోయిన పొగమంచు, వాహనాల ఎగ్జాస్ట్, పరిశ్రమల పొగలు కలిసి ఢిల్లీని ఒక గ్యాస్ చాంబర్‌గా మార్చేశాయి.ఢిల్లీ ప్రజలు వాహనాల వాడకం తగ్గించాలి. కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్‌పల్లి జిల్లా

### ప్రైవేట్ బస్సులను నియంత్రించాలి

ప్రస్తుతం రోడ్లపై ప్రైవేట్ బస్సుల సంఖ్య పెరుగుతున్నందున వాటిపై కఠినమైన నియంత్రణ అవసరం. ప్రభుత్వం, రవాణా శాఖలు ప్రైవేట్ బస్సుల లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్‌లు, బీమా పత్రాలు వంటి అంశాలను నిరంతరం తనిఖీ చేయాలి. డ్రైవర్ల సరైన అర్హతలు, అనుభవం కలిగి ఉండాలి. బస్సుల సాంకేతిక స్థితి, టైర్లు, బ్రేకులు,లైట్లుమొదలైన వాటిని సమయానుకూలంగా పరిశీలించాలి.అలాగే బస్సుల్లో అధిక వేగం, ఓవర్‌లోడింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను కఠినంగా నిషేధించాలి.ప్రయాణికులు కూడా తమభద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. వారు సురక్షితమైన, నిబంధనలు పాటించే బస్సులను మాత్రమే ఎంచుకోవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### రక్షణ మార్గాలను ఏర్పాటు చేయాలి

తిరుపతి తిరుమల ఘాట్‌రోడ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పైనుండి పెద్ద బండ రాళ్ళు కిందికి పడినవి. ఈ ఘాట్ రోడ్‌లో నిత్యమూ బస్సులు లక్షల ప్రయాణీకుల్ని తీసుకువెళ్తాయి. ఏడాది పాటు ట్రాఫిక్ ఉంటుంది. దశాబ్ద కాలం నుండి ఈ ఘాట్ రోడ్, పైన కొండలు,మలుపులు పూర్తిగా చూసి దేశంలోని అత్యంతప్రతిష్టాత్మకసాంకేతిక పరిజ్ఞానంఉన్న నిపుణులు ఒక పూర్తి అభిప్రాయం ఇచ్చారు గనుక అప్పటి నుండే ప్రమాద సూచన ఉన్నట్లు.

- ఎన్. బొల్లోజు మేఘానథం, విశాఖపట్నం

## జంతు హక్కులను పరిరక్షిస్తున్నామా?

జంతువుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ, మానవుడు తన స్వార్థం కొరకు ఇష్టానుసారంగా అడవులను నరికి వేస్తూ తిరిగి అవసరమైన వృక్ష సంపదను పెంచకుండా మూగజీవుల నివాసాలను కనుమరుగు చేస్తున్న సందర్భాల్లో జంతు జాతికి నిలువ నీడ లేక నివసించుటకు పోటీపడే పరిస్థితుల్లో అడపాదడపా కొన్నిక్రూర జంతువులు మానవ నివాస ప్రాంతాల వైపు దూసుకొస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ది యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా లాంటి సంస్థలు జంతుజాతిని పరిరక్షించుటకు నిర్విరామంగా కృషి చేస్తున్నప్పటికీ, జంతువుల వల్ల మానవ జీవన విధానాలకు ఆటంకం లేకుండా, మానవుల వలన జంతువు నివాసాలకు నష్టం కలగకుండా జంతు సంరక్షణకు మానవ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో పరస్పర సహకారంతో మూగ జీవుల నుండి ఎదురయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించడంలో సందేహం లేదు.

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో అనేక నగరాల్లో, పట్టణాల్లో గ్రామీణ ప్రాంతాల్లో సంచరించే మానవ సంరక్షణలో లేని మూగ జీవులు ఉండడానికి సరైన నిర్దిష్టమైన నివాసయోగ్యమైన ప్రదేశాలు లేక వాటిని పట్టించుకునే వారు లేకపోవడంతో కుక్కలు, పశువులు లాంటివి రహదారుల్లో, వీధుల్లో యధేచ్ఛగా తిరుగాడుతూ జనాలకు ఆటంకం కలిగిస్తూ ఉండడం, కొన్నిసార్లు మనుషుల పైకి దాడి చేసినప్పుడు మనుషులు ప్రమాద అంచున పడిపోయిన సందర్భాలు ఉండటం కొనియం. మూగ జీవులు తెలిసి, తెలియక తరచూ రహదారుల్లో వాహనాలకు అకస్మాత్తుగా అడ్డురావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిసార్లు కుక్కల దాడుల్లో కూడా ప్రజలు ఎక్కువ ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు సమాజంలో సర్వసాధారణమైపోతున్నాయి. సాధ్యమైనంత మేరకు పట్టణాలు నగర వీధుల్లో సంచరించే కుక్కలు, పశువులు లాంటి జంతువులపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి, మూగ జీవులకు నష్టం కలిగించకుండా వాటితో మనుషులకు కూడా హాని కలుగకుండా ఉండే రీతిలో క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇటీవల భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సూచనలు చేయడం విశేషం. జనాలు అధికంగా తిరిగే ప్రాంతాల్లో విద్యాసంస్థలు ఆసుపత్రులు బస్టాండ్లు రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో తిరుగాడే జంతువులను పశువులను జన సమూహాల్లోకి రాకుండా నియంత్రించే విధంగా అవసరమైన ప్రత్యేక భద్రత ఏర్పాట్లు వల్ల మూగజీవుల వల్ల కలుగుతున్న అనర్థాలు కొంతవరకైనా నియంత్రించవచ్చు అనే భావన ప్రజల్లో లేకపోలేదు. యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధన ప్రకారం ఇంట్లో పెంచుకునే జంతువులకు వీధిలో సంచరించే జీవాలకు తరచూ క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉండడమే కాకుండా తర్వాత వాటిని ప్రత్యేకమైన జంతు పునరావాస కేంద్రాల్లో ఉంచి జంతువులకు కావాల్సిన సంరక్షణను మరింతగా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులతో పాటు జంతువులను పెంచే యజమానులకు ఉంటుందనే భిన్నాభిప్రాయాలు తెరపైకి వస్తున్నాయి. ఆటవిక ప్రాంతాల్లో నివసించే క్రూరజంతువులు మినహా పరిసరాల్లో సాధారణంగా కనిపించే కుక్కలు,పిల్లులు లాంటి జంతువులు, పశువులు చాలావరకు కావాలని మనుషులపై దాడి చేయకుండా ప్రయత్నించడాని మానవులతో కలగలుపుగా వ్యవహరిస్తున్న జంతు జీవులు ఏవికూడా మానవులకు హాని కలిగించేరీతిలో ప్రవర్తించవనికేవలం ఆహారాన్ని వెతుక్కుంటూ సంచరిస్తున్న సందర్భంలో అనుకోకుండా జరిగే దుర్ఘటనలతో ప్రజలతో



పాటు మూగ జీవులు కూడా తీవ్రమైన ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది అనే వివిధ విభిన్నమైన వాదనలు సమాజంలో లేకపోలేదు. మానవ అవసరాలకు కొన్నిసార్లు ఇష్టానుసారంగా అడవులు నరికివేతవల్ల దాడుకోవడానికి చోటులేక గూడు వదిలి దారి తప్పి రహదారుల్లోకి సంచరించే జంతువులు వాహనదారుల అప్రమత్తత లేకపోవడంవల్ల వాహనాలకింద పడి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నాయి. మానవులు ప్రమాద బారినపడితే ఏదో ఒకరు ఎంతో కొంత సహాయరులుగా అవసరమైతే వైద్యంకొరకు సమాచారం అందించే అవకాశం ఉంటుంది. కానీ జంతువులకు భారీ వాహనాలు ఢీ కొట్టినప్పుడు ఎవరికి చెప్పుకోలేని బాధతో మూగ జంతువులు అరుస్తూ విలవిలలాడిపోతూ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకునే వారు అతికొద్దిమంది మాత్రమే ఉంటారు.ఇలాంటి దృశ్యాలు మనసును కలిచి వేస్తుంటాయి. భారత రాజ్యాంగ ప్రకారం చట్టాలను అనుసరించి భూమిపై జీవించే హక్కు మనుషులతో పాటు జంతువులకు కూడా ఉంటుంది. మూగజీవులు జీవించే హక్కును ఎవరు కూడా భంగం కలిగించేందుకు ప్రయత్నించ వద్దు. అంతే కాకుండా మూగ జీవులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంటుంది.మానవులు నివసించే ప్రదేశాల్లో జంతువులు,జంతువులు సంచరించే ప్రదేశాల్లో మానవులుండడం ఎక్కువ శాతం సాధ్యం కాదేమో. కేవలం మానవులు తమ అవసరాలకు జంతువులను పెంచుకుంటున్న వాటి పూర్తి పరిరక్షణ సంరక్షణ బాధ్యత వారిపైనే ఉండాల్సిందే. ఏది ఏమైనప్పటికీ మానవజాతి తోపాటు జంతువులు కూడా ప్రకృతిలో భాగస్వామ్యమై ఉన్నాయి. నొప్పి అంటే తెలుసు వాటికి దెబ్బ అంటే తెలుసు వాటికి బాధ అంటే తెలుసు, వాటికి భయం అంటే తెలుసు, వాటికి ఆకలంటే మూగ జీవులు తరతరాలుగా అనేకసంవత్సరాలుగా మానవ జీవన విధానాల్లో అనాదిగా కలిసిజీవిస్తూ ఉంటాయి. మరి కొన్ని జంతు జాతులు మానవ సంచారం లేని ప్రాంతాల్లో దట్టమైన అడవి ప్రాంతాల్లో నివసించడం సర్వసాధారణమే అయినప్పటికీ, కొన్ని సందర్భాల్లో జంతువుల వల్ల మానవులకు హాని జరుగుతుంటాయి. మానవుల వల్ల జంతువులూ బాధకుగురిఅవుతుంటాయి అనేది అక్షర సత్యం. జంతువుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నప్పటికీ, మానవుడు తన స్వార్థంకొరకు ఇష్టానుసారంగా అడవులను నరికివేస్తూ తిరిగి అవసరమైన వృక్ష సంపదను పెంచకుండా మూగజీవులనివాసాలను కనుమరుగు చేస్తున్న సందర్భాల్లో జంతు జాతికి నిలువ నీడలేక నివసించుటకు పోటీపడే పరిస్థితుల్లోఅడపాదడపా కొన్నిక్రూర జంతువులు మానవ నివాస ప్రాంతాల వైపు దూసుకొస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ది యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా లాంటి సంస్థలు జంతుజాతిని పరిరక్షించుటకు నిర్విరామంగా కృషి చేస్తున్నప్పటికీ, జంతువుల వల్ల మానవ జీవన విధానాలకు ఆటంకం లేకుండా, మానవుల వలన జంతువు నివాసాలకు నష్టం కలగకుండా జంతు సంరక్షణకు మానవ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో పరస్పర సహకారంతో మూగ జీవుల నుండి ఎదురయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించడంలో సందేహం లేదు. •

## ఉద్యోగాల కల్పనలో ఎఐ దే కీలక పాత్ర

ఎస్.సీతారామయ్య

దేశంలో రానున్న కాలంలో ఉద్యోగాల స్వరూపమే అనూహ్యంగా మారిపోయే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇదివరకు డిగ్రీలుంటే కానీ సరైన ఉద్యోగాలు రాని పరిస్థితి ఉండగా, ఇప్పుడు సాంకేతిక నైపుణ్యం ముందు డిగ్రీలు చిన్నబోతున్నాయి. దేశంలో ఎఐ(కృత్రిమ మేథ) నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో 88 శాతం వరకు ఎఐ ప్రోగ్రాములు అమలవుతున్నాయి, ఉత్పాదక ఆధారిత ఏఐ శిక్షణ నమోదులో అమెరికా, భారత్ దేశాలు ముందుండడంతో ప్రపంచ వ్యాప్తంగా ఏఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. జనరల్ ఎఐ శిక్షణను పెంచడంలో కార్పొరేట్ సంస్థలు ముందుంటున్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలకు ప్రపంచవ్యాప్తంగా 14 మిలియన్ల కన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారు. జనరల్ ఎఐ వినియోగం ప్రస్తుతం అన్ని రంగాల్లో పెరుగుతోంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వినియోగించుకుని సరికొత్త చిత్రాలు, పాఠ్యాంశాలు, సంగీతం తదితర అంశాలను సృజించే వ్యవస్థలను జనరేటివ్ ఎఐగా వ్యవహరిస్తున్నారు. ఎఐ నైపుణ్యానికి సంబంధించి దేశంలో 67 శాతం కంపెనీలు కొత్త విభిన్న నైపుణ్య ప్రతిభపై దృష్టి సారిస్తున్నాయి. 2030 నాటికి దేశంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, మరోవైపు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, అలాగే ప్రపంచంలో 170 మిలియన్ కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, 92 మిలియన్ ఉద్యోగాలు కోల్పోవడమవుతుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) నివేదిక వెల్లడించింది. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎఐ, రోబోటిక్స్, ఎనర్జీ టెక్నాలజీ వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. దేశంలో బిగ్ డేటా, ఎఐ, మెషీన్లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు దేశంలో వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత దేశంలోని ఐటి రంగం ప్రస్తుతం 5.4 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఈ సంఖ్యను 10 మిలియన్ వరకు రెట్టింపు చేయాలన్న టార్గెట్ ఉండగా, కేవలం 7.5 మిలియన్ వరకే సాదించగలమని ఆయా రంగ నిపుణులు చెబుతున్నారు. దీనికి కార



ణం ఎఐ విస్తరించడం వల్ల ఇప్పుడున్న ఉద్యోగాలు పోతాయన్న భయం వెంటాడుతుండడమే.ప్రస్తుతం ఈ వృద్ధి అంతా డిజిటల్ సాంకేతికత వైపు దూసుకెళ్తొంది. ఎఐ,క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోమేషన్ తదితర సాంకేతిక ప్రక్రియలు పారిశ్రామిక, వాణిజ్య సంస్థల ప్రోత్సాహంతో విస్తరిస్తున్నాయి. ఇది వరకటి 10 మిలియన్ ఉద్యోగాల టార్గెట్ను 7.5 మిలియన్ ఉద్యోగాలకు సవరించినప్పటికీ, ఉద్యోగాల రాశి కన్నా నైపుణ్యం, నాణ్యతలకు పట్టం కడుతున్నారు. ఎఐ, ఆటోమేషన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ఉద్యోగాల నియామక ప్రక్రియలను క్రమబద్ధం చేస్తున్నాయి. ఈ మార్పులు, అత్యంత విలువైన సాంకేతిక సేవలు, నూతన ఆవిష్కరణల వైపు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయి.ఈ ఆధునిక సాంకేతిక నైపుణ్య ప్రక్రియలను అందిపుచ్చుకోగలిగితేనే ఇప్పుడు ఉద్యోగాలు లభిస్తాయి.ఈ మేరకు ఉద్యోగ అవకాశాలు 80శాతం వరకు సాంకేతిక నిపుణులతో 2025-26 నాటికి 20 వరకు పెరుగుతాయని ఐటి రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. అత్యంత ఆధునిక సాంకేతికతల వల్ల 2030 నాటికి దేశంలో 150 బిలియన్ డాలర్ల వరకు ఆర్థిక ప్రయోజనం సిద్ధిస్తుందని అంచనా వేస్తున్నారు. జనరేటివ్ ఎఐవంటి సాంకేతికతలే ఐటిరంగంలో 2030 నాటికి రెండు మిలియన్ల వరకు కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయని నివేదికల వల్ల తెలుస్తోంది. దేశంలో ప్రస్తుతం 1700 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఉన్నాయి. వీటి వల్ల 1.9 మిలియన్ మంది ఉద్యోగాలు పొందుతున్నారు. 2030 నాటికి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల సంఖ్య 2200 వరకు చేరుకుంటుందని, వాటి ద్వారా 2.5 మిలియన్ నుంచి 2.8 మిలియన్‌వరకు ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయని ఐటి నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అనేవి ఎదురవుతున్న సవాళ్లకు అనుగుణంగా అనేక రకాల వ్యూహాత్మక విధులను నిర్వహించడానికి బహుళజాతి సంస్థలు స్థాపించే కేంద్రాలు, ఆవిష్కరణ కార్యక్రమాలు,పరిశోధనలు, సాఫ్ట్వేర్ డెవలప్మెంట్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ పరివర్తన కార్యక్రమాలను వేగవంతం చేయడం, వనరుల వినియోగాన్ని పెంచడం తదితర విధులను ఈ కేంద్రాలు నిర్వహిస్తుంటాయి.ఐటి రంగంలో ఒప్పందం ప్రకారం ఉద్యోగులను నియమించుకునే విధానంలో 43.5డిమాండ్తో బెంగళూరు కేంద్ర స్థానంగా ఉన్నప్పటికీ, 13.4 డిమాండ్లో రెండో అత్యధిక స్థానంలో హైదరాబాద్ ఉంది. ఈ ఉద్యోగాల కల్పనలో విద్యార్హతల కన్నా సాంకేతిక నైపుణ్యమే కీలక పాత్ర వహిస్తోందన్నది ఉద్యోగార్థులు గమనించవలసిన కీలకాంశం. •

## ప్రపంచాభివృద్ధికి యువతే ప్రధాన వనరు



డా. చిటికెన కిరణ్ కుమార్

యువత అంటే ఉత్సాహం, కలలు, ఆవేశం, ఆశ. ఒక కొత్త ఉదయం వలె వీరి ఆత్మలో వెలుగు ఉంది.ఆ వెలుగేచైతన్యం. మన సమాజానికి జీవం ఇచ్చే శక్తి యువతలో ఉంది. ఒక చినుకుతో నది మొదలవుతుంది, ఒక ఆలోచనతో మార్పు మొదలవుతుంది. ఆ ఆలోచన యువత హృదయంలో వెలిగితే, సమాజం కొత్త దిశగా సాగుతుంది. ప్రతి తరంలో యువతే ఆశల ప్రతీక. వారిలో ఉప్పొంగే ఉత్సాహం దేశాన్ని ముందుకు నడిపే శక్తిగా మారుతుంది. కానీ ఆ ఉత్సాహం సరైన మార్గంలో నడిస్తేనే అది వెలుగు అవుతుంది. దిశ లేకుండా వెలిగితే అది క్షణంలోనే ఆరిపోతుంది. అందుకే ప్రతి యువ మనసులో చైతన్య జ్యోతి వెలగాలి. ఆ జ్యోతి అంటే తెలుసుకోవాలనే తపన, జీవితం పట్లబాధ్యత, ఇతరుల పట్ల కరుణ, సమాజం పట్ల సేవా మనస్సు.మన దేశ చరిత్రలో ప్రతి పుటలో యువత పాత్ర గొప్పది. స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి నడిచినవారు కూడా యువకులే. చిన్న వయసులోనే వారు తమ జీవితాన్ని త్యాగం చేసి ఈ దేశానికి గౌరవం తెచ్చారు. నేటి యువత కూడా ఆ స్ఫూర్తిని తిరిగి పొందాలి. కాలం మారింది కానీ విలువలు మారకూడదు. వీరుల త్యాగం మనకు మార్గదర్శనం. ఆ మార్గంలోనే నేటి యువజనులు నడవాలి.ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోంది. విజ్ఞానం, సాంకేతికత, సమాచార వనరులు అన్నీ చేతిలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. కానీ ఆ సదుపాయాలను ఉపయోగించే తీరు మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది.స్మార్ట్‌ఫోన్ మన చేతిలో ఉన్నా, మన ఆలోచనలు ఇంకా చీకటిలో ఉంటే ఆ సాంకేతికత వ్యర్థం. అందుకే యువతలో చైతన్యం అనేది మానసిక అవగాహన. ఆలోచించగల శక్తి. మనసును మన దిశలో నడిపించగల శక్తి. యువత అంటే కేవలం వయస్సు కాదు, అది మనసు స్థితి. వయస్సు పెరిగినా చైతన్యం ఉన్నవారు ఎప్పటికీ యువకులే. కానీ నేటి యువతలోని చాలామంది ఈ చైతన్యాన్ని లోతుగా గ్రహించడం లేదు. విద్య అంటే ఉద్యోగం మాత్రమే కాదు, విద్య అంటే మనిషిని మేల్కొలిపే శక్తి. ఒక పుస్తకం మనకు జ్ఞానం ఇస్తుంది, కానీ ఒక సద్విచారం మన జీవితాన్ని మారుస్తుంది. ఈ మార్పు కోసం యువతలో చైతన్యం జ్వలించాలి. మన గ్రామాల్లో, పట్టణాల్లో, కళాశాలల్లో యువత సమాజం కోసం ఏదైనా చేయాలనే తపనతో నిండిపోవాలి. చెత్త సమస్య నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, చదువు నుంచి కళల వరకు ప్రతి రంగంలో యువత చురుకుగా పాల్గొనాలి. ఒక మొక్క నాటడం చిన్న పని అనిపించినా, అది జీవం నాటడం వంటిదే. ఒక చిన్న సాయం, ఒక మంచి మాట కూడా చైతన్య జ్యోతిగా వెలగవచ్చు.నేటి యుగంలో మానవ సంబంధాలు కొంచెం దూరమవుతున్నాయి. సామాజిక మాధ్యమాలు దగ్గ



ర చేసినా, మనసులు దూరమవుతున్నాయి. ఈ మధ్యలో యువతే సమతుల్యతను సాధించగల శక్తి. సాంకేతికతను సద్బుద్ధితో వాడితే అది చైతన్యానికి వేదిక అవుతుంది. అజ్ఞానంగా వాడితే అది మనిషిని ఒంటరితనంలోకి నెడుతుంది. అందుకే యువతలో సాంకేతిక జ్ఞానం మాత్రమే కాదు, మానవతా జ్ఞానం కూడా అవసరం.ప్రతి యువకుడు తనలోని చినుకును, తన ఆలోచనను వెలిగించుకోవాలి. 'నేను ఏమి చేయగలను? అనే ప్రశ్నతో మొదలయ్యే ఆలోచనే చైతన్య జ్యోతి. ఎవరో ప్రారంభిస్తారని ఎదురుచూడకుండా, తానే మార్పుకు మార్గం చూప్పాలనే తపన కలిగి ఉండాలి. అప్పుడు ఒక్కరి కాంతి మరొకరిని వెలిగిస్తుంది, చివరికి అది సమాజం మొత్తం వెలుగుతో నిండుతుంది. విద్యార్థి దశలోనే యువతకు సమాజం పట్ల అవగాహన కలగాలి. పాఠ్యపుస్తకాల జ్ఞానం సరిపోదు, జీవన పుస్తకం చదవడం కూడా అవసరం. పేదరికం, నిరుద్యోగం, పర్యావరణ నాశనం, విలువల క్షీణత వంటి అంశాలపై ఆలోచించే తరం ఏర్పడాలి. ఆలోచనలే మార్పుకు విత్తనాలు. ఈ విత్తనాలు మనసులో నాటితే భవిష్యత్తులో సమాజం పచ్చని చెట్టుగా ఎదుగుతుంది. యువతలో చైతన్యం అంటే కేవలం ఆత్మవిశ్వాసం కాదు, అది బాధ్యతాభావం. మన దేశం,మన భూమి, మన ప్రజలు -ఇవన్నీ మనదే అనే తపనతో ముందుకు సాగడం. ఉద్యోగం సంపాదించడమే లక్ష్యం కాకుండా, జీవితంలో ఉపయోగకరమైన పని చేయాలనే సంకల్పం ఉండాలి. ఒక్కరి విజయంకాదు,సమాజ విజయం ముఖ్యం. చైతన్య జ్యోతి వెలగాలంటే ధైర్యం అవసరం.కష్టాలముందు నిలబడగల సత్తా అవసరం. ప్రతి విఫలం ఒక పాఠంగా తీసుకోవాలి, ప్రతి తప్పు ఒక మార్గదర్శకంగా మార్చుకోవాలి. విజయానికి దారితీసేది క్రమశిక్షణ, నిబద్ధత, నమ్మకం. ఇవి ఉన్న చోట చైతన్యం వెలుగుతుంది. సామాజిక సేవలో యువత పాత్ర అపారమైనది. గ్రామాల్లో ఉన్న సమస్యలపై అవగాహన కలిగివాటిని పరిష్కరించడానికి ముందుకు రావడం, రక్తదానం చేయడం, పుస్తకాలు పంచడం, పాఠశాలల్లో విద్యార్థులకు స్ఫూర్తి కలిగించడం ఇవన్నీ చైతన్యానికి నిదర్శనాలు. సత్యం, ప్రేమ, సేవ అనే మూడు దీపాలతోనే యువత ఆత్మ వెలుగుతుంది.ప్రపంచం మారడానికి పెద్ద అద్భుతం అవసరం లేదు. ఒక చిన్న ఆలోచన, ఒక నిజమైన ప్రయత్నం చాలు. ఉదయం సూర్యుడు చీకటిని పారద్రోలినట్లు, ఒక చైతన్యవంతుడైన యువకుడు తన పరిసరాలను వెలుగుతో నింపగలడు. ఆ ఒక్క చినుకుతోనే వాన మొదలవుతుంది. ప్రతీ యువకుడు తనలోని ప్రతిభను గుర్తించాలి. కొందరికి కళల పట్ల ఆసక్తి ఉంటుంది.కొందరికి విజ్ఞానంపై, మరికొందరికి సేవాపరమైన మనస్సు ఉంటుంది. ఈ ప్రతిభను సమాజ ప్రయోజనానికి ఉపయోగించడమే చైతన్యం. మనం ఏ రంగంలో ఉన్నా – నిజాయితీతో, కర్తవ్యభావంతో, ప్రేమతో పని చేస్తేనే మన జీవితం అర్థవంతమవుతుంది. యువతలో చైతన్యం వెలిగితే కుటుంబం బలపడుతుంది. సమాజం పుష్టిపడుతుంది. దేశం ముందుకు సాగుతుంది.కాలం మారుతున్నా విలువలు నిలబెట్టుకోవడం సులభం కాదు.కానీ విలువలేని జీవితం చీకటిలాంటిది. నిజాయితీ, కరుణ,సహనం, సహకారం ఇవి యువతలో కొనసాగాలి. ఈ విలువలే చైతన్య జ్యోతికి ఇంధనం. ఆ ఇంధనం లేకుంటే వెలుగు ఆరిపోతుంది. పాఠశాలల్లో, కళాశాలల్లో కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, జీవితం పట్ల అవగాహన కలిగించే కార్యక్రమాలు జరగాలి. సాహిత్యం, కళ, విజ్ఞానం, సేవ -ఇవన్నీ యువతలో చైతన్యాన్ని పెంచే సాధనాలు. మనసులోని సందేహాలను ప్రశ్నగా మార్చడం, ప్రశ్నను ఆలోచనగా మార్చడం, ఆలోచనను చర్యగా మార్చడం – ఇదే నిజమైన చైతన్య ప్రవాహం. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఢిల్లీలో తీవ్రస్థాయికి వాయుకాలుష్యం



**న్యూఢిల్లీ, నవంబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయిలోనే కొనసాగుతోంది. వరుసగా మూడో రోజు బుధవారం కూడా గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) 400 పైన తీవ్ర కేటగిరీలోనే నమోదైంది. నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో చాలా ప్రాంతాల్లో దృశ్యవీక్షణం గణనీయంగా పడిపోయింది. దీంతో ప్రజలు స్వచ్ఛమైన గాలి కోసం అల్లాడిపోతున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసిన డేటా ప్రకారం బుధవారం ఉదయం గీతా కాలనీలక్ష్మీ నగర్ రోడ్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచీ 413గా నమోదైంది. ఇండియా గేట్, కర్తవ్య పథ్ పరిసరాలను సైతం విషపూరిత పొగమంచు కప్పేయగా, అక్కడ ఎక్యూఐ 408గా ఉంది. నగరంలోని ఇతర ప్రాంతాలైన ఆనంద్‌విహార్‌లో 438, అశోక్‌విహార్‌లో 439, చాందినీ చౌక్‌లో 449, ద్వారకా సెక్టార్8లో 422, ఐటీఓలో 433, జహంగీర్‌పురిలో 446, ఆర్‌కే పురంలో 432, రోహిణిలో 442గా గాలి నాణ్యత నమోదైంది. ఇంతటి కాలుష్యానికి ఎక్కువసేపు గురైతే తీవ్రమైన శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 చర్యలను అమలు చేయడంలో భాగంగా 5వ తరగతి వరకు విద్యార్థులకు బుధవారం నుంచి హైబ్రిడ్ విధానంలో తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. జీఆర్‌ఏపీ ఫేజ్3 కింద భద్రతా చర్యలు వేగంగా అమలు చేస్తున్నాం. బుధవారం నుంచి 5వ తరగతి వరకు క్లాసులు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. పాఠశాలల్లో హైబ్రిడ్ విధానం అమల్లో ఉంటుందని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తెలిపారు. ఈ మేరకు ఢిల్లీ విద్యాశాఖ ఒక సర్క్యులర్ జారీ చేసింది. విద్యాశాఖ, ఎన్‌డీఎంసీ, ఎంసీడీ, ఢిల్లీ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు తక్షణమే 5వ తరగతి వరకు విద్యార్థులకు హైబ్రిడ్ (ఫిజికల్, ఆన్‌లైన్) విధానంలో తరగతులు నిర్వహించాలి. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఈ విధానం కొనసాగుతుంది" అని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఈ కొత్త ఏర్పాట్ల గురించి తల్లిదండ్రులకు వెంటనే తెలియజేయాలని పాఠశాలల యాజమాన్యాలను విద్యాశాఖ డైరెక్టర్ వేదితా రెడ్డి ఆదేశించారు. కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ మంగళవారం ఢిల్లీఎన్‌సీఆర్‌లోని పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యలపై వివరణాత్మక నివేదికలు సమర్పించాలని ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులనుఆదేశించారు.

# ఎన్నికల్లో అన్ని పార్టీలను ప్రభావితంచేసిన 'జన్‌సురాజ్'



**పాట్నా, నవంబరు 12:** ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా పేరొందిన ప్రశాంత్ కిశోర్ రాజకీయ పార్టీ పెట్టి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయ పార్టీలనుప్రభావితంచేసారు. సీట్లు రాకపోవచ్చన ఎగ్జిట్‌పోల్ అంచనాల్లో వెల్లడి అయితే గణనీయంగా ఓట్లను మాత్రం చీల్చిందని తేలింది. ఇది మహాఘట్‌బంధన్‌కే నష్టం కలిగించినట్లు నిపుణల అంచనా. జన్ సురాజ్ తరఫున పలువురు అభ్యర్థులను బరిలోకి దించారు. ఎగ్జిట్ పోల్స్ లో జన్ సురాజ్ పార్టీ గరిష్ఠంగా ఐదు సీట్లు గెల్చుకోవచ్చని అంచనా వేశాయి. అయితే, సీట్ల విషయం పక్కన పెడితే ఈ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ భారీగా ప్రభావం చూపిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సింగిల్ సీటు గెల్చుకోకున్నా సరే జన్ సురాజ్ పార్టీ పలు సీట్లలో అభ్యర్థుల తలరాతను మార్చేసిందని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఖాతా తెరిచే పరిస్థితే లేదు కానీ ఓట్ షేర్ లో మాత్రం ఆ పార్టీ ప్రభావం భారీగా పడిందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను, ఎన్డీయే కూటమి వ్యతిరేక ఓట్లను జన్ సురాజ్ పార్టీ చీల్చిందని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడం వల్ల ప్రతిపక్ష మహాగఠ్ బంధన్ కూటమి తీవ్రంగా నష్టపోయిందని పేర్కొన్నారు. దీనివల్ల అంతిమంగా అధికార ఎన్డీయే కూటమికే ప్రయోజనం కలిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ ప్రభావం ఎలా ఉండబోతోందనే దానిపై ప్రశాంత్ కిశోర్ కూడా పలు సందర్భాల్లో వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు మీడియా సంస్థలతో మాట్లాడుతూ 'అయితే ఆకాశాన్ని అందుకుంటాం, లేదంటే పాతాళానికి పడిపోతాం' అని పేర్కొన్నారు. ఏదేమైనా సరే తమ పార్టీ పొత్తులకు వ్యతిరేకమని, ఫలితాల్లో కింగ్ మేకర్ గా అవతరించినా సరే తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ప్రశాంత్ కిశోర్ స్పష్టం చేశారు.



# పేలుడుకు పదిరోజుల ముందే ఐ20 కారు కొనుగోలు

**న్యూఢిల్లీ, నవంబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పేలిన ఐ20 కారును డాక్టర్ ఉమర్ నబీ పేలుడుకు పది రోజుల ముందు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. అక్టోబర్ 29న కారును కొనుగోలు చేసిన వెంటనే కాలుష్య నియంత్రణ ధృవపత్రాన్ని తీసుకున్నాడు. ఆ తర్వాత ఉమర్ నబీ అండర్ గ్రౌండ్‌కు వెళ్లిపోగా, కారు ఎక్కడ ఉందో కచ్చితంగా తెలియడం లేదు. ఈ కారు పేలుడుకు ముందు పది రోజులుగా అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం వద్ద ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నప్పటికీ, పోలీసులు మాత్రం అక్కడ లేదని చెబుతున్నారు. కాలుష్య నియంత్రణ ధృవీకరణ పత్రం తీసుకునే సమయంలో ముగ్గురు వ్యక్తులు కారు నుంచి బయటకు వచ్చారు. వారు ఎవరు అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు, గత కొన్ని రోజులుగా పోలీసులు తన సహచరులను వరుసగా అదుపులోకి తీసుకుంటుండటంతో ఆందోళనకు గురైన ఉమర్ నబీ నవంబర్ 10న కారును తీసుకుని ఢిల్లీ వైపు వెళ్లినట్లు దర్యాప్తుతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. ఉమర్ నబీ కారును కొనుగోలు చేసినప్పటికీ యజమానిగా సల్మాన్ పేరు ఉంది. దీంతో పోలీసులు గురుగ్రామ్‌లో అతనిని అదుపులోకి తీసుకున్నారు.

2014 మార్చి 18న సల్మాన్ పేరిట ఈ కారును కొనుగోలు చేశారు. ఆ తర్వాత కారును దేవేంద్ర అనే వ్యక్తికి అమ్మేశాడు. ఆ తర్వాత సోనూ అనే వ్యక్తి చేతికి చేరిన కారు, అనంతరం పుల్వామాకు చెందిన తారిఖ్ వద్దకు చేరింది. ఈ వాహనం పలు మార్లు చేతులు మారినప్పటికీ యాజమాన్య బదిలీకి సంబంధించి ప్రభుత్వం వద్ద ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేవు.



# దేశంలో ఉగ్ర కుట్రలకు రెండేళ్లు కష్టపడ్డాం

## ఇంటరాగేషన్‌లో డాక్టర్ షాహీన్

**న్యూఢిల్లీ, నవంబరు 12:** దేశంలో ఉగ్రవాద కుట్రలకు పాల్పడేందుకు డాక్టర్లు, నిపుణులతో ఏర్పడిన వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ వెనుక ఉన్న లోతైన కుట్రలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌లో భాగస్వామి అయిన డాక్టర్ షహీన్‌ను అధికారులు విచారించగా ఆమె విస్తుపోయే విషయాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా కుట్రల కోసం తాము రెండేళ్లుగా కష్టపడుతున్నట్లు వివరించింది. డాక్టర్ షహీన్ విచారణలో వెల్లడించిన ప్రకారం పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ జైషే మహమ్మద్ కోసం దాదాపు రెండేళ్ల నుంచి దేశవ్యాప్తంగా పలుచోట్ల ఉగ్రదాడులు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మాడ్యూల్‌లో కీలక వ్యక్తి అయిన ఉమర్ ప్రతిసారీ బహుళ ఉగ్ర దాడులు చేయడం గురించి ఉద్రేకంగా మాట్లాడేవాడని షాహిన్ తెలిపినట్లు సమాచారం. డాక్టర్ షహీన్ డాక్టర్ ముజమ్మిల్, ఆదిల్‌తో కలిసి రెండేళ్లుగా అమ్మోనియం నైట్రేట్ వంటి ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు అంగీకరించింది. ఈ సేకరించిన పేలుడు పదార్థాలను ఉపయోగించేందుకు జైషే సంస్థ కోసం దేశ వ్యాప్తంగా దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆమె బయటపెట్టింది. ఈ మాడ్యూల్‌తో తన సోదరుడు పర్వేజ్ సయీద్‌కు కూడా భాగస్వామ్యం ఉందని షహీన్ పేర్కొనడంతో జమ్మూ కాశ్మీర్ పోలీసులు వెంటనే అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ పర్వేజ్ వద్ద ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో అరెస్ట్ అవుతాననే భయంతో వాటిని దాచి ఉంచొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే దర్యాప్తు అధికారులు గురుగ్రామ్‌కు చెందిన అమ్మోనియం నైట్రేట్ సరఫరాదారుడిని గుర్తించినట్లు సమాచారం. త్వరలోనే అతడిని కూడా అరెస్టు చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు డాక్టర్ షహీన్‌ను అధికారులు తదుపరి విచారణ కోసం శ్రీనగర్‌కు తరలించారు. ఈ అరెస్ట్ వెనుక జైషే మహమ్మద్ విస్తృత నెట్‌వర్క్ ఉన్నట్లు అధికారులు బలమైన అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తున్న జమాత్ ఉల్ మొమినాత్ అనే విభాగంలో షహీన్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో మహిళా విభాగాలు స్థాపించి వారిని ఉగ్ర కార్యకలాపాలకు నియామకాలు చేపట్టడం వంటి పనులను షాహిన్ నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడి అయింది. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు తీవ్రతను, దాని ప్రభావాన్ని పరిశీలిస్తే అందులో మిలిటరీ గ్రేడ్ పేలుడు పదార్థాలు ఉపయోగించినట్లు దర్యాప్తు వర్గాలు బలంగా అనుమానిస్తున్నాయి. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తదుపరి విచారణలో తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

# ప్రజాస్వామ్యపునరుద్ధరణ జరిగితేనే తిరిగి వస్తా!

## బంగ్లాదేశ్‌కు షేక్ హాసీనా అల్టిమేటమ్



**న్యూఢిల్లీ, నవంబరు 12:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హాసీనా స్వదేశానికి రావాలంటే ఒక షరతును విధించారు భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హాసీనా. అది బంగ్లాదేశ్ భాగస్వామ్య ప్రజాస్వామ్యం పునరుద్ధరణ జరిగితేనే తిరిగి వస్తానని తేల్చి చెప్పారు. బంగ్లాలో అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఎత్తివేత, స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికల నిర్వహరణపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. మీడియా సంస్థకు ఇచ్చిన ఈ మెయిల్ ఇంటర్వ్యూలో షేక్ హాసీనా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న తాత్కాలిక ప్రభుత్వం, బంగ్లాదేశ్‌కు భారత్‌తో ఉన్న సంబంధాలను ప్రమాదంలో పడేస్తోందని అన్నారు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో బలమైన సంబంధాలు కొనసాగించాం. యూనస్ తన మూర్ఖత్వంతో వాటిని బలహీనపరుస్తున్నారు. కష్ట సమయంలో నాకు ఆశ్రయం కల్పించినందుకు మోడీ ప్రభుత్వానికి, భారత ప్రజలకు కృతజ్ఞతలు. నేను అధికారంలో ఉన్న సమయంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలను పరిష్కరించడంలో మా ప్రభుత్వం విఫలమయ్యింది. అటువంటి భయంకరమైన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకున్నా. కానీ ఆ సమయంలో విద్యార్థి నాయకులు కూడా బాధ్యత తీసుకొని ఉండాల్సిందని షేక్ హాసీనా తెలిపారు. ఇక యూనస్ తాత్కాలిక ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను హాసీనా ఖండించారు. అవన్నీ రాజకీయంగా నన్ను బలహీనపరచడానికే చేసిన కుట్రలు. వచ్చే ఫిబ్రవరిలో జరగబోయే ఎన్నికలను బహిష్కరించమని నేను పిలుపు ఇవ్వలేదు. అవామీ లీగ్‌ను మినహాయించి ఏ ఎన్నిక జరిగినా దానికి చట్టబద్ధత ఉండదు. కోట్లాది మంది మాకు మద్దతు ఇస్తున్నారు. దేశానికి ప్రజల అనుమతి ఆధారంగా నడిచే ప్రభుత్వం అవసరం. ఈ నిషేధాన్ని తొలగిస్తారని నేను ఆశిస్తున్నా. నాకు, అవామీ లీగ్‌కు వ్యతిరేకంగా యూనస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ప్రజాస్వామ్యానికి గౌరవం లేకుండా, మరణదండన బెదిరింపులతో ప్రతిపక్షాన్ని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు. నేను అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు పర్యవేక్షణలో విచారణకు సిద్ధంగా ఉన్నా. యూనస్ నిజంగా నా మీద ఆధారాలు ఉన్నాయని భావిస్తే, ఐసీసీలో కేసు వేయాలి. కానీ ఐసీసీ నన్ను నిర్దోషిగా విడుదల చేస్తుందని యూనస్‌కు తెలుసు. అందుకే ఆయన ఈ సవాలును స్వీకరించడంలేదు అని షేక్ హాసీనా ఆరోపించారు. భారత్ ఎల్లప్పుడూ బంగ్లాదేశ్‌కు అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ మిత్రదేశమని షేక్ హాసీనా తెలిపారు. కానీ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం భారత్‌తో ఉన్న సంబంధాలను ప్రమాదంలోకి పడేస్తోందని అన్నారు.

# ఉల్లి కిలో రూ.1

## కన్నీరు తెప్పిస్తున్న ధర

### పొలంలోనే పంట ధ్వంసం

### మధ్యప్రదేశ్‌లో రైతుల ఆందోళన



**భోపాల్, నవంబరు 12:** దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు పతనమయ్యాయి. మధ్యప్రదేశ్‌లో అయితే ఉల్లి ధరలు అకస్మాత్తుగా భారీగా పడిపోయాయి. మధ్యప్రదేశ్‌లోని ప్రధాన వ్యవసాయ మార్కెట్లలో ఉల్లి ధరలు అనూహ్యంగా పడిపోయాయి. దీంతో పంట సాగు, కోత, రవాణా ఖర్చులను కూడా రైతులు సంపాదించలేక తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. గత కొన్నిరోజులుగా ఉల్లిధర బాగా పడిపోతుండగా.. తాజాగా మాండ్‌సౌర్‌లో కిలో ఉల్లి కేవలం ఒకే ఒక్క రూపాయి పలకడం గమనార్హం. కొన్ని మార్కెట్లలో ఉల్లి ధర కిలోకు రూ.2, రూ.3 వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కేవలం రూపాయి, రెండు రూపాయలకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉల్లి పంట పండించిన రైతులు లబోదిబోమంటున్నారు. పంట పెట్టుబడి ఖర్చులు కాదు కదా రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు. దీంతో కొందరు రైతులు ఉల్లిని పొలాల్లోనే ధ్వంసం చేస్తున్నారు. రత్లాం వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటీలో కనీస ధర క్వింటాల్‌కు రూ.200 వద్ద రికార్డయింది. అంటే కిలో రూ.2 మాత్రమే పలికింది. ఇక సగటు ధర క్వింటాల్‌కు రూ.600గా పలుకుతోంది. ఇక ఉల్లి పంటను పండించేందుకు.. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు రైతులు పెట్టుబడి పెడుతున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలకు తాము పెట్టిన కనీస ఖర్చులను కూడా రాబట్టలేకపోతున్నామని రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. దీంతో మధ్యప్రదేశ్‌లో అధికంగా ఉల్లి పంట పండించే మాల్వా ప్రాంతంలోని రైతులు..


తమ జీవనోపాధిని కాపాడుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. తమకు ఉల్లి, వెల్లుల్లి పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని అమలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్థికమంత్రి సంతకం ఫోర్జరీతో అరెస్టు వారంట్!

## డిజిటల్ అరెస్టు పేరుతో ఎల్ఐసి మాజీ అధికారికి రూ.99 లక్షలు టోకరా

**న్యూఢిల్లీ, నవంబరు 12:** సైబర్ నేరస్థులు రోజురోజుకూ తెలివిమీరిపోతున్నారు. సరికొత్త ఎత్తులతో ఉన్నత విద్యావంతులనూ మోసం చేస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో మరో కొత్త వ్యూహంతో మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా పుణేకు చెందిన ఓ వృద్ధురాలిని డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.99 లక్షలు కాజేశారు. ఇందుకోసం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ అరెస్ట్ వారెంట్ ను సృష్టించారు. దీంతో ఉన్నతవిద్యావంతురాలు, ఎల్ఐసీ మాజీ ఉన్నతాధికారి అయిన ఆ వృద్ధురాలు నమ్మి మోసపోయారు. పుణే పోలీసులు వివరాల ప్రకారం పుణేకు చెందిన 62 ఏళ్ల మహిళ ఎల్ఐసీలో ఉన్నతోద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. ఇటీవల ఆమెకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఆమె ఆధార్ కార్డ్ తో లింక్ అయిన ఓ ఫోన్ నెంబర్ తో దుండగులు ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని అవతలి వ్యక్తి బెదిరింపులకు గురిచేశాడు. ఈ విషయంపై సీనియర్ ఆఫీసర్ వీడియో కాల్ లో మాట్లాడతారంటూ ఫోన్ పెట్టేశాడు. కాసేపటి తర్వాత సీనియర్ పోలీస్ ఆఫీసర్ జార్జ్ మాథ్యూ పేరుతో మరో దుండగుడు వాట్సాప్ వీడియో కాల్ చేశాడు. ఆమె ఆధార్ కార్డ్ తో లింక్ అయిన ఫోన్ నెంబర్ తో ఆర్థిక మోసాలు జరిగాయని, ఈ కారణంగా మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని చెప్పాడు. ఇందుకు సంబంధించి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సంతకంతో జారీ అయిన ఓ నకిలీ అరెస్ట్ వారెంట్ ను వాట్సాప్ చేశాడు. మనీలాండరింగ్ కేసు కావడంతో దర్యాప్తు కోసం బ్యాంకులో ఉన్న నగదు మొత్తం తాము సూచించిన ఖాతాకు బదిలీ చేయాలని, ఆర్బీఐ తనిఖీ తర్వాత ఆ మొత్తం తిరిగి ఆమె ఖాతాలో జమ అవుతుందని నమ్మబలికాడు. నిధులు బదిలీ చేయకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తుందని బెదిరించడంతో భయాందోళనకు గురైన బాధితురాలు దుండగుడు చెప్పిన బ్యాంకు ఖాతాలకు రూ.99 లక్షలు బదిలీ చేసింది. ఆ తర్వాత దుండగుడికి ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించింది. పుణే సైబర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# రూ.58 కోట్ల డిజిటల్ అరెస్టు స్కామ్‌లో విదేశీ నెట్‌వర్క్!



**ముంబయి, నవంబరు 12:** ముంబయిలో సంచలనం రేపిన రూ.58 కోట్ల డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లో అంతర్జాతీయ సంబంధాలున్నట్టు మహారాష్ట్ర సైబర్ పోలీసులు గుర్తించారు. హాంకాంగ్, చైనా, ఇండోనేషియాలో లావాదేవీలు జరిగినట్టు కనుగొన్నారు. ముంబయికి చెందిన 72 ఏళ్ల వ్యాపారవేత్తను సైబర్ కేటుగాళ్లు ఈడీ, సీబీఐ అధికారులమని డిజిటల్ అరెస్ట్ పేరుతో బోల్తా కొట్టించి కోట్లు కాజేశారు. ఓ నేరంలో నిందితుడిగా ఉన్నారని, విచారణకు సహకరించాలని డిమాండ్ చేస్తూ ఆయన బ్యాంకు ఖాతాలో నగదును ఊడ్చేశారు. ఆయనను గంటలకొద్దీ వీడియో కాల్‌లో ఉంచి, బెదిరించి, మానసికంగా ప్రభావితం చేస్తూ డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. కాల్ ముగిసే సరికి, అతడి ఖాతా నుంచి రూ.58 కోట్లు బదిలీ చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన మహారాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు... ఆయన వద్ద కాజేసిన మొత్తాన్ని క్రిప్టోకరెన్సీ లావాదేవీలతో దేశం వెలుపలి ఖాతాలకు బదిలీ చేశారని దర్యాప్తులో గుర్తించారు. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం ఈ వ్యవహారంలో ఒక్కరు కాదు గత ఏడాది నుంచీ దేశవ్యాప్తంగా ప్రజలను మోసం చేస్తున్న ఒక అంతర్జాతీయ సైబర్ మోసగాళ్ల సిండికేట్‌లో భాగం. ఈ కేసు దాదాపు రూ.2,000 కోట్లు విలువైన భారీ ఆన్‌లైన్ మోసాలతో ముడిపడి ఉన్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు.

ఈ మొత్తం వ్యవహారాన్ని కమిషన్ కోసం బ్యాంకు ఖాతాలు నడిపిన ఒక గ్యాంగ్ నిర్వహించింది. సాధారణంగా తమ సహచరుల నియంత్రణలో ఉండే అకౌంట్‌లను నగదు సేకరణ కేంద్రాలుగా ఉపయోగించినట్టు పేర్కొన్నారు. ప్రతి డిజిటల్ అరెస్ట్ కేసులో బాధితుడ్ని ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరేవారు. తొలుత అది భారతీయ బ్యాంకు ఖాతాలకు చేరి, వెంటనే క్రిప్టోకరెన్సీగా మార్చి విదేశీ వాలెట్లకు తరలించేవారు. దీంతో మోసగాళ్ల డబ్బును దేశం బయటకు తక్షణమే తరలించే అవకాశం కలిగింది.

ఈ నెట్‌వర్క్ దాదాపు ఏడాది నుంచి చురుకుగా పనిచేస్తోంది. ప్రతి లావాదేవీ అనంతరం క్రిప్టోను అనేక వాలెట్లకు తరలించడం వల్ల డబ్బు జాడను తెలుసుకోవడం చాలా కష్టంగా మారుతున్నదని అధికారులు తెలిపారు. దర్యాప్తులో ఇప్పటివరకు బయటపడిన ఐపి అడ్రస్‌లు, ఎక్స్ఛేంజ్ వివరాలలో చాలా వరకు చైనా, హాంకాంగ్, ఇండోనేషియాతో సంబంధమున్నట్లు తేలింది. ఈ కేసులో పలు బ్యాంకు ఖాతాలు, డిజిటల్ వాలెట్లను సైబర్ పోలీసులు గుర్తించారు.

# సంక్షిప్తంగా..

## కుప్పకూలిన టర్కీ విమానం - 20 మంది దుర్మరణం




**అంకారా, నవంబరు 12:** అజర్‌బైజాన్ నుంచి స్వదేశానికి తిరిగి వస్తున్న టర్కీకు చెందిన సైనిక కార్గో విమానం మంగళవారం అర్ధ రాత్రి తూర్పు జార్జియాలో కుప్పకూలంది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న సిబ్బంది సహా 20 మంది మరణించినట్లు టర్కీ రక్షణ మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. టర్కీ రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, "అజర్‌బైజాన్ నుంచి బయలుదేరిన సీ130 సైనిక కార్గో విమానం జార్జియా- అజర్‌బైజాన్ సరిహద్దు సమీపంలో కూలిపోయింది. విమాన సిబ్బందితో కలిపి మొత్తం 20 మంది ఈ విమానంలో ఉన్నారు" అని తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం గాల్లోనే గింగిరాలు కొడుతూ వేగంగా నేల వైపు దూసుకొచ్చి, భూమిని ఢీకొట్టగానే మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు అజర్‌బైజాన్ మీడియాలో ప్రసారమయ్యాయి.

## సరిహద్దులకు 10 కి.మీ.పరిధిలో ఉండొద్దు:యుకె ట్రావెల్ అడ్వైజరీ



**న్యూఢిల్లీ, నవంబర్ 12:** ఢిల్లీలో పేలుడుతో దేశ ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఈ నేపథ్యంలో పలు దేశాలు ట్రావెల్ అడ్వైజరీలు జారీ చేస్తున్నాయి. భారత్, పాకిస్థాన్ సరిహద్దుకు 10 కిలోమీటర్ల పరిధిలో ఉండవద్దని యుకె తన పౌరులను హెచ్చరించింది. అలాగే జమ్ముకశ్మీర్‌లో కొన్ని ప్రాంతాల్లో పర్యటించవద్దని సూచించింది. అక్కడ ప్రముఖ ప్రాంతాలైన శ్రీనగర్, పహల్గామ్, గుల్‌మార్గ్, సోన్‌మార్గ్‌లో పర్యటించేటప్పుడు స్థానిక అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని అప్రమత్తం చేసింది. జమ్మూ నుంచి మాత్రం విమానంలో రాకపోకలు చేయొచ్చని పేర్కొంది. అటారీ - వాఘా సరిహద్దు మూసివేసి ఉందని, అక్కడికి వెళ్లవద్దని సూచించింది. ఈ అడ్వైజరీకి విరుద్ధంగా వ్యవహరిస్తే ట్రావెల్ ఇన్సూరెన్స్ కూడా పనిచేయకపోవచ్చని హెచ్చరించింది.

## ఆసుపత్రి నుంచి ధర్మేంద్ర డిశ్చార్జి.. ఇంటివద్దనే చికిత్స



**ముంబయి, నవంబరు 12:** బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర (89) ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కారణంగా గత నెల 31న ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆయన, బుధవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ఆయనకు ఇంట్లోనే చికిత్స కొనసాగుతుందని వైద్యులు తెలిపారు. బుధవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో ధర్మేంద్రను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు ఆయనకు చికిత్స అందించిన డాక్టర్ ప్రతిత్ సందానీ వెల్లడించారు. కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు ఆయనకు ఇంట్లోనే వైద్య సేవలు కొనసాగిస్తామని వివరించారు. ఇదిలా ఉండగా, నిన్న ధర్మేంద్ర మరణించారంటూ పలు వెబ్ సైట్లలో తప్పుడు వార్తలు ప్రచారమయ్యాయి. ఈ వదంతులపై ఆయన కుటుంబ సభ్యులు తీవ్రంగా స్పందించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని స్పష్టం చేశారు.

## జిపిఎస్ స్పూఫింగ్‌పై డిజిసిఎ తక్షణ ఆదేశాలు

**న్యూఢిల్లీ,నవంబరు 12:** విమానయాన రంగంలో జీపీఎస్ స్పూఫింగ్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అప్రమత్తమైంది. జీపీఎస్‌కు సంబంధించి ఏదైనా అసాధారణ సమస్య తలెత్తితే, సంబంధిత విభాగానికి కేవలం 10 నిమిషాల్లోగా తెలియజేయాలని విమానయాన సంస్థలు, పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు (ఏటీసీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో (ఐజీఐఏ) ఇటీవల జీపీఎస్ స్పూఫింగ్ కారణంగా రెండు రోజుల పాటు వందలాది విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీజీసీఏ ఈ కఠిన చర్యలకు ఉపక్రమించింది.

## ప్రధాని మోడీ డిగ్రీ వివాదం - ఢిల్లీ వర్సిటీకి 3 వారాలు గడువిచ్చిన హైకోర్టు

**న్యూఢిల్లీ, నవంబరు 12:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ డిగ్రీ వివాదానికి సంబంధించి వివరాలు అందజేయడానికి ఇంకెంత కాలం కావాలంటూ ఢిల్లీ యూనివర్శిటీ తీరుపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తక్షణమే ప్రధాని మోడీ డిగ్రీ వివరాలను వెల్లడించే అంశంలో ఫైలింగ్ అయిన అభ్యర్థనలకు స్పందించాలని హైకోర్టు పేర్కొన్నది. అయితే ఈ కేసులో తన అభ్యంతరాలను దాఖలు చేసేందుకు ఢిల్లీ యూనివర్సిటీకి మూడు వారాల సమయాన్ని ఇచ్చింది. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ దేవేందర్ కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావులతో కూడిన ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# జిల్లా గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన జెసి

ఏలూరు ప్రభాత వార్త : జిల్లా గ్రంథాలయాల సంస్థ భవనాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. అభిషేక్ గౌడ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయ భవన%శి%శిథిలావస్థ లో ఉన్నదని తెలిసి పరిస్థితులను అధ్యయనం చేసి త్వరలో గ్రంథాలయ నిర్వహణకు అనుకూలమైన వసతి అంశాన్ని జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. . అలాగే స్థానిక సంస్థల నుండి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న గ్రంథాలయ సెస్ కూడా జమ అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి, వివిధ కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థిని విద్యార్థులను కలిసి కొంతసేపు సంభాషించారు. ఈ సందర్భంగా వారు గ్రంథాలయ సేవలను విస్తృత పరచే విషయంలో విద్యార్థిని, విద్యార్థులకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎమ్. శేఖర్ బాబు , సిబ్బంది



ఎల్.వెంకటేశ్వరరావు కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మానవత్వం మరిస్తే ఇంటికే...

- వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించే వైద్యులు, సిబ్బంది ని సస్పెండ్ చేస్తా
- వైద్య సేవల్లో అలసత్వం వద్దు, ప్రసూతి, లేబర్ వార్డులలో సిసి కెమెరాలతో పటిష్ట నిఘా
- నూజివీడు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి
- వైద్యులు, సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోకపోతే కఠిన చర్యలు తప్పవు - కలెక్టర్ హెచ్చరిక





నూజివీడు/ఏలూరు, ప్రభాతవార్త: నిరుపేదల వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించే వైద్యులు, వైద్య సిబ్బందిని సస్పెండ్ చేస్తానని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రతీ వార్డు, ప్రతీ వైద్య విభాగం ను పరిశీలించి, రోగులను ఆసుపత్రిలో సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓ. పి . విభాగంలో రోగులకు సక్రమంగా వైద్య సేవలందించక పోవడం, ఆసుపత్రిలో అపారిశుధ్యం, సిసి కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడం, రోగుల రద్దీని నియంత్రించకపోవడం, ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది నిర్లక్ష్యం వంటి వాటిని పరిశీలించి ఆసుపత్రిలో సేవలు పర్యవేక్షించే వైద్యాధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ప్రభుత్వ ఆశయాల మేరకు వైద్య సిబ్బంది పనిచేయాలని, సుదూర ప్రాంతాల నుండి వచ్చే రోగులకు స్వాంతన చేకూరే విధంగా వైద్యులు చికిత్స అందించాలని, రోగులు ఎక్కువ సమయం వేచిఉండకుండా త్వరితగతిన చికిత్స అందించాలన్నారు. రోగులపట్ల సేవాలోపం, విధుల పట్ల నిర్లక్ష్య ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తాను ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తానని, ఎక్కడైనా వైద్య సిబ్బంది సేవాలోపం గుర్తిస్తే వెంటనే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానన్నారు. ప్రసూతి, లేబర్ వార్డులలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఆసుపత్రిలో గడువు తీరిన మందులను, బయో మెడికల్ వేస్ట్ ను నిర్దేశించిన ప్రమాణాలలో నిర్మూలించాలన్నారు. ఆసుపత్రిలోని, పరిసరాలలో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత లేకపోవడం, ఓ. పి . నమోదు, ఎక్స్ రే, స్కానింగ్ విభాగాల వద్ద సరైన నియంత్రణ లేకపోవడం, వార్డులలో పరిశుభ్రత లేకపోవడం, వాహనాల పార్కింగ్ సక్రమంగా నిర్వహించకపోవడం, తదితర అంశాలపై ఆసుపత్రి నిర్వహణలో సరైన పర్యవేక్షణ లేకపోవడం, విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆసుపత్రి ఆర్. ఎం . ఓ ల నుండి వివరణలు తీసుకోవాలని కలెక్టర్ డిసిహెచ్ ఎస్ ని ఆదేశించారు.


**స్టోర్స్ లో వైద్య పరికరాలు, బెడ్స్ నిరుపయోగంగా ఉండడంపై డిసిహెచ్ఎస్ పై కలెక్టర్ ఆగ్రహం**

రోగులకు అత్యున్నత వైద్య సేవలందించాలని ఆధునిక వైద్య పరికరాలు, ఆధునిక బెడ్స్ ను ఆసుపత్రికి ప్రభుత్వం సమకూరిస్తే వాటిని వినియోగించకుండా స్టోర్స్ లో నిరుపయోగంగా ఉంచడంపై కలెక్టర్ వెట్రిసెల్వి డిసిహెచ్ ఎస్ డా. పాల్ సతీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మజ లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిని మళ్ళీ తనిఖీ చేస్తానని అప్పటికీ వైద్య సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిసిహెచ్ ఎస్ డా పాల్ సతీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పద్మజారాణి, ఆర్.ఎం. ఓ. డా. శ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబెర్ కామేష్, తహసీల్దార్, ప్రభృతులు పాల్గొన్నారు



# ఆస్థి కోసం కూతురినే చంపేశారు

- మూడేళ్ల తర్వాత వెలుగులోకి ఘటన
- బీటెక్ విద్యార్థి సజీవ దహనం కేసులో కీలక మలుపు
- అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు అప్పట్లో కేసు నమోదు
- ఫోరెన్సిక్ రిపోర్టులో విస్తు గొలిపే వాస్తవాలు
- కేసును నిర్వీర్యం చేయడానికి ప్రముఖుల యత్నం
- తండ్రితోపాటు సవతి తల్లి అరెస్టు, రిమాండ్







తణుకు, నవంబర్ 12 ( ప్రభాత వార్త ): ఆస్తి కోసం కన్న కూతురునే చంపేసిన ఘటన మూడేళ్ల అనంతరం వెలుగు చూసింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా చనిపోయినట్లు గతంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే తాజాగా వచ్చిన ఫోరెన్సిక్ రిపోర్ట్లో విస్తు గొలిపే వాస్తవాలు వెలుగు చూడటంతో పోలీసులను సైతం విస్మయానికి గురి చేశాయి. తణుకు మండలం ముద్దాపురం గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన సంచలనంగా మారింది. గ్రామానికి చెందిన ముళ్ళపూడి నాగ హారిక (19) తాడేపల్లిగూడెం ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. 2022 నవంబరు 12వ తేదీన ఉదయం లేచి చూసేసరికి హారిక తన పడక గదిలో మంచంపై సజీవ దహనమై ఉంది. అయితే సెల్ఫోన్ చార్జర్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి ఆమె మృతి చెందినట్లుగా తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో తణుకు రూరల్ ఎస్సై రాజకుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే హారిక ఉద్దేశపూర్వకంగానే హత్య చేశారంటూ అప్పట్లో మేనమామ, అమ్మమ్మ ఆరోపించారు. తణుకు మండలం

7వ పేజీలో

# నేడు కల్వరి టెంపుల్ ప్రారంభం

## డాక్టర్ సతీష్ కుమార్ రాక



తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త: కల్వరి టెంపుల్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నెల రోజులు పైగా వందలాదిమంది కార్మికులు ఇక్కడ పని చేసి ఈ మందిరాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం పూర్తి కావడంతో ఈనెల 13వ తేదీ ప్రారంభించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి నేషనల్ హైవే ఆటోనగర్ పక్కన నిర్మించిన ఈ మందిరాన్ని గురువారం సాయంత్రం 6 గంటలకు మందిరాన్ని డాక్టర్ సతీష్ కుమార్ ప్రారంభిస్తారు. ఈయనతో పాటు స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పలువురు ప్రజా ప్రతినిధులు, పాస్టర్లు తాడేపల్లిగూడెం పరిసర గ్రామాల్లోని ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# ఐదేళ్లలో జగన్ మోహన్ రెడ్డి విధ్వంసకర పాలన

- ఆరు నెలల్లో టిడ్కో ఇల్లు పూర్తి చేసి అందించేందుకు చర్యలు

-111 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు, నవంబర్ 12 (ప్రభాత వార్త): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి విధ్వంసకర పాలన చేశారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కనీసం ఎక్కడా అభివృద్ధి లేకుండా భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. సంక్షేమాన్ని సైతం ఆరకొరగా అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. బుధవారం తణుకు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఏ ఆశయంతో కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి రాష్ట్ర ప్రజలు తీసుకువచ్చారో అదే ఆశయానికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారధ్యంలో అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్న ఘనత కూటమీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో నిత్యావసర వస్తువులను ధరలను పెంచకపోగా జీఎస్టీ తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజల కుటుంబాల్లో ఏడాదికి రూ. 15 వేలు ఆదా అవుతుందని అంచనా వేయడం జరిగిందని చెప్పారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోగా పెట్టుబడులు ఏమీ లేక ఉద్యోగాలు సైతం ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని 7 లక్షల ఉద్యోగాల కల్పన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. భవిష్యత్తు తరాలకు ఉద్యోగాలకు ఇబ్బందులేకుండా కూటమి ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. రాబోయే ఆరు నెలల్లో టిడ్కో ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసే బాధ్యత కూటమి ప్రభుత్వం



తీసుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా 111 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలం ఉండి రూ. 2.50 లక్షలతో ఇల్లు కట్టుకునేందుకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి రామ్కుమార్ తణుకు ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిరంజీవి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు

మొగల్తూరునవంబర్ 12 ( ప్రభాతవార్త):చిరంజీవి గ్రంథాలయము నందు నవంబర్ 14 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ పాలకులు బత్తుల హనుమంతరావు ఒక ప్రకటనలో బుధవారం విలేకరులకు తెలిపారు. 14వ తేదీ శుక్రవారం బాలల దినోత్సవం మరియు పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదినోత్సవం పురస్కరించుకుని ఉదయం తొమ్మిది గంటలకు జ్యోతి ప్రజ్వలన, మరియు వారోత్సవాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

# దివ్యాంగులతో మమేకమై మాటామంతితో

## ఉత్సాహపరిచిన జిల్లా కలెక్టర్ నాగరాణి



భీమవరం నవంబర్ 12ప్రభాతవార్త : ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులను ఎంతో ఓర్పుతో సాకాల్సి ఉంటుందని, మీ ఇబ్బందులకు ఎల్లప్పుడూ ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని, ధైర్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం పట్టణంలోని గాలి రామయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత విలీన విద్య వనరుల కేంద్రం ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యంగా బాల బాలికల ఉచిత ఉపకరణాల పంపిణీ వైద్య నిర్ధారణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ బాల బాలికలను చాలా శ్రద్ధగా, ఓర్పుతో చూడవలసిన అవసరం ఉందని, దీనికి వారి తల్లిదండ్రులు పడే ఆవేదన ఏమిటో నేను అర్థం చేసుకోగలనన్నారు. ఇటువంటి పిల్లలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం భవిత విలీన విద్యా వనరుల కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి విద్యను, ఫిజియోథెరపీ తదితర సేవలను అందించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా వారికి ప్రత్యేక ఉపకారణాలను అందజేసే నిమిత్తం ఎవరికి ఏ ఉపకారణాలు అందజేయాలో అనే పరీక్షలను దివ్యాంగుల వైద్య నిర్ధారణ శిబిరం ద్వారా గుర్తించి ఉపకరణాలను కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు.



# పెనుగొండలో పండగ వాతావరణం

## మూడు లక్షల ఇళ్లు నిర్మించి పేదలకు అందజేసిన కూటమి ప్రభుత్వం

పెనుగొండ, నవంబర్ 12 (ప్రభాతవార్త): పేద ప్రజల కలల ఇళ్లను సాకారం చేయడంలో కూటమి ప్రభుత్వం చారిత్రాత్మకమైన అడుగులు వేస్తోందని యువ నాయకులు వెంకట్ పేర్కొన్నారు. “2029 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి స్వంత ఇల్లు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం” అని ఆయన అన్నారు. జూన్ 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తరువాత పదిహేడునెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3,00,192 ఇళ్లు నిర్మించి పేదలకు అందజేయడం ప్రభుత్వం యొక్క సంకల్పబలానికి నిదర్శనమని వెంకట్ వివరించారు.ప్రతి పేద కుటుంబం తలదాచుకునే సొంత ఇల్లు కలిగి గౌరవప్రదమైన జీవితం గడపడం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామంలోని కోడిపందాల దిబ్బ, నగరేశ్వరస్వామి కాలనీలలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (మొదటి దశ) కార్యక్రమం కింద నిర్మించిన ఇళ్ల గృహప్రవేశ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ప్రధాన అతిథిగా పాల్గొన్న యువ నాయకులు వెంకట్, లబ్ధిదారుల ఇళ్లలో ప్రవేశం చేసి వారిని అభినందించారు.పేద కుటుంబాలు సొంత ఇళ్లు పొందడం తమ జీవితంలో మరచిపోలేని ఆనంద క్షణమని లబ్ధిదారులు తెలిపారు.ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి గ్రామంలో గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేస్తోంది. ఇళ్లతో పాటు నీటి, విద్యుత్, రహదారి, మురుగు కాలువ వంటి ప్రాథమిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నాం” అని చెప్పారు.ప్రతి కుటుంబం గృహ యజమానిగా మారి సమాజంలో గౌరవంగా జీవించే రోజులు దూరంలో లేవని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్క శ్యామలా సోనీ, నియోజకవర్గ పరిశీలకుడు రుద్రరాజు వెంకట్రామరాజు, మండల రెవెన్యూ అధికారి జి. అనిత కుమారి, మండల అభివృద్ధి అధికారి డి. సూర్యనారాయణమూర్తి, హౌసింగ్ సహాయ ఇంజనీరు జి. లక్ష్మణ్తో పాటు ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు భారీగా హాజరయ్యారు.ఇళ్ల నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన వెంకట్, లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పేదల ఆశల ఇళ్ల నిర్మాణంలో అధికారులు మరింత వేగం చూపాలని ఆయన సూచించారు. పెనుగొండలో జరిగిన ఈ గృహప్రవేశ మహోత్సవాలు పండుగ వాతావరణంలో నిర్వహించబడ్డాయి.




# పేకాట శిబిరం పై దాడి - అదుపులోకి 11 మంది

చాట్రాయి, నవంబర్ 12, ప్రభాతవార్త : చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామంలో పేకాట శిబిరం పై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద 31,300లు నగదు తో పాటు 8 మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ చెప్పారు. పోలీసులకు రాబడిన సమాచారం మేరకు స్టేషన్ సిబ్బంది చిత్తపూరు గ్రామము శివారులో పేకాట శిబిరం పై దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పదకొండు మందిని అదుపులోనికి తీసుకుని చాట్రాయి పోలీస్ స్టేషన్లో కేసును నమోదు చేసినట్లుగా ఎస్ఐ తెలియ చేశారు.ఈ సందర్భంగా ఎస్.ఐ రామకృష్ణ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులను కలగజేసే జూద క్రీడలను ఎవరైనా ప్రోత్సహిస్తే లేదా పాల్గొన్న అట్టి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జూదం ఏ రూపంలో ఉన్న ఉపేక్షించమని ప్రజలు వారి యొక్క ఆర్థిక ఇబ్బందులు కలిగించే జూద క్రీడల యొక్క సమాచారాన్ని పోలీసు వారికి తెలియ చేయాలి అని, సమాచారం అందించినటువంటి వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వైసీపీ నిరసన**


# నరసాపురం లో భారీ ర్యాలీ



నరసాపురం ప్రభాతవార్త : పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గం పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ, పశ్చిమగోదావరి జిల్లా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముదునూరి ప్రసాద రాజు ఆధ్వర్యంలో నరసాపురం నియోజకవర్గంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పార్లమెంట్ ఇంచార్జ్ గూడూరి ఉమాబాల , పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, అభిమానులు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం అందజేశారు. పేద విద్యార్థులకు అందుబాటులో ఉండేలా జగన్ ప్రభుత్వం మెడికల్ కళాశాలలు మంజూరు చేస్తే చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కళాశాలలను వ్యాపార దృక్పథంతో చూస్తోందని ముదునూరి ప్రసారాజు విమర్శించారు.

# స్పోర్ట్స్ మేట్ లో సత్తా చాటిన హీల్ విద్యార్థులు.

ఆగిరిపల్లి నవంబర్ 12 ప్రభాతవార్త : విజయవాడ సిద్దార్థ స్కూల్లో జరిగిన ఇంటర్ స్కూల్ ఇన్విటేషన్ స్పోర్ట్స్ మేట్ లో మండలం లోని తోటపల్లి హీల్ స్కూల్ విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో పలు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ యలమంచిలి లతా చౌదరి తెలిపారు. వంద మీటర్ల పరుగు పందెంలో వి హేమంత్ కుమార్ మొదటి స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో జి.సంజన, టి.కిరణ్ కుమార్ లు మొదటి స్థానం సాధించగా, 400 మీటర్ల పరుగు పందెంలో కె.శ్రావణ్ మొదటి స్థానం, లాంగ్ జంప్ లో బ్లెస్సిచందన మొదటి స్థానం సాధించారని, 800 మీటర్ల పరుగు పందెం లో బి.పవన్ కుమార్, జి.సంజన మొదటి స్థానం సాధించారని తెలిపారు. జావలిన్ త్రో లో కె.బన్ను రెండవ స్థానం సాధించగా, 800 మీటర్ల పరుగు పందెంలో దీవెనకుమార్ మూడో స్థానం సాధించగా షాట్ పుట్ లో షేక్.సుభాని మూడో స్థానం, డిస్కస్ త్రో లో సాయి దీక్షిత్ మూడో స్థానం, లాంగ్ జంప్ లో హేమంత్ కుమార్ మూడో స్థానం సాధించారని తెలిపారు. ఈ



సందర్భముగా బుధవారంజరిగిన కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.సత్య ప్రసాద్, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎం.హరీష్, పిఈటిలు నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, జెట్లీ, మహిత మరియు టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులను అభినందించారు

# లంకలకోడేరు లో గృహప్రవేశాలు......

పాలకొల్లు నవంబర్ 12, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం లో గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు మండలం లంకలకోడేరు పెద్దపేటలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో గోగులమండ రత్నం రాజు గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో అసంపూర్తిగా నిలిచిపోయిన పేద వర్గాల గృహాలకు సంబంధించి ఎస్టీలకు 75వేలు, ఎస్సీ బీసీలకు 50,వేలు చొప్పున మంత్రి రామానాయుడు కృషి వలన మంజూరు కావడంతో నేడు పూర్తి చేసుకోగలిగారన్నారు. మండలంలో 152 మంది లబ్ధి పొందారు అన్నారు. సభకు సర్పంచ్ చొప్పల రజిని అధ్యక్షత వహించారు. నాయకులు ఉన్నమట్ల కబర్ధి, ఏం సి చైర్మన్ కోడి విజయ భాస్కర్, దాసరి రత్నం రాజు ,పాములు రజిని కుమార్, మామిడి



శెట్టి పెద్దిరాజు, గండేటి వెంకటేశ్వరరావు పెనుమత్స సత్యనారాయణ రాజు, మామిడి శెట్టి పెద్దిరాజు, కడలి గోపి, యర్రంశెట్టి పద్మారావు నెక్కంటి దుర్గారావు, ఇబ్బా నాగార్జున, గోడి నాని, తాలూరి విజయలక్ష్మి, కుడకా కోటేశ్వరరావు అందే కోటేశ్వరరావు, తుల రామలింగేశ్వరరావు, బిట్ట లక్ష్మీనారాయణ,వాసా మహేష్ తదితరులు పాల్గొన్నారు


## జిల్లాలో పిఎంఏవై 1.0 కింద 6,600 గృహ నిర్మాణాలు పూర్తి

భీమవరం (ఆకివీడు) నవంబర్ 12 ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇంటి కల సాకారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అర్హులైన లబ్ధిదారులు పిఎంఏవై 2.0 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా నూతన గృహప్రవేశాలను రాష్ట్ర ముఖ్యమంత్రిచే నిర్వహించిన సందర్భంగా, ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ఉండి నియోజకవర్గం ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామం తాళ్లకోడు లేఔట్ లో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని, నూతన గృహప్రవేశాల లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు ఇల్లు లేని పేద వారికి ఇల్లు మంజూరు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నదన్నారు. గృహ నిర్మాణాల కొరకు నవంబర్ 30 వరకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని, అర్హులైన లబ్ధిదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో పిఎంఏవై 1.0 కింద ఇప్పటి వరకు పూర్తి అయిన 6,600 గృహాలకు గృహ ప్రవేశ కార్యక్రమం పూర్తి చేసుకోవడం జరిగిందని, నేడు 100 ఇళ్ల గృహప్రవేశాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇంకా ఇల్లు లేని వారిని పి ఎం ఏ వై 2.0 ద్వారా గుర్తించి 595 గృహాలు మంజూరు ఉత్తర్వులు అందజేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో హౌసింగ్ శాఖ ద్వారా ఇల్లు లేని అర్హులను గుర్తించి దరఖాస్తులు చేయించే కార్యక్రమం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని పేదవారికి ఇల్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపుతున్నాయన్నారు. ఇళ్ల మంజూరు కొరకు గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా నవంబర్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేయడం ద్వారా వారికి వారసత్వ ఆస్తి ఏర్పడుతుందని, తద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## దాతృత్వానికి మారుపేరు మూర్తిరాజు

భీమవరం నవంబర్ 12 ప్రభాతవార్త: అలుపెరగని విద్యా దాత గాంధేయవాది మాజీ మంత్రి, సర్వోదయ నాయకులు చింతలపాటి సీతారామ చంద్ర వరప్రసాద్ మూర్తిరాజు అని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విద్యాదాత గాంధేయవాది మూర్తిరాజు వర్ధంతి కార్యక్రమాన్ని అడ్డ వంతెన దగ్గర ఆయన విగ్రహం వద్ద జిల్లా సర్వోదయ మండలి సంయుక్త అధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ దేశ భక్తుల పేరిట విద్యాలయాలు స్థాపించి గాంధీజీ ఆశయాలతో జీవించారని, సమాజ సేవకే జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి మూర్తి రాజు అని అన్నారు. నిస్వార్థ భావాలతో 63 విద్యాలయాలను స్థాపించి దేశ నాయకుల పేర్లను ఆ విద్యాలయాలకు పెట్టి మూర్తి రాజు జాతీయతను చాటి చెప్పుకున్నారన్నారు. వృద్ధాశ్రమలకు కుష్టు వ్యాధి కాలనీలకు స్థలాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. మూర్తిరాజు గాంధేయం నవ భారత నిర్మాణానికి సోపానమని, ఆయన విద్యాలయాల్లో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారన్నారు. జిల్లా సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాద రాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మూర్తిరాజు విద్యా సేవలు అద్వితీయమని, ఆయన మార్గాన్ని అనుసరించాలని, దాతృత్వానికి మారుపేరు మూర్తిరాజు అని, ఆయన స్థాపించిన విద్యాలయాల్లో భీమవరంలో కూడా రెండు కళాశాలలు, మూడు హైస్కూల్లు ఉన్నాయని, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కంతేటీ వెంకటరాజు, అల్లూరి సాయి దుర్గరాజు, ఎం ఝాన్సీ, అల్లు శ్రీనివాస్, ఇందుకూరి శివాజీ వర్మ, కలిదిండి గోపాల కృష్ణంరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్య రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా షిరిడి సాయిబాబా ఊరేగింపు ఉత్సవం



.అత్తిలి -నవంబర్ 11 (ప్రభాత వార్త ):అత్తిలి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షిరిడి సాయిబాబా వారి ఉత్సవాలు సందర్భంగా ఊరేగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి వివిధ బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపు ఉత్సవాన్ని కనుల పండుగ నిర్వహించారు. సామర్లకోటకు చెందిన మహేశ్వరి మ్యూజికల్ పార్టీ ఆర్కెస్ట్రా వారు, నరసాపురం కు చెందిన ఆదినారాయణ మొబైల్ బ్యాండ్ పార్టీ వారు తాసాయి మేళాలు,అత్తిలి బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపు ఉత్సవాన్ని నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్, కేవస్ గట్టుకు చెందిన టిడిపి నాయకుడు మెంతు రాజకుమార్ ఉత్సవానికి అవసరమైన సహకారాన్ని అందించారు.

## సొంత చిరునామా సంతృప్తి ఎనలేనిది



ప్రభాతవార్త నరసాపురం రూరల్ : నరసాపురం శాసనసభ సభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ బుధవారం నరసాపురం నియోజకవర్గంలోని మంగళగుంటపాలెం లో జరిగిన "ప్రతి కుటుంబానికి సొంత చిరునామా" సామూహిక గృహ ప్రవేశ మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ ప్రజలకు ఇచ్చిన ప్రధాన వాగ్దానాలలో ఒకటైన ప్రతి కుటుంబానికి సొంత చిరునామా కార్యక్రమం క్రింద రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 3,00,192 ఇళ్ల సామూహిక గృహ ప్రవేశోత్సవం పేదల కలల సాకారం అని అన్నారు.కూటమి ప్రభుత్వ ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 17 నెలల్లో పేదలకు ఇళ్ళు నిర్మించి ఇచ్చే లక్ష్యంలో భాగంగా ఈ 3,00,192 ఇళ్లను పూర్తి చేసింది.ఇది పేదల సొంతింటి కలను నిజం చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ ఇళ్లలో (పీఎంఏవై-బీఎల్‌సీ) కింద పూర్తయినవి: 2,28,034 ఇళ్ళు (గ్రామీణ పథకం (పీఎంఏవై గ్రామీణ్) కింద పూర్తయినవి 65,292 ఇళ్ళు, జన్మన్ పథకం (పీఎంఏవై జన్మన్) కింద పూర్తయినవి 6,866 ఇళ్ళు ),ఇళ్ల నిర్మాణంలో నాణ్యత, పారదర్శకత కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని, ప్రతి లబ్ధిదారునికి దాదాపు 20 టన్నుల ఇసుకను ఉచితంగా అందించడం ద్వారా ఇంటి నిర్మాణ వ్యయాన్ని తగ్గించిందని తెలిపారు.భవిష్యత్తు ప్రణాళిక ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతిల్లు కల్పించాలనే లక్ష్యంతో, 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత గృహాన్ని అందించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పేర్కొన్నారు.పేదల అభ్యున్నతే మా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ప్రతి కుటుంబం సంతోషంగా , సురక్షితంగా జీవించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది, అని బొమ్మిడి నాయకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య,జిల్లా డెల్టా వైస్ చైర్మన్ గుబ్బల మరాజు, జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, మండల అధ్యక్షులు ఆకన చంద్రశేఖర్, వలవల నాని, వాతాడి కనకరాజు, నిప్పులేటి తారకరామారావు, దేశనీడి గంగాధర్, నల్లూరి సూర్యనారాయణ, అడ్డాల శ్రీనివాసరావు, శ్రీరాం గణేష్, వాసు, ఇంటి మురళి, కొల్లు జయరాజు, వెన్న నరేష్, మైల రాజు, గన్నాబత్తుల దుర్గాప్రసాద్, పెమ్మాడి సుధాకర్, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు, జనసేన టిడిపి బిజెపి నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు

## సొంతింటి కల నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
### శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త: పేదవారి సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం ఉపయోగపడుతుందని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన పెంటపాడు మండలం చింతపల్లి గ్రామంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. 25 లక్షల రూపాయలు వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం చే లబ్ధి పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను మరికొంతమందికి అందే విధంగా కూటమి ప్రభుత్వ పనితీరును తెలియచెప్పాలని ఆయన కోరారు. ప్రభుత్వ చేసిన సహాయాన్ని పది మందికి తెలియచెప్పాలని, తద్వారా మరికొందరికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చాపల రమేష్,, పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, మద్దాల మణికుమార్ పాల్గొన్నారు.

## సేంద్రియ పద్ధతులపై రైతుల ఉత్సాహం

పెనుగొండ నవంబర్ 12 ప్రభాత వార్త : పెనుగొండ మండలంలోని నడిపూడి మరియు దొంగరావిపాలెం గ్రామాలలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం రైతులలో సేంద్రియ వ్యవసాయంపై చైతన్యాన్ని పెంపొందించే దిశగా విశేష ఫలితాలను ఇచ్చింది.నడిపూడి గ్రామానికి చెందిన మన్యం వీర వెంకట కృష్ణ సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన "ధన్ 75" రకానికి సంబంధించిన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. తాను పాటించిన యాజమాన్య విధానాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకున్న జాగ్రత్తలు, భూమి ఉత్పాదకతను కాపాడటానికి చేసిన కృషి గురించి ఆయన వివరించారు.రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలని, ఇది ఆరోగ్య రక్షణకు, భవిష్యత్ పంటల నిలకడకు, భూమి జీవ వైవిధ్యానికి ఎంతో అవసరమని ఆయన సూచించారు. అనంతరం కృష్ణ పొలవీడు వద్ద రైతులు కలిసి క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్నారు.దొంగరావిపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పెనుగొండ మండల వ్యవసాయ అధికారి పీ. స్పందన మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు, పంటల నిర్వహణ పద్ధతులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, (విఏఏ) ఏ. మనోజ్ మరార్ నడిపూడి , (విఏఏ) కే. శశికుమార్ సిద్ధాంతం తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ఆదాయ వనరుల పెంపు - పారదర్శకతకు పంచాయతీల నూతన పాఠం
### స్వీయ ఆదాయ వనరుల శిక్షణ విజయవంతం

పెనుగొండ, నవంబర్ 12 ప్రభాతవార్త: పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్వీయ ఆదాయ వనరుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రెండురోజుల పాటు సాగిన ఈ శిక్షణా శిబిరంలో గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంపొందించడం, సమర్థవంతంగా నిర్వహించడం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, మండల అభివృద్ధి అధికారి, జిల్లా పంచాయతీ నిపుణులు, ఈ-గవర్నెన్స్ సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. శిక్షణలో ఆస్తిపన్ను అంచనా, వసూలు విధానాలు, వ్యాపార లైసెన్సుల జారీ, పునరుద్ధరణ, నీటి చార్జీలు, పారిశుద్ధ్య రుసుముల నిర్వహణ అంశాలపై వివరంగా చర్చించారు. అదేవిధంగా, ఆదాయ వనరుల పరంగా అద్భుతమైన ప్రతిఫలాలు సాధించిన గ్రామ పంచాయతీలను ఉదాహరణగా తీసుకొని వాటి విజయ రహస్యాలను తెలియజేశారు. డిజిటల్ ఆదాయ ట్రాకింగ్ పద్ధతులపై ప్రత్యక్ష శిక్షణ కూడా అందించారు. ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను అధికారి సిబ్బందితో చర్చించుకునే అవకాశం కల్పించడం ద్వారా పారదర్శకత, సమర్థత, సమయపాలన వంటి అంశాల్లో పంచాయతీ సిబ్బంది అవగాహన పెరిగిందని అధికారులు తెలిపారు.

## ఉత్సాహంగా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
### గోడ పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయకర్



ప్రభాతవార్త నరసాపురం :ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ను గోడ పత్రిక.... శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ విడుదల చేశారు. ఈనెల 14న బాలల దినోత్సవం తో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి తెలిపారు 15వ తేదీ పుస్తక ప్రదర్శన పత్రికా పఠనం పోటీ , వ్యాసరచన పోటీ 16వ తేదీ ప్రముఖులచే వివిధ ముఖ్యంశాల పై ప్రసంగాలు తదనంతరం క్విజ్ పోటీ17 వ తేదీ కవి సమ్మేళనం, రచయితల తోను సదస్సులు సెమినార్లు, పాటల పోటీ వకృత్వ పోటీ ..అంశం: సమాజంపైఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం18వ తేదీ చదరంగం పోటీ ...మ్యూజికల్ చైర్స్ పోటీలు 19వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత పై చర్చమరియు వ్యాసరచన పోటీ ... అంశం: క్రీడలలో మహిళల పాత్ర20వ తేదీడిజిటల్ గ్రంథాలయాల పై అవగాహన చదవడం మాకిష్టం కార్యక్రమం పై అవగాహన తో విద్యార్థులకు ఈ వారోత్సవాలు ముగుస్తాయని ముగింపు సభ లోబహుమతు లప్రధా నోత్సవం లుజరుగునుఅని ఈ వారోత్సవాలు కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులుసహకార సంస్థలు పుస్తక ప్రియులు దాతలు ఎన్నారైలు యావన్మంది పాల్గొని గ్రంథాలయ అభివృద్ధికి సహకరించవలసిందిగాకె జె ఎస్ ఎల్ కుమారి, గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కోరినారు. ఈ కార్యక్రమంలో డా ఆరేటి అమ్మా జీ,నళిని, సుధీర్ మోహన్, సూర్యం బాబు, భట్టిప్రోలు సత్యనారాయణ గ్రంథాలయ పాఠకులుతదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల ను తనిఖీ చేసిన మండల విద్యాధికారి



అత్తిలి / గణపవరం -నవంబర్ 11( ప్రభాతవార్త) :గణపవరం మండలం డి.కుముందువల్లి గ్రామంలో గల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాధికారి జి బాలయ్య తనిఖీ చేశారు. పాఠశాలల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పదవ తరగతి పరీక్షలకు చేపట్టాల్సిన కార్యాచరణ పథకం పై చర్చించారు. అనంతరం మండల విద్యాధికారి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. నాణ్యత తో కూడిన ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అందించాలని కోరారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుఎన్. వెంకటేశ్వర్లు ఇతర ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆస్థి కోసం కూతురినే చంపేశారు

ముద్దాపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి శ్రీనివాస్ మొదటి భార్య గజ్జరపు వసంత కుమార్తె నాగ హారిక కాగా, 2003లో వసంత అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అనంతరం 2009లో ముద్దాపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి రూపను శ్రీనివాస్ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె జన్మించింది. ఇదిలా ఉంటే మొదటి భార్య కుమార్తె నాగ హారిక పేరున ఎకరం పొలం ఆస్తి ఉంది. మరోవైపు తల్లి వసంత మృతి చెందిన తర్వాత ఆమె ద్వారా సంక్రమించిన మరో మూడు ఎకరాలు నాగ హారికకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే నాగ హారికకు సంక్రమించే ఆస్తిపై కన్నేసిన సవతి తల్లి ముళ్ళపూడి రూప ఆమెను హత్య చేయాలని పథకం పన్నారు. ఇందుకోసం భర్త శ్రీనివాస్ సైతం సహకరించాడు. 2022 నవంబర్ 11వ తేదీ రాత్రి నాగ హారిక నిద్రించిన తర్వాత ఆమె తలపై కొట్టి హత్య చేసి అనంతరం మంచంపైనే పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. తెల్లారేసరికి ఏమీ తెలియనట్లు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటి సీఐ ఆంజనేయులు, రూరల్ ఎస్సై రాజకుమార్ ఘటనా స్థలానికి చేరుకొని షార్ట్ సర్క్యూట్ కారణంగానే మృతి చెందినట్లు నిర్ధారించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ సంఘటన అప్పట్లో సంచలనం రేకెత్తించింది అయితే నాగ హారికను ఉద్దేశపూర్వకంగానే సవతి తల్లి హత్య చేసినట్లు అప్పట్లోనే మేనమామ, అమ్మమ్మ ఆరోపించారు. వీరి ఆరోపణలను పరిగణనలోకి తీసుకొని పోలీసులు గ్రామ వీఆర్వో వద్ద ఫిర్యాదు తీసుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

**అప్పటి పోలీసుల తీరుపై ఆరోపణలు**

గతంలో తణుకు వైసీపీ మండలం అధ్యక్షురాలిగా పనిచేసిన ముళ్ళపూడి రూప తన పలుకుబడిని ఉపయోగించి పోలీసులను సైతం తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. వైయస్సార్సీపీ లోని కొందరు పెద్దలు సహకారంతో ఈ కేసు నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు అప్పట్లోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులో అప్పటి సీఐ ఆంజనేయులు కీలకపాత్ర పోషించినట్లు విశ్వసనీయ సమాచారం. మరో వైపు మృతురాలు నాగ హారిక కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకోవాల్సి ఉండగా, గ్రామ విఆర్వో నుంచి ఫిర్యాదు తీసుకోవడం అప్పట్లోనే విమర్శలకు దారితీసింది. మరోవైపు ఫోరెన్సిక్ రిపోర్టు రావడానికి సైతం మూడేళ్లు సమయం పట్టడం పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఇలాంటి కేసుల్లో గరిష్టంగా మూడు నెలల్లోనే ఫోరెన్సిక్ రిపోర్టు వస్తాయి. అయితే ఈ కేసులో మాత్రం మూడేళ్ల తర్వాత కరెన్సీకి రిపోర్టు రావడం అందులోని అంశాల ఆధారంగా చేసుకుని అనుమానాస్పద మృతిగా నమోదు చేసిన సెక్షన్లను మార్పు చేసి హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుత సీఐ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తండ్రి ముళ్ళపూడి శ్రీనివాస్ తోపాటు సవతి తల్లి ముళ్ళపూడి రూపాలను అరెస్టు చేసి బుధవారం రిమాండ్ కు తరలించారు.

## గృహ యోగం కల్పించడం చంద్రబాబుకే సాధ్యం
### - మండల టీడీపీ అధ్యక్షుడు ఇజ్జి గాని



చాట్రాయి, నవంబరు 12, ప్రభాతవార్త : పేదలందరికీ గృహయోగం కల్పించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కే సాధ్యమని చాట్రాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జి గాని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆరుగొలను పేట గ్రామంలో ఇంటి గృహ గృహప్రవేశ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల 197 ఇల్లు ఒకేరోజు గృహప్రవేశం చేయటం ఒక చారిత్రాత్మక ఘట్టమని చెప్పారు. చాట్రాయి మండలంలో 336 ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుని గృహప్రవేశాలు జరుపుకుంటున్నామని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మధ్యలో నిలిచిపోయిన ఎస్సీ ఇళ్లకు 50 వేలు,ఎస్టీ ఇళ్లకు75 వేలు ప్రభుత్వం తరపున అదనంగా చేయూతగా అందించి ఇల్లు నిర్మాణం పూర్తి చేశారని తెలిపారు. పేదలందరూ సొంత గృహాల్లో పక్కా భవనాలల్లో నివసించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ సత్యనారాయణ, హౌసింగ్ ఇన్చార్జి శ్రీనివాస్, వర్క్ ఇన్స్పెక్టర్ బి కోటేశ్వరరావు, రెవెన్యూ కార్యదర్శి ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు,గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పానుగళ్ళ కోటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, జనసేన నాయకులు తుమ్మల జగన్, బిజెపి నాయకులు ఆదిమూలం నాగమోహన శర్మ పాల్గొని ఇజ్జి గాని నాగేశ్వరరావుకు సంబంధించిన ఇంటి గృహా ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని దంపతులను శాలువాతో సత్కరించారు. మండలంలోని చనుబండ గ్రామంలో సహకార సంఘ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నక్కా రాముల ఆధ్వర్యంలో గృహప్రవేశ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొరంపూడి మాట్లాడుతూ పేదోడి ఇంటి కల నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు.

## కుల మత రహిత వనసమరాధన కార్యక్రమం

ప్రభాత వార్త జంగారెడ్డిగూడెం :జంగారెడ్డిగూడెం ప్రాంత అభివృద్ధి కై అన్ని రాజకీయ పార్టీలు, ప్రముఖులు మీడియాతో కలిపి కమిటీ ఏర్పాటు చెయ్యాల్సిన అవసరంఎంతైనా ఉందని స్థానిక జెడ్ పి టిసి పోల్నాటి బాబ్జి అన్నారు. ఒకప్పుడు సాధారణ గ్రామం అయిన జంగారెడ్డిగూడెం కొద్ది కాలం లో గ్రేడ్.1 మున్సిపాలిటీస్థాయికి చేరుకొనున్నదని అయితే పట్టణం లో కనీస ప్రజా అవసరాలు మెరుగైన సదుపాయాలు కల్పనకు అభివృద్ధి కమిటీ అవస్యకత వున్న దని పేర్కొన్నారు. బుధవారం ఎస్ ఆర్ టి వి అధినేత సింగం శెట్టి సత్య రాజ్ కుల మతాలకు అతీతంగా స్నేహితులకై ఏర్పాటు చేసిన వన సమారాధనకు పట్టణ ప్రముఖులు రాజకీయ వేత్తలు పెద్ద సంఖ్య లో హాజరయ్యారు. ఈ సందర్బంగా జరిగిన గేట్ టూ గెదర్ లో ఏజెన్సీ మెట్ట ప్రాంతకూడలి గా వున్న జంగారెడ్డిగూడెంలో ప్రజా వసరాలు తీర్చడానికి అభివృద్ధి కమిటీ ఏర్పాటు అవస్యకత పై చర్చ జరిగింది. సీనియర్ జర్నలిస్ట్ కె ఎస్ శంకర్ రావు వ్యాఖ్యాతగా సుమారు రెండు గంటలపాటు నిర్వహించిన కార్యక్రమం లో జెడ్పిటిసి బాబ్జి అభివృద్ధి కమిటీ అవస్యకత ను నొక్కి చెప్పారు. ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళాల్సిన సమస్యలు ఇక్కడ అనేకం వున్నాయని అన్ని వర్గాల వారినీ కలుపుకొని ప్రజా ప్రతినిధులసహకారం తో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కై కృషి చేద్దాం అని పేర్కొన్నారు.వెనుకబడ్డ ఈ ప్రాంతం పురోగతి లో మీడియా పాత్ర ఎనలేనిదని ప్రతి పక్షం గా మీడియా ఇక్కడ అభివృద్ధి కి బాటలు వేసిందని వక్తలు కొనియాడారు. కార్యక్రమం లో విద్యావేత్త డా.అలుగు ఆనందశేఖర్ భవిష్యత్ లోఈ సెంటర్ జిల్లా కేంద్రం గా అభివృద్ధి అయ్యే అవకాశం ఉందని ఆశా భావం వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ కోర్టు భవనాలు మంజూరైనా నిధులులేమి వెంటాడు తోందని తెలిపారు. సీనియర్ అధ్యాపకుడు మద్రి వెంకటేశ్వరరావు జంగారెడ్డిగూడెం విద్యా కేంద్రం గా అభివృద్ధి చెందాలి అంటే యూనివర్సిటీ లేదా అధ్యయనకేంద్రం ఏర్పాటు అవసరం అన్నారు. మాజీ సర్పంచ్ బుద్దాల సత్యనారాయణ ఎప్పటి నుండో పెండింగ్ లో వున్న రైల్వే లైన్ ఈ పట్టణం మీదుగా వెళితే మరింతగా అభివృద్ధి సాధ్యం అని తెలిపారు. ఇంకా వక్తలు భోగవల్లీ రత్నాజీ,బుట్టాయి గూడెం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ మహేంద్ర రావు రైతు నాయకుడు ఘంటశాల గాంధీ సీనియర్ జర్నలిస్ట్ కె వి రమణ రావు తదితరులు మాట్లాడారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా... జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, దెందులూరు, పెదవేగి, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా... ఆకివీడు, గణపవరం, విడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించవలెను.
ఫోన్ :9704502377

## మాజీమంత్రి పరామర్శ



అత్తిలి / ఇరగవరం– నవంబర్ 12 ( ప్రభాత వార్త ): ఇరగవరం మండలం రేలంగి ఎంపీటీసీ సెగ్మెంట్ 1 దాసిరెడ్డి మహాలక్ష్మి తండ్రి ఇటీవలమృతి చెందగా వైసీపీ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్,మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మహాలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు.. ఈ కార్యక్రమంలో పెనుమత్స సుబ్బరాజు , వడ్డీ మార్కండేయులు, నడింపల్లి రాంబాబు , కాసకని సత్యనారాయణ పాల్గొన్నారు.

## నేడు చేనేత కార్మికులకు సహాయం
### అందజేయనున్న ఎమ్మెల్యే

అత్తిలి -నవంబర్ 12 ( ప్రభాతవార్త)తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ తిరుపతిపురం శివారు శివపురం గ్రామంలో గల మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన చేనేత కార్మికులకు ప్రభుత్వం అందజేసే నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం లో పాల్గొంటారని తాసిల్దార్ అధ్యక్షులు దశిక వంశీ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## మండలంలో త్వరలో గృహాలు ప్రారంభం.



అత్తిలి- నవంబర్ 12( ప్రభాతవార్త) అత్తిలి మండలంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన గృహాలను త్వరలో తణుకు శాసనసభ్యుడు ఆరుమిల్లి రాధాకృష్ణ ప్రారంభిస్తారని అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యరావు అన్నారు. పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సూర్యరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల వచ్చిన తుఫాను వల్ల ఏర్పడిన ఇబ్బందులను అధిగమించడంలో అధికారులు చొరవ చూపించారని అన్నారు. మండలంలోని రోడ్లు, డ్రైన్ లపై సమీక్ష జరిపారు. మార్చి నెలలో జరగబోయే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నదం చేస్తున్నట్లు మండల విద్యాధికారి ఎం వి ఎల్ కె ప్రసాద్ తెలిపారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు కొనకళ్ళ విజయ్ నిర్మల కాంతారావు, సుంకర నాగేశ్వరరావు, జడ్పిటిసి అడ్డాల జానకి, ఎంపీడీ వో పి శ్యామ్యూల్,ఎంపీటీసీలు, సర్పంచ్లు, తాసిల్దార్ దశిత వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు,

పెనుమంట్ర-ప్రభాతవార్త :మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో నవంబర్ 14 నుండి 20వ తేదీ వరకు 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు పి. టి. శివ కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, విద్యార్డులకు వ్యాస రచన, వక్తృత్వం, చిత్ర లేఖనం, క్విజ్, మ్యూజికల్ ఛైర్స్,పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కిటకిటలాడిన మద్ది క్షేత్రం

ప్రభాతవార్త జంగారెడ్డిగూడెం :జంగారెడ్డిగూడెం మండలం, గురవాయిగూడెం గ్రామములో వేంచేసియున్న శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానము నందు కార్తికమాస మహోత్సవములు సందర్భముగా స్వామి వారికి లక్ష తమలపాకులతో లక్షార్చన ఆలయ అర్చకులు, వేద పండితులు, ఋత్వికులుచే అత్యంత వైభవముగా జరుపబడినది. ఈ కార్యక్రమములో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనినారు. ఈ రోజు మద్యాహ్నం గం.05.00 ల వరకు స్వామి వారి దేవస్థానమునకు వివిధ సేవల రూపేణా రూ.1,99,154/-లు సమకూరినది. ఈ రోజు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన సత్రం నందు సుమారు 1651 భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ జరుపబడినది. శ్రీ స్వామి వారి దేవస్థానము నందు ప్రతి శనివారము పంచామృత అభిషేకములు, ప్రతి ఆదివారము హనుమద్ హెూమము అనంతరం శ్రీ సువర్చుల హనుమద్ కళ్యాణము ప్రతి సోమవారము లక్ష తమలపాకుల పూజ, ప్రతీ బుధవారం లక్ష పుష్పార్చన జరుగునని, ఈ పూజా కార్యక్రమములో పాల్గొనదలచినవారు దేవస్థానం నందు సంప్రదించవలసినదిగా ఆలయ సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి.చందన తెల్పినారు

## ప్రజాఉద్యమం కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి ఆరోపణలు



తణుకు నవంబర్ 12 ( ప్రభాత వార్త) :కార్పొరేటర్ చేతులకు వైద్య కళాశాలలను అప్పగించే ఉద్దేశ్యంతోనే చంద్రబాబు జగన్ తీసుకువచ్చిన 17 కళాశాలలను ప్రైవేటుపరం చేయనున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు తణుకులో వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పేదలందరికీ ఖరీదైన నాణ్యమైన వైద్యం చేరువ చేయాలని జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు శ్రీకారం చుట్టి 5 కళాశాలలు అందుబాటులోకి తీసుకురాగా మరొక 12 నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టించి సంక్షేమం అందిస్తామని చెప్పి నేడు ఎక్కడా లేని విధంగా రెండు లక్షల నలభైఆరు వేల కోట్లు అప్పుచేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. పేదల సౌకర్యార్థం తలపెట్టిన మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



# అటవీ భూములు ఆక్రమించిన వారి వివరాలు వెబ్‌సైట్‌లో వెల్లడించాలి

● ఎవరి ఆక్రమణలో ఎంత ఉంది? వారిపై నమోదైన కేసుల వివరాలు ప్రజలకి తెలియాలి ● అటవీ ఆస్తులను కబ్జా చేస్తే కఠిన చర్యలకి ఉపక్రమించండి ● మంగళంపేట అటవీ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ రిపోర్డులను ప్రాతిపదికగా తీసుకొని ముందుకు వెళ్ళాలి ● పెద్దిరెడ్డి కుటుంబానికి అడవుల్లో వారసత్వ భూములెలా వచ్చాయి? ● రాజకీయాలకు అతీతంగా భావి తరాలకు ప్రకృతి సంపద అందించాలి ● ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతి, నవంబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి: "అటవీ భూములు ప్రకృతి సంపద.. జాతి ఆస్తి. వాటిని ఆక్రమించిన వారు, చట్టాన్ని ఉల్లంఘించి అతిక్రమణలకు పాల్పడిన వారు కచ్చితంగా శిక్షార్హులవుతారు. అటవీ భూముల జోలికి వెళితే అది ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదు. అటవీ భూములను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దీన్ని నెరవేర్చే ప్రక్రియను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతుంది" అని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. వన్యప్రాణి రక్షిత అటవీ భూముల్లోను, అటవీ ప్రాంతాల్లోనూ అటవీ ఆస్తులు కబ్జా చేసి భారీ భవంతులు, ఎస్టేట్స్ నిర్మించినవాళ్లు ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చట్ట ప్రకారం ముందుకు వెళ్ళాలి అన్నారు. అటవీ భూములను రక్షించుకొని, రాబోయే తరాలకు అందజేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎవరికీ భయపడాల్సిన పని లేదని, మనో ధైర్యంతో ముందుకు వెళ్దామని అటవీ అధికారులకు పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పుంగనూరు నియోజకవర్గం, పులిచెర్ల మండలం, మంగళంపేటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఆయన కుటుంబసభ్యుల చేతిలో ఉన్న సుమారు 104 ఎకరాల అటవీ భూములపై పవన్ కల్యాణ్ అటవీ శాఖ ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

మంగళంపేట అటవీ భూముల అంశాన్ని అధికారులు వివరించారు. అటవీ చట్టం ప్రకారం ప్రిలిమినరీ అఫెన్స్ రిపోర్ట్ (పి.ఓ.ఆర్.), ఛార్జ్ షీట్ దాఖలు చేశామని అటవీ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో కేసుల వివరాలు ప్రొడ్యూస్ చేశామన్నారు. పి.ఓ.ఆర్., విజిలెన్స్ నివేదిక వివరాలపై చర్చించిన ఉప ముఖ్యమంత్రి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "అటవీ భూములు ఆక్రమించిన వారి వివరాలు శాఖ వెబ్‌సైట్‌లో వెల్లడించాలి. ఈ దిశగా ప్రణాళిక సిద్ధం చేయండి. ఎవరి ఆక్రమణలో ఎంత అటవీ ఆస్తి ఉంది? వారిపై నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుతం సదరు కేసులు ఏ స్థితిలో ఉన్నాయి లాంటి వివరాలు ప్రజలకి తెలియాలి... అటవీ భూముల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టం కఠినంగా ఉంది. చట్టం ప్రకారం ముందుకు వెళ్లాల్సిన విధి అధికార యంత్రాంగంపై ఉంది. మంగళంపేట అటవీ భూముల వ్యవహారం చూస్తే చట్టం కఠినంగా ఉన్నా అమలు ఆ విధంగా లేకపోవడం మూలంగానే ఆక్రమణలు సాగాయి. మంగళంపేట సర్వే నంబరు 295, 296ల్లో ఉన్న అసలు భూమి విస్తీర్ణం ఎంత..? అది కాలానుగుణంగా ఎలా పెరిగింది అనేది కీలకమైన అంశం. సర్వే నంబర్లను సబ్ డివిజన్ చేసి, అటవీ భూములను ఓ ప్రణాళిక ప్రకారం కలిపేసుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఓ రకమైన భూ లెక్కలు, అండంగల్‌లో మరో రకం భూ లెక్కలు కనిపిస్తున్నాయి. వెబ్ ల్యాండ్ నమోదులోనూ మతలబు ఉన్నట్టు కనిపిస్తోంది. ఇదంతా ఎలా జరిగింది..? ఎవరి ప్రమేయం ఉంది అనే అంశాలపై దృష్టి పెట్టాలి" అని అధికారులకు డిప్యూటీ సిఎం దిశానిర్దేశం చేశారు.

### న్యాయ నిపుణుల సలహాలు తీసుకొని ముందుకు వెళ్ళాలి

"పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డిలు 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ అటవీ భూముల గురించి వారి అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం అందించారనే అంశం నా దృష్టికి వచ్చింది. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి. న్యాయ నిపుణుల సలహా ప్రకారం ముందుకు వెళ్ళాలి. అలాగే భూమి రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం 45.80 ఎకరాలు వాళ్ళ అధీనంలో ఉంటే, వెబ్ ల్యాండ్‌లోకి వచ్చేసరికి ఆ భూమి 77.54 ఎకరాలుగా చూపారు. ఒకేసారి ఎందుకు ఇంత పెరిగిందన్నది కూడా పరిశీలించాలి. మాజీ అటవీ శాఖ మంత్రి కుటుంబానికి అడవి మధ్యలో ఉన్న భూమి వారసత్వంగా వచ్చిందని చెబుతున్నారు. అసలు అడవి మధ్యలో వారసత్వ భూమి ఎలా వచ్చింది, ఈ భూమి ఎలా ఎప్పుడు చేతులు మారిందనేది తెలుసుకోవాలి. దీనిలో ఎవరి పాత్ర ఎంత అనే దానిపై నివేదికలు తయారు చేయండి" అని అధికారులకు డిప్యూటీ సిఎం ఆదేశించారు.

### విజిలెన్స్ నివేదిక కీలకం

"పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై మంగళంపేట అటవీ భూముల ఆక్రమణల మీద ప్రసారమాధ్యమాల్లో కథనాలు వచ్చిన తర్వాత ప్రభుత్వం వేగంగా స్పందించింది. విచారణ కోసం విజిలెన్స్ కమిటీ నియమించింది. ఈ కమిటీ రిపోర్టు అత్యంత కీలకం. ఈ నివేదికలో పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబం ఆక్రమించిన భూముల తాలుకా పూర్తి వివరాలను పొందుపరిచారు. దీన్ని ప్రాతిపదికగా తీసుకోవాలి. అటవీ భూములను ఇష్టానుసారం ఆక్రమించే వారిని ప్రభుత్వం ఉపేక్షించదు. ప్రజలకు సంబంధించిన ఆస్తులు, జాతికి సంబంధించిన ఆస్తులపై కన్నేసే వారిపై నిఘా ఉంచుతాం. ప్రకృతి వనరులను దోపిడీ చేసేవారు, ఆక్రమించుకునే వారిపై రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకుంటాం" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.



బుధవారం గాంధీభవన్‌లో గాంధీజీ విగ్రహాల సేకరణ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మహేష్ కుమార్ గౌడ్

## లక్ష గాంధీజీ విగ్రహాల సేకరణ

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 12,ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచంలోనే గాంధీజీ ఎత్తైన విగ్రహం ఏర్పాటుకు పూనుకున్న కార్యక్రమానికి సంఘీభావంగా ఒక అడుగు వేస్తున్నామని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం గాంధీజీ విగ్రహాల సేకరణ కార్యక్రమప్రచార రథాన్ని జెండా ఊపి మహేష్ కుమార్ లాంచనంగా ప్రారంభించారు. పిసిసి గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా లక్ష గాంధీజీ విగ్రహాలసేకరణ కార్యక్రమం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్లు కల్వసుజాత, దీపక్ జాన్,గాంధీ విజ్ఞాన కేంద్రాల కమిటీ రాష్ట్ర కన్వీనర్ , గాంధారి ప్రభాకర్,గాంధీ గాని ప్రతిష్ట వైస్ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజర్ అండ్ అడ్వైజర్ కె .రాజునాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ నీరుడు దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల కార్యదర్శిగా సచిన్ సావంత్


**హైదరాబాద్,నవంబరు 12,ప్రభాతవార్త:**ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల కార్యదర్శిగా సచిన్‌సావంత్‌ను నియమిస్తూ ఎఐసిసి కార్యదర్శి కెసి వేణుగోపాల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గుజరాత్‌కు బివి శ్రీనివాస్, పుదుచ్చేరి లక్ష్యదీప్‌కు ప్రతాపన్, మధ్యప్రదేశ్‌కు సంజనాజావత్ మహారాష్ట్రాకు రహమన్‌రాజాయాచిస్త, పంజాబ్‌కు హీనాకార్వ,సూరజ్ ఠాకూర్,ఒడిస్సాకు జిట్టికుసుమకుమార్, తమిళనాడుకు నివేదిత ఆల్వా కొత్తగా నియమించారు. ఉషానాయుడు మధ్యప్రదేశ్‌కు, భూపేంద్ర మరావయిజార్ఖండ్‌కు దేవేంద్ర యాదవ్ గుజరాత్‌కు పరాగత్ సింగ్ జమ్ముకాశ్మీర్‌కు మనోజ్ యాదవ్ ఉత్తరఖండ్‌కు మార్చినట్లు వేణుగోపాల్ లేఖ విడుదలచేశారు. టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ వ్యవహారాల ఎఐసిసి కార్యదర్శిగా సచిన్ సావంత్ నియామకం స్వాగతించారు. ఆయనకు ఘన స్వాగతం తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలపరచడానికి సచిన్ సావంత్ నాయకత్వం, మార్గదర్శకత్వం దోహదపడుతుందని మహేష్ కుమార్ గౌడ్ విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఎఐసిసి మార్గదర్శకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## సమయానికి రాని అధికారులపై క్రమశిక్షణ చర్యలు

### వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** తమ శాఖ పరిధిలోని విభాగాల్లో సకాలంలో విధులకు హాజరుకాని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు హెచ్చరించారు. హైదరాబాద్‌లో బుధవారం సీడ్ సర్టిఫికేషన్ కార్పొరేషన్, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హ్యాండ్లూమ్ టెక్స్టైల్ కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సమయానికి హాజరుకాని కొంతమంది అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. పౌరుగుసేవల సిబ్బంది సమయపాలన పాటిస్తుండగా, రెగ్యులర్ ముఖ్యంగా జిఎం, మేనేజర్ స్థాయి అధికారులు నిరక్ష్యంగా వ్యవహరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. సమయపాలనను కఠినంగా అమలు చేయాలని, విధులపట్ల అలసత్వం చూపే వారి పట్ల ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఉన్నతస్థాయి అధికారులు నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ సమయపాలన పాటిస్తూ, ప్రజాసేవలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# పెద్ద గురువులు లేని వర్సిటీలు!




## 70%పైగా అధ్యాపకుల ఖాళీలు

## 2878 పోస్టులు మంజూరు.. ఉన్నది 753 మందే

## 2017లోనే ఆర్థిక శాఖ ఆమోదించినా ఇంకా మొదలు కాని ప్రాసెస్

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 12:** నేటి బాలలే రేపటి పౌరులు. అలాంటి పౌరులు సమాజంపై అవగాహన కల్పించుకొని.. మంచి పౌరులుగా ఎదిగేది యూనివర్సిటీ విద్య ద్వారా. అటువంటి యూనివర్సిటీ విద్యను బోధించడానికి విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు కరువయ్యారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ యూనివర్సిటీల్లో 70 శాతానికిపైగా ఆచార్యుల కొరత ఉంది. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం గత పదమూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. నాణ్యమైన విద్యను అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నప్పటికీ ఆచరణలో ఇటువంటి ఇబ్బందల మూలంగా అది సాధ్యమయ్యే పరి స్థితి కనిపించడం లేదు. రాష్ట్రంలోని యూనివ ర్సిటీల్లోనే కాదు.. అనేక ప్రభుత్వ విద్యా సంస్థ ల్లో బోధనా సిబ్బంది ఖాళీలుగా భారీగానే ఉన్నా యి. పాఠశాల విద్య స్థాయి నుంచి మొదలుపెడితే యూనివర్సిటీ స్థాయి వరకు అధ్యాపకుల ఖాళీలున్నాయి. బోధించే వారేలేకపోతే.. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యా ర్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ కొద్ది రోజుల క్రితం విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, తెలంగాణ విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీ పడేలాగా తయారు చేయాలని అధి కారులను ఆదేశించారు. తమ ప్రభుత్వం విద్యశాఖకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కానీ వాస్తవంగా రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. రాష్ట్రంలోని పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, యూనివర్సిటీ స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో అధ్యాపక ఖాళీలు భారీగా ఉన్నాయి. 26,0167 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉంటే వాటిల్లో సుమారు 15వేల వరకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉంటే వాటిల్లో సుమారు 500కి పైగా జూనియర్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 130 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 4200 అధ్యాపక పోస్టులు మంజూరైతే ప్రస్తుతం 1600 మంది రెగ్యులర్ లెక్చరర్లు కొనసాగుతున్నారు. ఇక యూనివర్సిటీల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రాష్ట్రంలో ఉన్న 11 యూనివర్సిటీల్లో 2878 అధ్యాపక పోస్టులు మంజూరు కాగా వాటిల్లో ప్రస్తుతం 753 మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు కొనసాగుతున్నారు. మిగిలిన 2125 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మొత్తం కలిపి 2878 పోస్టులు మంజూరు చేయగా.. వాటిలో కేవలం 753 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మంజూరైన ప్రొఫెసర్ పోస్టుల్లో ఉస్మానియా, తెలంగాణ, జేఎన్‌టియుహెచ్, జెఎన్ఎఫ్ఏయూలో మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నారు. మిగిలిన కాకతీయ, మహాత్మాగాంధీ, శాతావాహన, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆర్‌జీయుకేటిల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. 11 విశ్వవిద్యాలయాల్లోనూ ప్రొఫెసర్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వరకు ఖాళీలున్నాయి. ఇక కొత్తగా ఏర్పాటైన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి, ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీల్లోనూ కొత్తగా నియామకాలను చేపట్టలేదు. కొద్దిరోజుల క్రితం ఉస్మానియా యూనివర్సిటీలో కెరీర్ అడ్వాన్స్ స్కీమ్(సీఏఎస్)లో భాగంగా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించారు. దీంతో ఇప్పటికే ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ఖాళీలకు అదనంగా మరో 20 నుంచి 30 ఖాళీలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలోని స్టేట్ యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి 2017లోనే సుమారు 1000కిపైగా పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 8 సంవత్సరాలుగా నియామక ప్రక్రియ ప్రారంభం కాకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా నియామక ప్రక్రియ నిలిచిపోయింది. నియామకాల కోసం నియామక బోర్డును గత ప్రభుత్వం తీసుకురావాలని భావించినప్పటికీ అందుకు గవర్నర్ ఆమోదం తెలపకపోవడంతో నియామక బోర్డు ఏర్పాటు ఆగిపోయింది. ఆ తరువాత 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీని ఇప్పటి వరకు చేపట్టలేదు.

## నత్తనడకన చేప పిల్లల పంపిణీ

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం నత్త నడకన సాగుతున్నది. సుమారు రూ.123 కోట్లతో చేపడుతున్న ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26,326 నీటి వనరుల్లో 84.62 కోట్ల చేప పిల్లలు పోసేందుకు ఏర్పాట్లు చేసింది.అయితే ఈ నెల 30 నాటికి చేప పిల్లల పంపిణీ పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ కనీసం 10 శాతం పంపిణీ కూడా పూర్తి కాలేదు. 2025-26 సంవత్సరానికి 30,358 నీటివనరుల్లో రూ.123 కోట్లతో 83 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయాలని మత్స్యశాఖ నిర్ణయించింది. ఇక 35-40 మిల్లీమీటర్ల సైజులో ఉండే లక్ష చేపపిల్లలకు రూ.62,670 చొప్పున,80-100 మిల్లీమీటరు సైజులో ఉండే లక్ష చేప పిల్లలకు రూ. 1,66,130చొప్పున ప్రతిపాదిత వ్యయాన్ని మత్స్యశాఖ అధికారులు నిర్ణయించారు. ఆగస్టులో మొదలుపెట్టాల్సిన చేప పిల్లల పంపిణీని అక్టోబర్ చివరివారంలో ప్రారంభించారు. 17జిల్లాల్లో ఇప్పటివరకూ చేపపిల్లల పంపిణీ మొదలు పెట్టలేదు. చేపపిల్లల పంపిణీ విషయమై మత్స్యశాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అరోపణలు ఉన్నాయి.

# హుటాహుటిన మేడారం పనులు

### అధికారులకు ఆదేశాలు జారీ చేసిన మంత్రి పొంగులేటి

### నాణ్యతపై రాజీపడొద్దని సూచన

### నిర్మాణాలలో గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించాలి: మంత్రి సీతక్క

### జాతీయ పండుగగా మేడారం జాతరను గుర్తించాలి: మంత్రి కొండా సురేఖ




బుధవారం మేడారం జాతర పనులపై సమీక్షిస్తున్న మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ. సీతక్క

**ములుగు జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** మేడారం మహా జాతర అభివృద్ధి పనులను బుధవారం రెవెన్యూ,గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ లతో విస్తృతంగా మేడారంలో పర్యటించి, అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ పర్యటనలో మంత్రులతోపాటు చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పి శబరిష్, అటవీ అధికారి రాహుల్ కిషన్‌జాదవ్ తదితర అధికారులు పాల్గొన్నారు. మేడారం హరిత కాకతీయ హోటల్లో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అభివృద్ధి పనుల పురోగతిని వివరంగా సమీక్షించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ దేవాలయ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి డిసెంబర్ 20 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యతపై రాజీలేదన్నారు. గ్రానైట్ వంటి అవసరమైన మెటీరియల్‌ను వేగవంతంగా తెప్పించి, పనులు రాత్రింబవళ్లు కొనసాగించాలని, అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు.రోడ్ల నిర్మాణం, డివైడర్లు, ప్లాంటేషన్ పనులు ఒక నెలలోపు పూర్తి కావాలని స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా క్యూ లైన్ షెడ్లు, రోడ్ల విస్తరణ, గద్దెల వద్ద భక్తుల సామర్థ్యాన్ని 3 వేల నుండి 10 వేలకు పెంచే చర్యలు చేపట్టాలని,19 ఎకరాల భూసేకరణను వేగవంతం చేయాలని తెలిపారు. జంపన్నవాగు పై చెక్‌డ్యామ్‌లు, శాశ్వత బస్ స్టేషన్, పర్యాటక సుందరీకరణ ప్రతిపాదనలు తక్షణమే సిద్ధం చేయాలని, మల్లంపల్లి, కటాక్షపూర్ వంతెన పనులు డిసెంబర్ 15 నాటికి పూర్తవ్వాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మేడారం అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి అని, జాతర ప్రారంభానికి రెండు వారాల ముందుగానే అన్ని పనులు పూర్తి చేస్తాం అని, ముందస్తు మొక్కులు చెల్లించుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం అని తెలిపారు. భవిష్యత్‌లో 10 కోట్ల మంది భక్తులు సౌకర్యంగా దర్శనమందుకునేలా మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు వివరించారు. మేడారం అభివృద్ధి పనులు రాబోయే 200 సంవత్సరాలకు నిలిచిపోయేలా శాశ్వతంగా జరుగుతున్నాయని, ఎంత వ్యయం అయినా వెనకడుగు వేయమని ఆయన స్పష్టం చేశారు.ఈ నెల 22న మళ్లీ సమీక్ష చేస్తాం. అప్పటికి పనులు పూర్తవ్వాలి అని ఆయన హెచ్చరించారు

### జాతీయ పండుగగా మేడారం జాతరను గుర్తించాలి. మంత్రి కొండ సురేఖ

మేడారం జాతర నిర్వహణలో గతంలో లేని అభివృద్ధి కార్యక్ర మాలను ప్రజా ప్రభుత్వం చేపడుతోంది అని, రాష్ట్ర పండుగగా గుర్తించిన మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని,చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి కొనసాగుతోంది రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ వివరించారు.గిరిజనుల ఆచారాలు సాంప్రదాయాలకు ప్రతీకగా అభివృద్ధి పనులు.మంత్రి సీతక్క. గిరిజనుల ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా గద్దెల పునరుద్ధరణ జరుగుతోంది అని, గిరిజనుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా పనులు కొనసాగిస్తు న్నామని, మరికొద్ది రోజుల్లో గద్దెల ప్రాంతం కొత్త రూపాన్ని సంతరించుకుంటుందని మంత్రి సీతక్కవివరించారు. మేడారం పర్యటన అనంతరం సాయంత్రం 3:40 గంటలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.హరీష్ హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరారు.

## తుది అంకానికి ఎస్‌ఎల్‌బిసి జియోఫిజికల్ సర్వే

**హైదరాబాద్,నవంబరు 12,ప్రభాతవార్త:** హెలికాప్టర్‌తో శ్రీశైలం ఎడమగట్టు సొరంగం భూభౌతిక పరిస్థితి అధ్యయనం చేయడానికి చేస్తున్న హెలీబోర్న్ మ్యాగ్నెటిక్ జియో ఫిజికల్ సర్వే దాదాపు తుది అంకం చేరుకొంది.ప్రత్యేక హెలీకా ప్టర్ మన్నెవారిపల్లి ఔట్‌లెట్ నుంచి దోమల పెంట ఇన్‌లెట్ వరకు తిరుగతూ సర్వే చేస్తుం డటంతో శాస్త్రజ్ఞులు ఇచ్చే నివేదికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నేషనల్ జియో ఫిజికల్ ఇన్స్టిట్యూట్ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో పది రోజులుగా మ్యాగ్నమీటర్, రిసీవర్, ట్రాన్స్ మిట్టర్ లూప్‌లు అమర్చిన ప్రత్యేక హెలీకాప్టర్‌తో సర్వే జరుగుతోన్నది. ఎస్‌ఎల్‌బిసి జియో ఫిజికల్ సర్వే కోసం హెలికాప్టర్ ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం వేళలలో రెండుసార్లు టేకాఫ్,ల్యాండింగ్ అవుతోన్నది. టేకాఫ్ అయిన ప్రతి సారి ఒక్కో దఫా ఐదు నుంచి ఎనిమిది చక్కర్లు కొడుతూ వచ్చి ల్యాండ్ అవుతోంది. వాతావరణం అనుకూలంగా ఉంటే ఎక్కువ రౌండ్లు తిప్పుతూ అధ్యయనం చేస్తున్నారు. గాలిలో 150 మీటర్ల ఎత్తు నుంచి భూమిలోపల దాదాపు 500 నుంచి 800 మీటర్ల లోతు వరకు విద్యుదయస్కాంత తరంగాలను ప్రసరింప చేస్తూ ప్రతి ఇంచు ఇంచు జల్లెడ పడుతోన్నది. ప్రమా దం జరిగిన ప్రాంతం, ఇక ముందు తవ్వాల్సిన సొరంగ అలైన్మెంట్ తోపాటు సొరంగ మార్గం తవ్వకం పూర్తైన ప్రాంతాన్ని శాస్త్రజ్ఞులు పరిశీలిం చాలని నిర్ణయించడంతో 43 కి.మీ.నిడివిలో సొరంగం అడ్డం సుమారు 3 కి. మీ. పరిధిలో సర్వే చేస్తున్నారు. దీని కోసం సొరంగం ప్రతిపా దితన ప్రాంతంను 14 వరుసలుగా విభజిం చుకుని, ఒక్కో వరుసలో 100 నుంచి 500 మీటర్ల మధ్య సర్వే చేపడుతున్నారు. దీని ద్వారా భూమిలోపల షీయర్ జోన్స్ వంటి ప్రమాద కరమైన ప్రాంతాలను గుర్తించ దానికి ప్రయత్నాలు చేసునతన్నారు. నీటి ప్రవాహాలు, పెలుసైన బురద ప్రాంతాలు, భూమిపొరలలో పోరస్ వివ రాలు తెలుసుకునే అవకాశం వుంది. త్వరలలోనే ఏరియల్ సర్వే ముగించడమే కాకుండా నవంబరు 29లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వబోతున్నారని అదికారవర్గాలు చర్చించుకొంటున్నాయి.

## వ్యవసాయ కోర్సులకు నేడు కౌన్సెలింగ్

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** వ్యవసాయ కోర్సుల (డ్యూయల్ డిగ్రీ) నిమిత్తం ప్రవేశాలకుగాను తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం కౌన్సెలింగ్ నిర్వహించనుంది. ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఈ కౌన్సిల్‌ను జరుపుతున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాలకు వాక్ ఇన్ కౌన్సిలింగ్ ను నిర్వహిస్తున్నట్లు అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా బీఎస్సీ (ఆనర్స్)అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బీఎస్సీ (ఆనర్స్), కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి కూడా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ రెండు కౌన్సిలింగ్ లు రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ నేచరల్ రిసోర్సెస్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్ సైట్‌లో పేర్కొన్న రుసుముతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

## కాకతీయ సోలార్ విద్యుత్ ప్లాంట్ చేపట్టండి

### విద్యుత్‌శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్

**హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్‌లో సోలార్ విద్యుత్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. భూపాలపల్లి జిల్లాలోని చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కెటిపిఎస్)లో 28మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టిఎస్ జెన్కో) సిఎండి ఎస్. హరీష్‌తోకలిసి మిట్టల్ కాకతీయ థర్మల్‌పవర్‌ప్లాంట్‌కు సంబంధించి యూనిట్ 1,యూనిట్2లను పరిశీలించి, తదుపరి అధికారులతో కలసి విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల పనితీరును సమీక్షించారు. అనంతరం ఆయన తడిచెర్ల గ్రామంలోని తడిచెర్ల కోల్ బ్లాక్ ఓపెన్‌కాస్ట్ మైన్‌ని సందర్శించారు. ఆయన ఒసిపి ఆవరణలో సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ తాడిచెర్లనుండి కెటిపిఎస్ వరకు కన్వేయర్ బెల్ట్‌వేయడానికి కావాల్సిన భూమిని సేకరించే ప్రక్రియపై దృష్టిసారించాలన్నారు. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, పారదర్శకంగా తగినవిధానాన్ని అనుసరించడం ద్వారా పునరావాస చర్యలు అమలు చేయాలని స్పష్టంచేశారు. ఇందుకు సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కన్వేయర్ బెల్ట్ ద్వారా బొగ్గును సులభంగా తరలించడం ద్వారా వల్ల రవాణా భారం తగ్గుతుందని పేర్కొన్నారు.



# అపజయాన్ని మెట్టుగా చేసుకోవాలి

వైఫల్యం ఎదురైనప్పుడు జీవితం ఆగిపోయింది అనుకోకూడదు. ఆ అపజయాన్ని మెట్టుగా చేసుకోవాలి. అప్పుడే ముందుకు సాగుతాం అంటారు ప్రతిభా శేఖర్. కాబట్టే... నాలుగేళ్ల వైఫల్యాలను దాటగలిగారు. గ్రూప్ 1, 2, 3, 4 ఉద్యోగాలు సాధించారు. తాజాగా డెప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పొందుతున్నారు. ప్రతిభది హైదరాబాద్. తండ్రి శేఖర్ బీమా సంస్థలో ఉద్యోగి. తల్లి సుజాత ప్రభుత్వోద్యోగిని. వరంగల్ ఎన్ఐటీలో ఇంజినీరింగ్ చేశారు ప్రతిభ తల్లిని చూస్తే ప్రభుత్వోద్యోగం సాధించాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. సివిల్స్, గ్రూప్‌ల కోసం సిద్ధమయ్యారు. తొలి నాలుగేళ్లూ వరుస వైఫల్యాలు.. కానీ ఆమె కుంగిపోలేదు. ఎలాగైనా ప్రభుత్వ కొలువు సాధించాలని పట్టుదలగా శ్రమించారు. కష్టంగా కాదు, ఇష్టంగా చదివా. నువ్వు తప్పక సాధిస్తావంటూ ప్రోత్సహించేవారు. అది నాకు సాయపడింది. కోచింగ్ లేకుండానే సొంతంగా నోట్స్ తయారుచేసుకుని, సిద్ధమయ్యా. మోడల్ పరీక్షలను ఎక్కువగా రాసేదాన్ని అవి నాకు కలిసొచ్చాయి అంటారు ప్రతిభ. గంటల కొద్దీ చదవడం కాదు. చదివింది ఎక్కువ కాలం గుర్తుండేలా సాధన చేయాలంటారీమె. ఒత్తిడి నుంచి తప్పించుకోవడానికి సంగీతం వినడం, ఆటలు ఆడటం చేశారట. తన క ఫలించి నాలుగు ఉద్యోగాలు... గ్రూప్4 జూనియర్ అసిస్టెంట్, గ్రూప్3లో 160వ ర్యాంకు, గ్రూప్2 డెప్యూటీ తహసీల్దార్, తాజా గ్రూప్1 పరీక్షల్లో డెప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం సంగారెడ్డిలో శిక్షణ పొందుతున్నారు. ఖిసామాజిక మాధ్యమాలను కాలక్షేపానికే ఉపయోగించొద్దు. కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీసన్ను అందించే పేజీలు చాలానే, పుస్తకాలకు విరామం ఇచ్చినప్పుడు వీటిని చూసుకుంటే సమయం వృథా కాదు, సన్నద్ధత పూర్తవుతుంది. నేను అనుసరించిన మార్గమిది అని చెబుతారు ప్రతిభ. □

# మీ కోడల్ని తిరిగి చికిత్స చేయించండి !

వ్యధ



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న: మా కోడలు విచిత్రంగా ప్రవర్తిస్తోంది. లేనిపోని అనుమానాలు వ్యక్తం చేస్తోంది. అనవసరంగా నా కొడుకును నిందిస్తోంది. కొద్ది రోజుల క్రితం గుడిలో తెలిసిన ఒక మహిళతో నవ్వుతూ మాట్లాడినందుకు నానా రభసా చేసింది. తాళి తీసి భర్త ముఖం మీద కొట్టి ఆత్మహత్య చేసుకుంటానని గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నది. బలవంతంగా తలుపులు తీసి ఆమెను ఆత్మహత్య చేసుకోకుండా ఆపాడు. ఆమె ప్రవర్తన చూసి సైకియాట్రిస్టు వద్దకు తీసుకుని వెళ్ళాము. ఆయన పరీక్షలు చేసి మాత్రలు రాసిచ్చారు. అయితే ఒక రోజు మాత్రమే మాత్రలు వేసుకుని మానేసింది. అవి వేసుకుంటే నిద్ర వస్తోందని, ఇక వేసుకోను అంటూ మొండికేసింది. కౌన్సెలింగ్ చేయిద్దామని సైకాలజిస్ట్ వద్దకు తీసుకుని వెళ్ళాము. ఆయన కూడా మందులు వాడమని కొన్ని సలహాలు ఇచ్చి, సైకో థెరపీ చేశారు. మరుసటి రోజు ఆయన వద్దకు రాలేదు. పోనీ అని చెప్పి హోమియో డాక్టర్ వద్దకు తీసుకుని వెళ్ళాము. ఆయన కొన్ని మాత్రలు ఇచ్చారు. అవి ఒక రోజు వాడి మానేసింది. గత ఆరు నెలల నుంచి ఆమె సరిగా నిద్ర పోవడం లేదు. ఇంటర్ వరకు చదువుకున్నది. వయసు 30 ఏళ్ళు, ఎత్తు ఐదు అడుగుల రెండు అంగుళాలు, బరువు 70 కిలోలు ఉంది. ఐదేళ్ల క్రితం పెళ్లయింది, నాలుగేళ్ల బాబు ఉన్నాడు. మా అబ్బాయి బి టెక్ చదివి ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ పరిస్థితులలో మా కోడల్ని బాగు చేసే మార్గం చెప్పండి.

- ఒక సోదరి , మహబూబ్ నగర్



జవాబు : అమ్మా మీ కోడలిలో పోస్ట్‌పార్టం డిజార్డర్, డిప్రెషన్, ప్యారనాయిడ్ సైకోసిస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. వాటిని మరింత పరిశీలించవలసి ఉంది. అయితే అన్నింటికంటే సైకియాట్రిస్ట్ ద్వారా చికిత్స చేయించడం తప్పని సరి. కౌన్సెలింగ్ సహాయకారిగా పని చేస్తుంది. ఆమెది ఒక రోజు మందులు వేసుకుంటే తగ్గే సమస్య కాదు. కనీసం ఆరు నెలలు అయినా మందులు వాడాలి. కాబట్టి మానసిక వైద్యుడిని (సైకియాట్రిస్ట్ ) తిరిగి సంప్రదించండి. అలాంటి రుగ్మతలు ఉన్నవారిలో వివేకం ఉండదు, దీనివల్ల తాము అనారోగ్యంగా ఉన్నామన్న వాస్తవాన్ని అంగీకరించరు. కాబట్టి మీరు, మీ కొడుకు ఆమెతో వాదించడం మాని, డాక్టర్ సూచనలతో మందులు వాడటం మళ్ళీ ప్రారంభించడం మంచిది. అవసరమైతే డాక్టర్ మందులు మారుస్తారు. ఒక వేళ ఆమె మీ మాట వినక పోతే వారం లేదా 10 రోజులు ఆసుపత్రిలో ఉంచి చికిత్స చేయించండి. డాక్టర్ సలహా తీసుకుని సైకో థెరపీ చేయించండి .సైకాలజిస్ట్ వద్ద వారానికి ఒకసారి కౌన్సెలింగ్ కొనసాగాలి. ఆమె అనుమానాలు, భయాలు తగ్గించేందుకు కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ చాలా ఉపయోగపడుతుంది. మీరు ఆమెను అర్థం చేసుకుని ఆదరించండి. అనవసర వాదనలు, విమర్శలు చేయడం మానేయండి. ఆమె జీవన శైలిలో మార్పు కోసం ప్రయత్నం చేయండి. □

# పడనీయను

ఒకసారి రామచంద్ర ఆత్మారాం తర్కడ్ కుమారుడు జ్యోతీంద్ర దర్కడ్ బాబా వద్దకు వచ్చి 'నీవు మానవ మాత్రుడవని, దైవానివి కావు అని ఇతరులు పలుకుచున్నారు. అన్నాడు. సాయి అందులకు 'అవును. దానిలో అసత్యము ఏమి కలదు? ఆహా! నేనెవరును? ఒక పేద ఫకీరును. నేను దైవమును కాను, దేవుడెంతో గొపనపవాడు! దైవముతో నెవరూ పోల్చుకొనదగరు అన్నాడు. జ్యోతీంద్ర 'సాయిబాబా! నీవు అల్లు పలుకుచు మమ్ములను మోసపుచ్చుతున్నావు. నీవు దేవుడవనే మేము సంపూర్ణముగా విశ్వసింతుము అన్నాడు సాయితో. అదే సమయంలో ద్వారకామాయిలోనికి ఇరువురు వచ్చి సాయి బాబా పాదములకు మొక్కిరి. వచ్చిన ఆ ఇరువురితో సాయిబా 'నా భక్తులను గూర్చి నేను జాగ్రత్త పడవలయును. నా భక్తుడు ఎవడైనను కూలుచున్న, నా నాలుగు చేతులు చాచి వానిని లేవనెత్తి వానిని నేను ఆదుకొన వలయును. నా వానిన ఎందునూ పడనీయను, చెడనీయను'అన్నారు. జ్యోతీంద్ర 'బాబా ఇప్పుడే నేను దేవుడను కాను నేను ఒక పేద పకీరును అంటివే! అట్టి ఎడల నీ వెట్లు నాలుగు చేతులు కలిగి యున్నావు. అని చనువుగా ప్రశ్నించాడు. సాయి సమాధానము చెప్పక చిరునవ్వు నవ్వాడు. సాయి దైవమే. సందేహం లేదు. అయితే తానే పడువాడిని పట్టుకొనడు! పడనీయడు!! సపత్నేకర్ దంపతులకు సంతానం లేదు. ఆ దంపతులు సాయిని శరణు జొచ్చారు. సాయి సపత్నేకర్ భార్యతో 'తీసుకో ఒకటి, రెండు, మూడు, నాలుగు నీకెన్ని కావాలో అన్ని' అన్నాడు భావగర్భితంగా. అంటే సాయి వారిని కరుణించాడు. పుట్టిన పసి బిడ్డలతో సాయిని దర్శించేవారు ఆ దంపతులు. 14 జూలై 1918న వారికి దినకర్ పుట్టాడు. రెండు, మూడు నెలల వయసున్నప్పుడు సాయి దర్శనానికి పిల్లవానిని షిరిడి తీసుకువెళ్లారు. దినకర్‌ను సాయి పాదాలచెంత ఉంచారు. సాయి ఆ పిసి వాడిని ఎత్తుకుని పైకెగర వేశారు. పట్టుకోవటానికి ప్రయత్నించలేదు. ఎవరో భక్తుడు పట్టుకునాననడు. ఆ తల్లి కూడా నిశ్చింతగా ఉంది. సాయి సన్నిధిలో ఎటువంటి ఆపద కూడా జరగదని ఆ తల్లే అన్నది. ఒక భక్తుడు పసివాడిని పట్టుకుంటాడని సాయిబాబాకు ముందే తెలుసు అందుకే ఆయన ప్రయత్నించలేదు! సాయిపై ఎంతటి భక్తి, విశ్వాసం. అట్టి నమ్మకము మనకు కూడా అలవడునుగాక! □



# పాల అప్పం

**కావలసినవి..** తాజా కొబ్బరి తురుము అర కప్పు, పంచదార అర కప్పు 2 టేబుల్ స్పూన్లు, కొబ్బరి పాలు కప్పు, డ్రై యీస్ట్ అర చెంచా, ఉప్పు చిటికెడు, బియ్యం కప్పు, అన్నం అర కప్పు

**తయారీ..** బియ్యాన్ని ముందు రోజు రాత్రి నానబెట్టాలి. రెండు టేబుల్స్పూన్ల గోరువెచ్చని నీటిలో పంచదార వేయాలి. అది పూర్తిగా కరిగాక డ్రై ఈస్ట్ వేసి పది నిమిషాలు ఉంచితే.. అందులో బుడగలు, నురగలు వస్తాయి. బియ్యాన్ని వడకట్టి జార్లో వేయాలి. అందులో యీస్ట్, కొబ్బరి తురుము, వండిన అన్నం, కొబ్బరిపాలు, పంచదార జోడించి గ్రైండ్ చేయాలి. అది దోశల పిండిలా కొంచెం జారుగా ఉండాలి. ఒకవేళ గట్టిగా ఉంటే కొన్ని నీళ్లు, పల్చగా ఉంటే కాస్త బియ్యప్పిండి జతచేయాలి. ఈ పిండిని బాగా కలిపి.. ఓ పావుగంట పక్కనుంచితే చక్కగా పులిసి, పొంగుతుంది. ఇందులో పావు కప్పు నీళ్ల కలపాలి.



ప్యాన్ వేడయ్యాక ముప్పావు కప్పు పిండి వేసి.. హ్యాండిల్ పట్టుకుని వలయంలా కదిలించాలి. పిండి పాన్ అంతటా పరచుకున్నాక మూత పెట్టాలి. నిమిషం తర్వాత అప్పమ్ము తీసేయాలి. మిగిలిన పిండితోనూ ఇలాగే చేయాలి. □

# జీవనసారాన్ని పెంచే మొక్కలు



జీవన సారాన్ని పెంచే మొక్కలు మొక్కలు, చెట్లు కేవలం అలంకరణ, పర్యావరణం కోసమే కాదు, జీవనసారాన్ని పెంచేందుకూ ఉపయోగపడతాయి. ఆరోగ్యాన్ని పెంచి ప్రశాంతతను తెస్తాయి. మొక్కలు, చెట్లు ఇంటి ఆవరణలో పెంచుకోదగ్గవి కొన్ని మాత్రమేనంటారు నిపుణులు. వాటిలో ముఖ్యమైనవి... **తులసి:** దీన్లోని సహజ ఔషధ లక్షణాలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచుతాయి. సంతోషాన్ని, ఆధ్యాత్మిక భావనల్ని ఇస్తుంది.

**అలోవెరా:** ఔషధ గుణాలెన్నో. నెగెటివ్ ఆలోచనల్ని దూరం పెడుతుంది. ఇంట్లో, బయట పెంచుకోవచ్చు.

**మనీ ప్లాంట్:** అదృష్టానికి చిహ్నంగా భావించే మొక్కల్లో ఒకటి.

**సువాసనలిచ్చే మొక్కలు:** లావెండర్ లాంటి మొక్కలు భావోద్వేగాల నియంత్రణలో ఉంచి, మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయి.

**పసుపు:** ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వేప: గాలిని శుద్ధి చేసే సహజ గుణం దీనికి ఉంది. పండ్ల చెట్లు: మామిడి, ఉసిరి, పనస,

**దానిమ్మ...** సంపదకూ, సమృద్ధికీ చిహ్నాలు. ఏ ప్రయత్నం చేసినా మంచి ఫలితం ఉంటుంది.

**వెదురు:** ఎదుగుదలకూ, దృఢత్వానికీ సూచిక.

**అశోక చెట్టు:** మానసిక ఉల్లాసాన్ని తెస్తుంది. సానుకూలతను పెంచుతుంది. □

# 'కాంత' అలరిస్తుంది: - భాగ్యశ్రీ



**ఈ షూటింగ్ ఎక్స్పీరియన్స్ ఎలా అనిపించింది?**
షూటింగ్ అంతా చాలా పాజిటివ్‌గా జరిగింది. అందరం ఫ్రెండ్స్‌లా ఉండేవాళ్ళం. ఇది నేను 2023లో విన్న కథ అప్పటి నుంచి మాకు జర్నీ ఉంది.

**డైరెక్టర్ సెల్వ గారి గురించి?**
డైరెక్టర్ సెల్వ గారు చాలా టాలెంటెడ్. చాలా మంచి మనిషి. ఆయన మంచితనం ఆయన రైటింగ్ లో కూడా కనిపిస్తుంది.

రవితేజ విజయ్ దేవరకొండ గారు ఇప్పుడు దుల్కర్ సల్మాన్ గారితో వర్క్ చేశారు .కాంత, ఆంధ్ర కింగ్ వరుసగా వస్తున్నాయి కదా ఎలా అనిపిస్తుంది?
చాలా ఎక్సయిట్ గా వుంది.. అదే టైంలో నెర్వస్ గా కూడా ఉంది. నా వరకు 100 ఇచ్చాను . తప్పకుండా మంచి రిజల్ట్ ఉంటుందని నమ్ముతున్నాను

కాంత సినిమా నుంచి ఒక యాక్టర్‌గా మీరు ఏమి ఆశిస్తున్నారు?
ఇప్పటివరకు ఒక కమర్షియల్ పెర్ఫార్మర్ అన్నారు. ఈ సినిమా తర్వాత భాగ్యశ్రీని ఒక పర్ఫార్మర్ కూడా అంటారని ఆశిస్తున్నాను. ఈ సినిమా నాకు నటించే అవకాశాన్ని ఇచ్చింది.

**నిర్మాతలు గురించి ?**
రానా గారు, దుల్కర్ గారు అద్భుతమైన నటులే కాదు.. సినిమా అంటే పాషన్ వున్న నిర్మాతలు కూడా. మంచి కథలు ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే తపనతో వుంటారు.

**సినిమాలో మ్యూజిక్ ఎలా ఉండబోతుంది?**
ఇందులో డాన్సింగ్ సాంగ్ నాకు చాలా ఇష్టం. మ్యూజిక్ కి చాలా మంచి స్కోప్ ఉన్న సినిమా ఇది.

**మీకు ఇష్టమైన జానర్?** నాకు యాక్షన్ రొమాన్స్ అన్ని జోన్స్ ఇష్టమే. అన్ని రకాల పాత్రలు చేయాలనే ఉంటుంది.

**తమిళ్‌లో భవిష్యత్తులో అక్కడ కూడా కంటిన్యూ చేసే అవకాశం ఉందా?** ఒక ఆర్టిస్ట్ కి లాంగ్వేజ్ బ్యారియర్ ఉండదు. మంచి స్క్రిప్ట్ ఉంటే చేస్తాను. అయితే నా ఫస్ట్ ప్రిఫరెన్స్ తెలుగు సినిమాకే.

**కొత్త సినిమాలు గురించి?**
తెలుగు సినిమాలు, అలాగే హిందీ సినిమాలు ఉన్నాయి. ప్రాజెక్ట్స్ గురించి మేకర్స్ అనౌన్స్ చేస్తారు.

# 14న 'రోలుగుంట సూరి' విడుదల



తెలుగు తెరపైకి విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రియలిస్టిక్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిన మూవీ 'రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరోహీరోయిన్లుగా తపస్వీ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై సౌమ్య చాందిని పల్లా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ హైదరాబాద్ తెలుగు ఫిలించాంబర్‌లో ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు అనిల్ కుమార్ పల్లా మాట్లాడుతూ - 'ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ సినిమాపై ప్రశంసలు కురిపించారు. రియల్ స్టిక్ విలేజ్ బ్యాక్ గ్రౌండ్ లో సినిమాను అద్భుతంగా చేశారని అభినందించడం మా చిత్ర యూనిట్‌కు కొత్త ఎనర్జీ వచ్చింది.

# తెర

## "రాజా సాబ్" నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్



భారతీయ సినిమా కీర్తిని కొత్త శిఖరాలకు చేరుస్తున్న రెబల్ స్టార్ ప్రభాస్ నట ప్రస్థానం నేటికి 23 ఏళ్లకు చేరుకుంది. ఈశ్వర్ సినిమాతో మొదలైన ప్రభాస్ సిల్వర్ స్క్రీన్ జర్నీ బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ సక్సెస్ ఫుల్ గా కొనసాగుతోంది. ఈశ్వర్ తర్వాత వరుసగా 'రాఘవేంద్ర', 'వర్షం', 'అడవిరాముడు', 'చక్రం', 'ఛత్రపతి', 'పౌర్ణమి', 'యోగి', 'మున్నా' 'బుజ్జిగాడు' 'బిల్లా', 'ఏక్‌నిరంజన్', 'డార్లింగ్', 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'రెబల్', 'మిర్చి' వరకు ప్రభాస్ జర్నీ ఒక ఫేజ్ అయితే బాహుబలితో ఆయన పాన్ ఇండియా జర్నీ బిగిన్ అయ్యింది. బాహుబలి రెండు చిత్రాల తర్వాత సాహో, సలార్, కల్కి 2898ఎడి సినిమాలతో దిగ్విజయంగా వరుస బ్లాక్ బస్టర్స్ అందుకుంటు న్నాడు. ప్రభాస్ రెండు సార్లు (బాహుబలి 2, కల్కి 2898 ఎడి) వెయ్యి కోట్ల రూపాయల గ్రాస్ సినిమాలను ఖాతాలో వేసుకోవడం ఒక రేర్ రికార్డ్. ఓవర్సీస్ మార్కెట్‌లో పది మిలియన్లకుపైగా వసూళ్లను సాధించిన తొలి హీరోగా ప్రభాస్ నిలిచారు.ప్రభాస్ తొలి సినిమా "ఈశ్వర్" 2022, నవంబర్ 11న ప్రేక్షకుల ముందు కొచ్చింది. ఈ రోజును రెబల్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్‌కు స్పెషల్ డేగా గుర్తుంచుకుంటారు. రెబల్ స్టార్ నట ప్రస్థానం 23 ఏళ్లకు చేరుకున్న సందర్భాన్ని సెలబ్రేట్ చేస్తూ ఆయన కొత్త సినిమా "రాజా సాబ్" నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. .మరోవైపు రెబల్ స్టార్ ప్రభాస్ భారీ పాన్ ఇండియా సినిమాలు లైనప్ చేసుకున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిలింస్ నిర్మిస్తున్న సలార్ 2, సందీప్ వంగా దర్శకత్వంలో టీ సిరీస్ నిర్మిస్తున్న స్పిరిట్, హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు.

## '12A రైల్వే కాలనీ' ట్రైలర్ లాంచ్



అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ "12A రైల్వే కాలనీ' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పోలిమేర సిరీస్‌తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు.దర్శకుడు నాని కాసరగడ్డ, డా.విశ్వనాథ్ రాసిన థ్రిల్లింగ్ కథను తెరపై సస్పెన్స్‌తో ప్రజెంట్ చేశారు. అల్లరి నరేష్ ఈసారి తన కామెడీ ఇమేజ్‌కి భిన్నంగా, ఇంటెన్స్ ఎమోషన్స్ తో అదరగొట్టారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ... అందరికి నమస్కారం. నా సామి రంగ సక్సెస్ తర్వాత నిర్మాత శ్రీనివాస్ గారు నాతో మరో సినిమా చేయాలని అన్నారు. నచ్చిన కథ ఉంటే చూడమని చెప్పారు.

## 'గత వైభవవం విజువల్స్' అద్భుతం - నాగార్జున



ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎపిక్ ఫాంటసీ డ్రామా గత వైభవవం. సింపుల్ సుని దర్శకత్వంలో సర్వేగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బ్యానర్స్ పై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం ఈ నెల 14న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో, ఉత్తర అమెరికా, కెనడాలో విడుదల చేయనున్నారు. ఈ రోజు మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. కింగ్ నాగార్జున ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక గ్రాండ్ గా జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. గత వైభవం సినిమా గురించి ఆషికా చెబుతూనే ఉంది. తను ఈవెంట్‌కి రావాలని అడగడం, నేను వచ్చేయడం వెంటనే జరిగిపోయాయి. నాకు గత జన్మల సినిమాలంటే చాలా ఇష్టం. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ కావాలని కోరుకుంటున్నాను. హీరో దుష్యంత్ మాట్లాడుతూ.. కొంతమందిని దూరం నుంచి చూసినప్పుడు అభిమానం కలుగుతుంది. పర్సనల్ గా మీట్ అయి వాళ్ల గురించి తెలుసుకున్నప్పుడు అభిమానం ఇంకా పెరుగుతుంది. నాగార్జున గారు అలాంటి స్టార్. నాగార్జున గారి ఐకానిక్ సినిమా శివ నవంబర్ 14న రి రిలీజ్ అవుతుంది. మా సినిమా కూడా వస్తుంది. ఈ సమయంలో కూడా ఆయన మా సినిమాకి ప్రమోట్ చేయడానికి రావడం అనేది ఆయన గొప్పతనాన్ని తెలియజేస్తుంది. హీరోయిన్ ఆషికా రంగనాథ్ అ తెలుగు ప్రేక్షకులందరికీ నమస్కారం. చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతూ చాలా ప్రేమతో ఈ సినిమా చేశాం. డైరెక్టర్ సింపుల్‌సుని మాట్లాడుతూ.. అందరికి నమస్కారం గత వైభవం. అంటే ఒక సామ్రాజ్యం గుర్తుకొస్తుంది. ఆ సామ్రాజ్యానికి రాజులా నాగార్జున గారు వచ్చారు. చైతన్యరెడ్డి మాట్లాడుతూ.. ఈ అవకాశం ఇచ్చిన దీపక్ కి థాంక్యూ.

## 'సీత ప్రయాణం కృష్ణతో' 14న రిలీజ్



ఖుషి టాకీస్ పై నిర్మించిన 'సీత ప్రయాణం కృష్ణతో' నవంబర్ 14న గ్రాండ్‌గా రిలీజ్ అవబోతుంది. ఈ సినిమాలో రోజా భారతి, దినేష్, సుమంత్, అనుపమ నటించారు. ఈ చిత్రానికి దర్శకుడిగా దేవేందర్. ఈస్ట్ వెస్ట్ ఎంటర్టైన్మెంట్స్ ప్రెజెంటర్‌గా డా. రాజీవ్, డా.రోజా భారతి ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. శరవణ వాసుదేవన్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రం ప్రెస్ మీట్ గ్రాండ్‌గా హైదరాబాద్‌లో నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో..హీరోయిన్ డా.రోజా భారతి మాట్లాడుతూ .. ముందు గా ఈ సినిమాకి పని చేసిన ప్రతి ఒక్కరికి థాంక్స్ చెప్తున్నా. నన్ను నమ్మి అందరు ఈ సినిమా నాది అని అనుకుని అందరూ పనిచేసారు కాబట్టే ఇవాళ రిలీజ్ వరకు రాగలిగాం. హీరో దినేష్ మాట్లాడుతూ ... నాకు సినిమాలో అవకాశం ఇచ్చిన రోజాగారికి, రాజీవ్‌గారికి చాల థాంక్స్. హీరోయిన్ రాఖి శర్మ మాట్లాడుతూ.... నాకు ఈ మూవీలో ఛాన్స్ ఇచ్చిన రాజీవ్ గారికి, రోజా భారతి గారికి చాలా థాంక్స్. ..డా.రాజీవ్ మాట్లాడుతూ.... ఇక్కడకి వచ్చిన మీడియా మిత్రులకి, నా సినిమా ఫామిలీకి చాలా థాంక్స్.

## వరల్డ్ టెస్టు ఛాంపియన్:
# భారత్‌కు అగ్ని పరీక్ష
### ఫైనల్స్‌కు కీలకం.. పాయింట్ల పట్టికలో బిగ్ ఛేంజింగ్

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా, టీమిండియా మధ్య జరిగే సిరీస్ తర్వాత డబ్ల్యూటిసి పాయింట్ల పట్టికలో పెద్ద మార్పు ఉంటుంది. ఈ రెండు టెస్ట్‌ల సిరీస్ 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో ఒక మలుపు కానుంది. డబ్ల్యూటిసి పాయింట్ల పట్టికలో రెండు జట్ల స్థానాలను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. దీంతో ఈ సిరీస్‌ను కైవసం చేసుకుని ఫైనల్స్‌కు చేరే విషయమై రెండు జట్లుకూ అగ్ని పరీక్ష లాంటిదే. ఈనెల 14న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభమయ్యే భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ సిరీస్ రెండు జట్లకు కీలకం. గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకోవడం సులభం అవుతుంది. ప్రస్తుతం భారత్ 61.90 పాయింట్లతో డబ్ల్యూటిసి స్టాండింగ్స్‌లో మూడవ స్థానంలో ఉంది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను డ్రా చేసుకుని వెస్టిండీస్‌ను ఓడించిన తర్వాత,



దక్షిణాఫ్రికాతో జరిగే ఈ సిరీస్ భారత్‌కు నిజమైన పరీక్ష అవుతుంది. బ్యాటింగ్‌లో శుభ్‌మాన్ గిల్ (946), బౌలింగ్‌లో మహమ్మద్ సిరాజ్ (33 వికెట్లు) భారత జట్టు కీలక ఆటగాళ్లలో ఉన్నారు. వచ్చే ఏడాది ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందు స్పిన్ స్నేహపూర్వక పిచ్‌లపై స్వదేశంలో ఆధిపత్యం చెలాయించడం ద్వారా భారత జట్టు తన స్థానాన్ని పదిలం చేసుకోవాలని చూస్తుంది. గతఫైనల్ విజేతలైన దక్షిణాఫ్రికా50 పాయింట్లతో నాల్గవస్థానంలో ఉంది. పాకిస్తాన్‌తో జరిగిన సిరీస్‌ను 1-1తో సమంచేసిన తర్వాత, టోనీ డి జోర్జీ (175), సైమన్ హార్మర్ (13 వికెట్లు) నేతృత్వంలోని జట్టు వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరుకోవడానికి ఈ చక్రంలో బలమైన ఆరంభం చేయాలని చూస్తోంది. ముఖ్యంగా, దక్షిణాఫ్రికా 2019 తర్వాత తొలిసారిగా భారతదేశంలో టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. కోల్‌కతా, గౌహతిపిచ్‌లు స్పిన్ బౌలర్లకు అనుకూల మైనప్పటికీ, మహమ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్ వంటి ఫాస్ట్ బౌలర్లతో కూడిన భారత పేస్ బ్యాటరీ కూడా చాలా ప్రమాదకరమైనది. ఈ మ్యాచ్ స్టాండింగ్స్‌లో మొదటి నాలుగు జట్లలో స్థానం కోసం పోటీని మరింత తీవ్రతరం చేస్తుంది. ఈ సిరీస్‌లో భారత్ రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే, టీమిండియా పాయింట్ల పట్టికలో రెండవ స్థానానికి చేరుకుంటుంది. ఇదేసమయంలో దక్షిణాఫ్రికా గణనీయమైన ఓటమిని చవిచూస్తుంది. వారు నాల్గవ స్థానం నుండి ఆరో స్థానానికి పడిపోతారు. దక్షిణాఫ్రికా రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే, టీమిండియా ఐదవ స్థానానికి చేరుకుంటుంది.



## జాతీయ స్విమ్మింగ్‌లో యు జిది కి కాంస్యం

**న్యూఢిల్లీ:** చైనాకు చెందిన 13 ఏళ్ల యు జిది జాతీయ క్రీడలలో సంచలనం సృష్టించింది. తన 13వ పుట్టినరోజు తర్వాత ఒక నెల లోపే, చైనా సంచలనం యు జిది షెన్‌జెన్‌లో జరిగిన జాతీయ క్రీడల ఈతలో 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీలో విజయం సాధించి తన తొలి ఆసియా రికార్డును సృష్టించింది. యు 2:07.41 సమయంతో 2012 లండన్ క్రీడల్లో 16 సంవత్సరాల వయసులో 2:07.57 సమయంలో ఒలింపిక్ స్వర్ణం గెలుచుకున్న యే షివెన్ ఆసియా రికార్డును అధిగమించింది. గత సంవత్సరం చైనా ఒలింపిక్ ట్రయల్స్‌లో యు చాలా ప్రదర్శన నిరాశాజనకంగా సాగింది. అక్కడ ఆమె 11 సంవత్సరాల వయసులో పారిస్ క్రీడలకు అర్హత సాధించలేకపోయింది. అయితే మే నెలలో, ఆమె 400 ఐఎమ్, 200 బటర్‌ఫ్లైలలో జాతీయ టైటిళ్లను గెలుచుకుంది. అలాగే సింగపూర్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లకు అర్హత సాధించడానికి 200 ఐఎమ్‌లో రన్నరప్‌గా నిలిచింది. అక్కడ ఆమె చైనా 4+200 ఫ్రీస్టైల్ రిలే జట్టులో కాంస్య పతకంతో అతి పిన్న వయస్కురాలిగా నిలిచింది. ఆమె సింగపూర్ మీట్‌లో తన మూడు వ్యక్తిగత ఈవెంట్లు, 200 మరియు 400, 200 బటర్ ఫ్లైలలో నాల్గవ స్థానంలో నిలిచింది. 2022 ఆసియా క్రీడల ఛాంపియన్, 20 ఏళ్ల రన్నరప్ యు యిటింగ్ కంటే యు దాదాపు సెకను వేగంగా పూర్తి చేసింది. ఈ ఈవెంట్‌లో ఇప్పటివరకు ఎనిమిది మంది ఈతగాళ్ళు మాత్రమే వేగంగా దూసుకెళ్లారు.

ఆట

# వన్డేలో రోహిత్ నం.1
### నాలుగు, ఐదో స్థానాల్లో గిల్, కోహ్లీ




**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ ప్లేయర్ల హవా కొనసాగుతోంది. బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలోను, విరాట్





కోహ్లీ ఐదో స్థానంలో ఉన్నారు. గత ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానంలో ఉండిన విరాట్ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఐదో స్థానానికి ఎగబాకాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో ఘోరంగా విఫలమైన బాబర్ రెండు స్థానాలు కోల్పోయి ఏడుకు పడిపోయాడు. టాప్-10లో మరో టీమిండియా స్టార్ ప్లేయర్ శ్రేయస్ అయ్యర్ ఆస్ట్రేలియా సిరీస్‌లో హాఫ్ సెంచరీతో రాణించి తొమ్మిదో స్థానాన్ని కాపాడుకున్నాడు. ఈ ర్యాకింగ్స్‌లో ఇద్దరు పాకిస్తాన్ ఆటగాళ్లు భారీ లబ్ది పొందారు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో రాణించినందుకు యువ ఆల్‌రౌండర్ సైమ్ అయూబ్ ఏకంగా 18 స్థానాలు మెరుగుపరచుకుని 36కు చేరుకున్నాడు. అదే దక్షిణాఫ్రికా సిరీస్‌లో పర్వాలేనిపించి, ఈ నెల 11న శ్రీలంకతో జరిగిన వన్డేల్లో శతక్కొట్టిన పాక్ టీ20 కెప్టెన్ సల్మాన్ అఘా 14 స్థానాలు మెరుగుపరచుకుని 16కు చేరాడు. ఇక బౌలర్ల విషయానికి వస్తే ఆఫ్ఘనిస్తాన్ స్టార్ రషీద్ ఖాన్ టాప్ ప్లేస్‌లో కొనసాగుతుండగా, ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా అర్చర్ 2 స్థానాలు మెరుగుపర్చుకుని మూడో ప్లేస్‌కు చేరాడు. దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.





## ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో పతకాల వేటలో అభిషేక్, దీపిక

**న్యూఢిల్లీ:** ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2025లో భారత్ ఆర్చలు పతకాల కోసం పోరు కొనసాగిస్తూ ముందుకు దూసుకు వెళుతున్నారు. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో బుధవారం జరిగిన ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్లు ఎలిమినేషన్ రౌండ్ చివరి రోజున తమ ఘన విజయాన్ని కొనసాగించి మరో రెండు పతకాల మ్యాచ్‌లకు చేరుకున్నారు. ఇందులో భాగంగా భారత్ ఆర్చర్లు అభిషేక్ వర్మ, దీపిక కుమారి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌కు చేరుకుంది. మరోపక్క రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ద్వయం అన్షిక కుమారి, యశ్దీప్ భోగే ద్వయం కాంస్య పతకం కోసం పోరాడనుంది. భారత రికర్వ్ మిక్స్‌డ్ జట్టు తమ సెమీఫైనల్ మ్యాచ్‌లో చైనీస్ తైపీ చేతిలో ఓడిపోయినా కానీ ఈ నెల 14న దక్షిణ కొరియాతో జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో పోరాడనుంది. అదేవిధంగా భారత కాంపౌండ్ జట్టు ఎలిమినేషన్ రౌండ్ అంతటా ఆధిపత్యం ప్రదర్శించి, ఫైనల్‌కు చేరుకునే మార్గంలో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్, వియత్నాం, కజకిస్తాన్‌లను ఓడించింది. ఇక ఫైనల్లో, భారత జంట ఇప్పుడు బంగ్లాదేశ్‌తో తలపడనుంది, బంగ్లాదేశ్ కూడా సెమీఫైనల్‌లో టాప్ సీడ్ దక్షిణ కొరియాను ఓడించి భారీ విజయాన్ని సాధించింది. దీనితో, భారత్ ఇప్పుడు మూడు కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌ల ఫైనల్‌లో ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇదే సమయంలో ఈ నెల 13న బంగారు పతకాల కోసం పోరాడుతుంది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో సెమీఫైనల్లో వారికి ఇద్దరు ఆర్చర్లు కూడా ఉన్నారు.

## జపాన్ మాస్టర్స్‌లో రెండో రౌండ్‌కు లక్ష్య



**న్యూఢిల్లీ:** జపాన్ మాస్టర్స్ 2025లో భారత్ షట్లర్ లక్ష్య సేన్ రెండో రౌండ్ కు చేరుకోగా, కిరణ్ జార్జ్, ఆయుష్ శెట్టి ఓటమి పాలయ్యారు. కుమామోటో నగరంలో బుధవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 ఈవెంట్ అయిన జపాన్ మాస్టర్స్‌లో భారత క్రీడాకారుడు ల8క్ష్య మరో రౌండ్‌కు దూసుకెళ్లాడు. ఏడో సీడ్ లక్ష్య 39 నిమిషాల్లో ప్రపంచ 26వ ర్యాంకర్ కోకి వటనాబేను 21-12, 21-16 తేడాతో ఓడించాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం కోసం అతడు సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జాసన్ టెహ్‌తో తలపడతాడు. అయితే, కిరణ్, ఆయుష్ ఇద్దరూ వరుస గేమ్‌లలో ఓడిపోయారు. మలేషియాకు చెందిన కోక్ జింగ్ హాంగ్ కిరణ్‌ను 22-20, 21-10 తేడాతో ఓడించగా, నాల్గవ సీడ్ జపనీస్ కోడై నరోకా 21-16, 21-11 తేడాతో శెట్టిని ఓడించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్ మరియు రుత్విక గద్దె నాలుగు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని చివరికి అమెరికన్ల ప్రెస్లీ స్మిత్ మరియు జెన్నీ గై చేతిలో 12-21, 21-19, 20-22 తేడాతో ఓడిపోయారు. ఈ నెల 13న పురుషుల సింగిల్స్ ప్రారంభ రౌండ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ మరియు తరుణ్ మన్నెపల్లి కూడా పోటీ పడతారు

## వచ్చే ఐదేళ్లలో రూ. 99 లక్షల కోట్లకు
# 'ప్రైవేటు' సంపద




**ముంబయి, నవంబరు 12:** ఆసియాలోని ప్రైవేటు వ్యక్తులు కుటుంబ బిజినెస్ చూసుకుంటున్న బిలియనీర్లలో వారసులు ముందుకురాకపోవడం, మరికొందరు శ్రద్ధ, ఆసక్తిచూపించకపోవడంవల్ల వారి బిలియన్ ఆస్తుల సామ్రాజ్యాలు వారసులకు ఇవ్వలేకపోతున్నారు. మరికొన్ని కుటుంబాల్లో అయితే వారసులకు సరైన అవగాహన, శ్రద్ధ లేకపోవడం కూడా కారణం అవుతోంది. యుబిఎ ప్రైవేట్‌బ్యాంకు, బోస్టన్ కన్సల్టింగ్‌గ్రూప్, నేషనల్‌యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో ఎంతో ఒత్తిడి వస్తే తప్ప ఫ్యామిలీ బిజినెస్‌లు విస్తరణపరంగా లేవని వెల్లడించాయి. కొన్ని కుటుంబాల్లో అయితే న్యాయపరమైన చిక్కుల్లో ఉన్నాయి. ఆస్తులు స్తంభనకు గురవుతున్నాయి.ప్రైవేటు సంపద మొత్తం 2029 నాటికి 99 లక్షలకోట్ల డాలర్లకు చేరుకోగలదని అంచనా. మొత్తం 228 హెచ్‌ఎన్‌ఐలను ఏడు ఆసియన్ మార్కెట్లలో సర్వేచేస్తే మొత్తం 46 కుటుంబ బిజినెస్‌లలో 91శాతం మంది తమ కుటుంబంలోనే లీడర్‌షిప్ ఉండాలని కోరుకుంటున్నారు. 28శాతం మంది వారసులకు ఆసక్తిలేదని, 24 శాతం మంది వారసులు బిజినెస్ నిర్వహణకు సిద్ధం కాలేదని తేలింది.

28శాతం మంది బిజినెస్ లీడర్లుమాత్రం తాము ఎవరికి ఇవ్వాలనేది కూడా చెప్పలేదు. బోస్టన్‌గ్రూప్ సర్వేప్రకారం ప్రైవేటు సంపద భారీగానే పెరుగుతూ వస్తోంది. సింగపూర్‌కు 765 బిలియన్ డాలర్లు వస్తే హాంకాంగ్ 975 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఈ మొత్తంలో 80శాతం ఇతర ఆసియా దేశాలనుంచే వస్తోంది. వారసులపై సరైన నిర్ణయాలుతీసుకోక పోవడంవల్ల ఎక్కువ కుటుంబ బిజినెస్‌లు న్యాయవివాదాల్లోను, అతితక్కువ పరివర్తన దశలోను ఉన్నాయి. ఈతరుణంలో ఫ్యామిలీ బిజినెస్ బిలియనీర్లు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతో ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బిజినెస్ వ్యవహారాలను అప్పగించడంలో కొన్ని ఫ్యామిలీ గ్రూప్‌లు ఆరోగ్యసంక్షోభంకారణంగాను అప్పగించలేదు. 43శాతం మంది మాత్రం పరిస్థితులు డిమాండ్‌చేస్తే బిజినెస్‌బాధ్యతలు తమ వారసులకు అప్పగించాల్సి ఉంటుందని వెల్లడించారు.

# టాటాట్రస్టుల్లో నెవెల్లీటాటా, భాస్కర్‌భట్‌ల నియామకం
### నియామక విధానంపై నిరసన తెలిపిన వేణుశ్రీనివాసన్



**ముంబయి, నవంబరు 12:** టాటాట్రస్టుల్లో బోర్డు సభ్యుల నియామకాల్లో వివాదాలు తారస్థాయికి చేరుతున్నాయి. మెహ్లీమిస్త్రీకి శాశ్వత నియామకం రద్దయిన తర్వాత మళ్లీట్రస్టుల్లో నియామకాలు వివాదం అవుతున్నాయి. ఇపుడు రతన్‌టాటా ట్రస్టులో వేణుశ్రీనివాసన్‌కూడా ట్రస్టుసభ్యులుగా ఉన్నారు. ట్రస్టు వైస్‌ఛైర్మన్‌కూడా అయిన ఆయన నెవెల్లీ టాటా, భాస్కర్‌భట్‌ల నియామకానికి అనుసరించిన విధానాన్ని వ్యతిరేకించారు. అజెండాల్లో ఈ అంశాలు లేవని, నెవెల్లీ, భట్‌లు సర్ దొరాబ్జీ టాటాట్రస్టుల్లో బోర్డు సభ్యుల్లో నియమితులు కావడం నిబంధనలకు విరుద్ధమనిఅన్నారు. సర్‌రతన్‌టాటా ట్రస్టు, సర్ దొరాబ్జీ టాటా ట్రస్టులు టాటాట్రస్టుల్లో రెండు అతిపెద్ద కుటుంబ ట్రస్టులని చెప్పాలి. టాటాసన్స్‌లో ఈ రెండు ట్రస్టులు 51శాతం వాటాలతో ఉన్నాయి. అజెండాలోలేని అంశాన్ని తీర్మానించే సమయంలో సమగ్రచర్చలు జరగాల్సి ఉంటుందని, ఏకపక్షంగా తీర్మానాలు చెల్లుబాటుకావని సమావేశంలో వాదించినట్లు సమాచారం. ముందు ఎస్‌డిటిటి సమావేశంతర్వాత ఎస్‌ఆర్‌టిటి సమావేశాలు జరిగాయి. మహారాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన సెప్టెంబరు ఒకటవ తేదీ ఆర్డినెన్స్ ప్రకారం ట్రస్టీల కాలపరిమితి 3ఏళ్లవరకూ ఉంటుంది. జీవితకాల ట్రస్టీల సంఖ్యమాత్రం పరిమితంగానే ఉంటుంది. ఎస్‌డిటి సమావేశంలో న్యాయవాది ట్రస్టీ డేరియస్ ఖంబాట్టా, ప్రమిత్‌ఝువేరీలు నెవిల్లీ టాటా, భాస్కర్ భట్‌ల నియామకాలను ప్రతిపాదించారు. సభ ట్రస్టు సభ్యుడు విజయ్‌సింగ్ ముందు మౌనంగానే ఉన్నా తర్వాత అంగీకరించారని సమాచారం. ఎగ్జిక్యూటివ్ కమిటీని రద్దుచేసి ఛైర్మన్ నోయిల్‌టాటాకే మొత్తం అధికారాలను కట్టబెడుతూ తీర్మానించారు. ఈ కమిటీలో వేణుశ్రీనివాసన్, విజయ్‌సింగ్, నోయల్ టాటా, మెహ్లిమిస్త్రీలు సభ్యులుగాఉన్నారు. ఇక రతన్‌టాటా ట్రస్టు సమావేశంలో డారియస్ ఖంబాట్టా, జెహంగీర్, వీరిద్దరి నియామకాలు ప్రతిపాదించారు. దీనితో వేణుశ్రీనివాసన్ వ్యతిరేకించినట్లు అజెండాలోలేని అంశమని స్పష్టం చేసినటస్లు సమాచారం. ఈ తీర్మానం 'ఇతరత్రా ఏ అంశం అయినా' అన్న ప్రాతిపదికన ప్రవేశపెట్టారని ఆయన నిరసన తెలిపినట్లు సమాచారం.

## మూడోరోజూ లాభాల్లో స్టాక్ సూచీల ర్యాలీ
### బీహార్ ఎగ్జిట్‌పోల్స్ సెంటిమెంట్ మద్దతు



**ముంబయి, నవంబరు 12:** దేశీయ ఈక్విటీ సూచీలు మూడోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. నిఫ్టీ 25,850 మార్కు ఎగువన స్థిరపడింది. అమెరికా భారత్‌లమధ్య వాణిజ్య డీల్‌పై సానుకూల స్పందనలు రావడంతో ఇన్వెస్టర్ సెంటిమెంట్ బలపడింది. దీనికితోడు బీహార్ ఎగ్జిట్‌పోల్స్‌లో ఎన్డీయే దూకుడు ఉన్నట్లు రావడంతో స్టాక్‌సూచీలు మరింతగాపెరిగాయి. ఎస్‌అండ్‌పి బిఎస్‌ఇ సెన్సెక్స్ 595.19 పాయింట్లుపెరిగి 84,466.51 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 180.85 పాయింట్లుగెలిచి 25,875.80 పాయింట్లవద్ద స్థిరపడింది సెన్సెక్స్ నిఫ్టీలు రెండూ కూడా 1.50 శాతంచొప్పున పెరిగాయి. ఇక బిఎస్‌ఇమిడ్‌క్యాప్‌సూచీ 0.44శాతంపెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.76శాతం పెరిగింది. మార్కెట్ సెంటిమెంట్ బలంగా కనిపించింది. సూచీలపరంగా చూస్తే నిఫ్టీ ఐటి సూచీ 2.04శాతం, ఆటో సూచీ 1.24శాతం, ఫార్మాసూచీ 1శాతంచొప్పున నిఫ్టీలో ర్యాలీతీసాయి. ఇక రియాల్టీ సూచీ 0.49శాతం, మెటల్‌సూచీ 0.16శాతం చొప్పున క్షీణించాయి. 10ఏళ్ల యుఎస్ బాండ్ లు 0.32శాతం క్షీణించి 6.478శాతంగామాత్రమే ఉంది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.50వద్ద ముగిసాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ డిసెంబరు 5 నాటికి 1,24,307 రూపాయలుగా ఉంది. కమోడిటీ పరంగాచూస్తే బ్రెంట్‌ముడిచమురు 57 సెంట్లు తగ్గి 65.59 డాలర్లుగా నడిచాయి. ఇక గ్లోబల్ మార్కెట్లలోయూరోపియన్ ఎగువన ముగిసాయి. అమెరికా ప్రభుత్వషట్‌డౌన్‌కు తెరపడటంతో యూరో సూచీలన్నీ లాభాల్లోనే ముగిసాయి. జర్మనీ ద్రవ్యోల్బణం 2.3శాతంగా అక్టోబరులో ఉంది. వినియోగరంగ ధరలప్రకారంచూస్తే యూరోపియన్ యూనియన్ దేశాల్లో 2.4శాతంగా రిటైల్‌ద్రవ్యోల్బణం నమోదయింది. ఇసిబి వడ్డీరేట్లను స్థిరంగానే కొనసాగించింది. ఆసియా మార్కెట్లు ఎగువన ముగిసాయి. ఆసియా దేశం అమెరికా షట్‌డౌన్‌కు తెరపడుతుండటంతో సూచీలు వడివడిగా కదిలాయి. ఇక అమెరికా డౌజోన్స్ సూచీ ర్యాలీ తీసింది. నాస్‌డాక్ కాంపోజిట్‌లో మాత్రం ఇన్వెస్టర్లు టెక్నాలజీ స్టాక్స్‌నుంచి విత్‌డ్రాచేసారు. 30స్టాక్ డౌజన్స్ 559.33 పాయింట్లుపెరిగింది. ఎస్‌అండ్‌పి500 కూడా 0.21శాతంపెరిగింది. టెక్నాలజీ హెవీస్టాక్స్ ఉన్న నాస్‌డాక్ 0.25శాతం నష్టపోయింది.

## దిగివచ్చిన రిటైల్‌ద్రవ్యోల్బణం
### ఆహారద్రవ్యోల్బణం మరింతగా తగ్గుదల

**న్యూఢిల్లీ, నవంబరు 12:** రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబరునెలలో 0.25శాతంగా నమోదయింది. గతనెలలో 1.54శాతం ఉన్న ద్రవ్యోల్బణం సానుకూల గణాంకాలతో దిగివచ్చిందని కేంద్ర అర్థగణాంకశాఖ పథక నిర్వహణశాఖ వెల్లడించింది. ఆహార ధరలు రికార్డుస్థాయిలో తగ్గాయి. ఇటీవలి జిఎస్టీ సేవల తగ్గింపు, హేతుబద్ధీకరణతో విభిన్నరంగాల్లో ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆహారద్రవ్యోల్బణం అక్టోబరులో మైనస్ 5.02శాతంకు వచ్చింది. గ్రామీణప్రాంతాల్లో మనస్ 4.85శాతం, పట్టణప్రాంతాల్లో మైనస్ 5.18శాతం చొప్పున నమోదయింది. ప్రస్తుత కన్సూమర్ ప్రైస్ ఇండెక్స్ సిరీస్‌లో అక్టోబరులోనే ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. ఇక హౌసింగ్ ద్రవ్యోల్బణం 2.96శాతంగా ఉంది. ఇక విద్యారంగపరంగా గ్రామీణ పట్టణప్రాంతాల్లో స్వల్పంగా తగ్గాయి. 3.49శాతం నమోదయింది. అదే సెప్టెంబరులో 3.44 శాతంగా ఉంది. ఆరోగ్యరంగపరంగా ద్రవ్యోల్బణం 3.86శాతంగా ఉంది.

సెప్టెంబరులో ఉన్న 4.39శాతంనుంచి గణనీయంగా తగ్గింది. రవాణా, కమ్యూనికేషన్ రంగంలో 0.94 శాతంగా ఉంది. ఖర్చులు తగ్గడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇంధనం, విద్యుత్ పరంగా స్థిరంగా 1.98శాతంవద్దనే ఉంది. ఇక రాష్ట్రాలపరంగాచూస్తే కేరళలో అత్యధికంగా 8.56శాతంగా ఉంది. జమ్ముకాశ్మీర్‌లో 2.95శాతం, కర్ణాటకలో 2.34 శాతంగా ఉంది. ఇక ఢిల్లీ, అస్సాం, జార్ఖండ్, బీహార్‌లలో తక్కువ స్థాయిలోనే రిటైల్‌ద్రవ్యోల్బణం నమోదయింది. మైనస్ 1.97శాతంగా ఉంది. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో మైనస్ 1.71శాతం, మధ్యప్రదేశ్‌లో మైనస్ 1.62శాతంగా నడిచింది.

## దలాల్‌స్ట్రీట్‌లోకి భారీ డిమాండ్‌తో 'గ్రో' ఎంట్రీ!

**ముంబయి, నవంబరు 12:** 'గ్రో' కంపెనీ ఐపిఒ బుధవారం దలాల్‌స్ట్రీట్‌లోకి వచ్చింది. ఇప్పటికే అంచనాలకు మించి 17.60 రెట్లు అధిక బిడ్లను అందుకున్న కంపెనీ ఇష్యూధరను రూ.100గా నిర్ణయించింది. గ్రో మార్కెట్‌ప్రీమియం ట్రేడింగ్‌లో స్టాకును 4శాతం ప్రీమియంకకు లిస్టింగ్‌చేసింది. ఐపిఒ 6632.30 కోట్లుగా ఉంది. మొత్తంగా 6,41, 87,00400 షేర్లకు బిడ్లు వచ్చాయి. అయితే కేవలం 36,47,76,528 షేర్లకు మాత్రమే ఐపిఒ ఉంటుంది. సంస్థాగత ఇన్వెస్టర్లు 22.02 రెట్లు కొనుగోళ్లు జరిపితే ఇతర ఇన్వెస్టర్లు 14.20 రెట్లు ఇన్వెస్ట్‌మెంట్ చేసారు.

రిటైల్ ఇన్వెస్టర్లుకూడా 9.43రెట్లు కొనుగోళ్లు జరిపినట్లు అంచనా. తాజా ఈక్విటీ మొత్తం రూ.1060 కోట్లుగా ఉంది. ఆఫర్‌ఫర్ సేల్‌కింద 5572.30 కోట్లు ఉంటుందని కంపెనీ చెపుతోంది. పీక్ 15 భాగస్వాములు రిబ్బిట్ క్యాపిటల్ ఫైవ్, సీక్వోయా క్యాపిటల్ గ్లోబల్ గ్రోత్‌ఫండ్-3 ఇతర సంస్థలు ఇప్పటికే ఇన్వెస్టర్లుగా ఉన్నాయి. గ్రోబిజినెస్ విస్తరణకు ఈ నిధులు వెచ్చిస్తారు. రూ.225 కోట్లు బ్రాండ్ బిల్డింగ్, మార్కెట్ పనితీరు పెంచుకోడానికి ఖర్చువుతుంది. 205కోట్ల ఎన్‌బిఎఫ్‌సికి కేటాయిస్తారు. గ్రో క్రెడిట్‌సెర్వ్ టెక్నాలజీకి ఈనిధులు వెచ్చిస్తారు. మరో 167.5కోట్లు ఫండ్ మార్జిన్ ట్రేడింగ్ ఆపరేషన్స్‌లో ఉంటాయి. గ్రో ఇన్వెస్ట్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఖర్చువుతాయి. ఇక 152.5 కోట్లు క్లౌడ్, మౌలికవసరుల అప్‌గ్రేడేషన్ కోసం కేటాయించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.